
సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 351
మంగళవారం 12-3-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

### ఆస్కార్ వేదికపై అణుబాంబు మోత



అణుబాంబు సౌండ్ అదిరింది.. క్రిస్టోఫర్ కల నిజమైంది... 'ఆర్ఆర్ఆర్' నాటు నాటు ఆకర్షణగా నిలిచింది. ఫేక్ చప్పట్లతో మెస్సీ (శునకం), అమిర్ ఖాన్ 'పీకే' తరహాలో జాన్ ప్రత్యక్షం కావడం చర్చలకు దారి తీసింది. ఇలా ఆనందాలు, విద్దూరాలతో ఆస్కార్ అవార్డు వేడుక జరిగింది.

12లో



### ఇన్ని రోజులు ఏం చేశారు?

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా పార్టీల విరాళాల వివరాలను మంగళవారం సాయంత్రంలోగా ఈసీకి ఇవ్వాల్సిందేనని సుప్రీం తేల్చిచెప్పింది.

వివరాలు 6లో ▸



### గాల్లో కుదిపేసిన విమానం

ఆస్ట్రేలియా నుంచి చిలీకి వెళ్తున్న ఒక విమానం గాల్లో ఒక్కసారిగా కుదుపులకు లోనవడంతో 50 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



### నారీశక్తి అభివృద్ధికి..

ఎన్నికల్లో ఎన్డీఏ హ్యాట్రిక్ ఖాయమని.. గెలిచాక మహిళల అభివృద్ధికి మరింతగా పాటుపడతామని ప్రధాని మోదీ తెలిపారు.

వివరాలు 6లో ▸



### సాయిబాబా విడుదల సబబే

ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా విడుదలపై స్టే కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### చేతులెత్తి మొక్కుతున్నాం..



ఎమ్మెల్సీలుగా రాజ్యాంగబద్ధంగా నామినేట్ అయిన తమ అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ.. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా తమ పేర్లను ఆమోదించాల్సిందిగా చేతులెత్తి మొక్కుతున్నట్లు పేర్కొన్నారు.

- వివరాలు 2లో▶

### సికింద్రాబాద్-విశాఖ మధ్య మరో వందేభారత్



తెలుగు రాష్ట్రాల మధ్య మూడోది, సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రెండో వందేభారత్ రైలును మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

- వివరాలు 14లో▶

### నేటి నుంచి ఉపవాస దీక్షలు



హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా నెలవంక కనిపించిందని, కాబట్టి ఈ నెల 12 నుంచి రంజాన్ నెల ప్రారంభమవుతుందని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) కన్వీనర్ సయ్యద్ ఇబ్రహీం హుస్సేని సజ్జాద్‌పాషా తెలిపారు.

- వివరాలు 14లో▶

### చిన్న షేర్లలో అవకతవకలు



చిన్న, మధ్యతరహా స్టాక్స్‌లో అవకతవకలు జరుగుతున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి పేర్కొన్నారు. కొంతమంది అసహజ లావాదేవీలకు తెరతీసినట్లు గుర్తించామని తెలియజేశారు.

- వివరాలు 13లో▶



# నేను గేట్లు తెరిస్తే..
# బీఆర్ఎస్ ఉండదు

**మామాఅల్లుడు, తండ్రీకొడుకులే మిగులుతారు • మణుగూరు ప్రజాదీవెన సభలో సీఎం**

- మా ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు
- ఈ తీరును ఆ పార్టీ ఎమ్మెల్యేలే ఈసడించుకున్నారు
- అందుకే నాకు టచ్‌లోకి వస్తున్నారు.. అండగా ఉంటామంటున్నారు
- మీ పిల్లి శాపాలకు ప్రభుత్వం కూలిపోదు
- 6 గ్యారంటీల్లో ఇప్పుడు ఐదో హామీ అమలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని కూలదోయాలని కుట్ర చేస్తున్నాయని.. ఆ కుటిల ప్రయత్నాలను తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమకు టచ్‌లోకి వస్తున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాను ఒక్కసారి గేట్లు ఎత్తానంటే బీఆర్ఎస్‌లో తండ్రీకొడుకులు, మామా అల్లుడు తప్ప ఎవరూ మిగలరని వ్యాఖ్యానించారు. ఎక్కడ గుచ్చితే ఎక్కడ దిగుతుందో కూడా తెలుసని, తమతో పెట్టుకోవద్దని హెచ్చరించారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో కాంగ్రెస్ నిర్వహించిన ప్రజాదీవెన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. సభలో రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని బీజేపీ నేత లక్ష్మణ్ ఎలా అంటారు? కేవలం ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తుంది? బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని కూలదోయాలని ప్రయత్నిస్తున్నాయి. వారి కుటిల ప్రయత్నాలను తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నాకు టచ్‌లోకి వచ్చారు. తాము ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అప్పటి సీఎం కేసీఆర్‌ను కలవడం వీలుకాకపోయేదని.. మీరు సామాన్యులను కలుస్తూ ప్రజాపాలన తెచ్చారని నాకు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోకుండా తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నాకు హామీ ఇచ్చారు. ఇప్పటికే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాకు మద్దతుగా నిలుస్తూ ఈ సభకు వచ్చారు. నేను ఒక్కసారి గేట్లు ఎత్తానంటే బీఆర్ఎస్‌లో తండ్రీకొడుకులు, మామా అల్లుడు తప్ప ఎవరూ మిగలరు. మాతో అనవసరంగా గోక్కోవద్దు, గోక్కున్నోళ్లు ఎవరూ బాగుపడలేదు.

**కుమ్మక్కు రాజకీయాలు..**

బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ నాలుగు స్థానాలు, బీజేపీ తొమ్మిది స్థానాలకు

మిగతా 2వ పేజీలో ▶

### ఆడబిడ్డల పేరిట ఇందిరమ్మ ఇళ్లు

- ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున మంజూరు చేస్తాం
- భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవంలో సీఎం

2లో



సోమవారం భద్రాచలంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, సీతక్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్, కొండా సురేఖ

సీఏఏ అమలుపై సోమవారం వారణాసిలో బీజేపీ కార్యకర్తల సంబరాలు



# అమల్లోకి సీఏఏ

**లోక్‌సభ ఎన్నికల ముంగిట వివాదాస్పద చట్టంపై కేంద్రం కీలక నిర్ణయం**

- నిబంధనలతో నోటిఫికేషన్ విడుదల
- 2014 డిసెంబర్ 31కి ముందు పాక్, బంగ్లాదేశ్, అఫ్గాన్ నుంచి వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం
- నాలుగేళ్ల క్రితమే చట్టం చేసినా నిబంధనలపై సందిగ్ధత నేపథ్యంలో ఇప్పటివరకు అమలు వాయిదా
- తాజా నిర్ణయంతో గత ఎన్నికల హామీని నిలబెట్టుకున్న బీజేపీ.. రుజువులు, ధ్రువీకరణలతో నిమిత్తం లేకుండా పౌరసత్వం జారీ చేయనున్న కేంద్రం
- రాజ్యాంగ నిర్మాతల హామీని ప్రధాని మోదీ అమల్లోకి తెచ్చారన్న అమిత్ షా
- కేంద్రం నిర్ణయంపై మండిపడ్డ విపక్షాలు.. దేశాన్ని విభజించే యత్నమంటూ ధ్వజం
- ఇది బీజేపీ ఎన్నికల లబ్ధి ఎత్తుగడేనని ఆరోపణ

6లో

# 17 వరకు ధరణి స్పెషల్ డ్రైవ్

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

- పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్న సీసీఎల్ఏ
- రెండు, మూడు నెలల్లో శాశ్వత పరిష్కారాల సిఫారసు: ధరణి పునర్నిర్మాణ కమిటీ

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ భూమి సమస్యలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 2.45 లక్షల దరఖాస్తులను ధరణి పోర్టల్ ద్వారా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజుల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ నెల 17వ తేదీ వరకు డ్రైవ్‌ను కొనసాగించాలంటూ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా, ఇంకా మిగిలిపోయిన దరఖాస్తులను క్లియర్ చేయడమే లక్ష్యంగా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీసీఎల్ఏ సూచించారు.

**ఇది ఫస్ట్ ఎయిడ్ మాత్రమే: కోదండరెడ్డి, సునీల్**

ధరణి పోర్టల్ విషయంలో తాము ఇప్పటివరకు ఫస్ట్ ఎయిడ్ (ప్రాథమిక చికిత్స) మాత్రమే ఇస్తున్నామని, అసలు ట్రీట్‌మెంట్‌ను ఇంకా ప్రారంభించలేదని

మిగతా 14వ పేజీలో ▶

### టీడీపీ, జనసేన ఆన్‌లైన్ మృగాల వికృత క్రీడ...

# ఓ చెల్లెమ్మను చంపేశారు!

- జగనన్న ఇంటి పట్టాలిచ్చారని సంతోషంతో చెప్పటమే ఆమె తప్పు
- అమ్మ ఒడి, చేయూత, పింఛన్‌తో కుటుంబం బాగుపడిందనటమే నేరం
- ఓ యూట్యూబ్ చానల్‌కు ఎంతో సంతోషంగా చెప్పిన తెనాలి గీతాంజలి
- సోషల్ మీడియా వేదికలపై వెంటాడి వేధించిన టీడీపీ, జనసేన మూకలు
- ఆమెను దూషిస్తూ... వేషభాషలను ఎగతాళి చేస్తూ దారుణంగా ట్రోలింగ్
- మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం.. ఆసుపత్రిలో మృతి
- సీఎం ఆదేశాలతో ఆ కుటుంబాన్ని పరామర్శించిన స్థానిక ఎమ్మెల్యే
- బాధితురాలి కుటుంబానికి అండగా నిలిచి ఇద్దరు కుమార్తెలను ఆదుకుంటామని భరోసా

- వివరాలు 10లో



# నేడు కేబినెట్ భేటీ!

- ఎజెండాలో మహిళా సాధికారత అంశాలే అధికం
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏపై నిర్ణయం!
- ఆర్థిక భారం పడే నిర్ణయాలు లేనట్టే అంటున్న ప్రభుత్వ వర్గాలు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా మళ్లీ కోదండరాం, ఆమెర్ అలీఖాన్?

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. రేపోమాపో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రానుందనే ప్రచారం నేపథ్యంలో కేబినెట్ భేటీ కానుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా మహిళా సాధికారతకు సంబంధించిన అంశాలే ఈ భేటీ ఎజెండాలో ప్రధానంగా ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ పునరుద్ధరణ, వారికి రూ.5 లక్షల జీవిత బీమా పథకం అమలు తదితర అంశాలపై మంత్రివర్గం విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటనపై సైతం మంత్రివర్గం చర్చించనున్నట్టు తెలిసింది. సాయంత్రం

మిగతా 2వ పేజీలో ▶





సోమవారం యాదగిరిగుట్ట ప్రధానాలయ ముఖమండపంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులతోపాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖకు వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు

2లో






### అమ్ములపొదిలో 'దివ్యాస్త్రం'

- అగ్ని-5 పరీక్ష దిగ్విజయం
- విజయవంతంగా లక్ష్యాల ఛేదన
- స్వదేశీ ఖండాంతర అణు క్షిపణి
- అత్యాధునిక ఎంఐఆర్‌వీ సామర్థ్యం
- 5,000 కి.మీ.కి పైగా రేంజ్ పరిధిలోకి చైనాతో పాటు యూరప్ కూడా..

- వివరాలు 6లో



### పదవుల కోసం పోయెటోళ్లతో
# పరేషానొద్దు

**చేవెళ్ల, నల్లగొండ నేతలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

- చేవెళ్ల అభ్యర్థిగా కాసాని.. నల్లగొండ అభ్యర్థిగా కృష్ణారెడ్డి?

సాక్షి, హైదరాబాద్: పదవుల కోసం పార్టీలు మారే వారికోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. కొందరు నేతలు అధికారం ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారని, అలాంటి వారిని చూసి పార్టీని నమ్ముకున్న నేతలు ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని సూచించారు. పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నియోజకవర్గాల వారీగా భేటీలు నిర్వహిస్తున్న కేసీఆర్.. సోమవారం నందినగర్ నివాసంలో నల్లగొండ, చేవెళ్ల బీఆర్ఎస్ కీలక నేతలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. చెరువు నిండినపుడు కప్పలు చేరినట్లు, అధికారం ఉన్న చోటకు వలసలు సహజమని ఈ సందర్భంగా కేసీఆర్ పేర్కొన్నారు. కొందరు నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్లడం బీఆర్ఎస్‌కే

మిగతా 3వ పేజీలో ▶


కాసాని జ్ఞానేశ్వర్


కె. కృష్ణారెడ్డి

**నేడు బీఆర్ఎస్ 'కరీంనగర్ కదనభేరి'** 3లో

# నేడు రాష్ట్రానికి అమిత్ షా



**కేంద్ర హోంమంత్రి పర్యటన ఖరారు**

- సోషల్ మీడియా వారియర్స్, పోలింగ్ బూత్ విజయ సంకల్ప సమ్మేళనంలో పాల్గొననున్న బీజేపీ అగ్రనేత

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం నాటి రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. పర్యటనలో భాగంగా... ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 1:20 నిమిషాలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 1:45 నుంచి 2:45 వరకు ఇంపీరియల్ గార్డెన్‌లో బీజేపీ సోషల్ మీడియా వారియర్స్ మీటింగ్‌లో పాల్గొని వారికి అమిత్ షా దిశా నిర్దేశం చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3:15 నుంచి 4:25 వరకు ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే విజయ సంకల్ప సమ్మేళనంలో పాల్గొంటారు. బీజేపీ పోలింగ్ బూత్ కమిటీల అధ్యక్షులు, ఆ పై మండల, జిల్లా కమిటీల అధ్యక్షులు, నాయకులు పార్టీ కార్యకర్తలకు ఆయన మార్గ నిర్దేశం చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 వేల పోలింగ్ బూత్‌లు ఉండడంతో ఈ బూత్ కమిటీల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, ఇతరనాయకులు.. మొత్తంగా దాదాపు 50-60 వేల మంది వరకు ఈ సమ్మేళనానికి హాజరయ్యే అవకాశాలున్నాయి.

**రాష్ట్ర నేతలతో భేటీ కానున్న షా**

సమ్మేళనం అనంతరం సాయంత్రం 4:45 నుంచి 5:45 వరకు ఐటీసీ కాకతీయ హోటల్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై ఎన్నికల ప్రచారం, నాయకుల మధ్య మరింత మెరుగైన సమన్వయంపై అమిత్ షా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. సాయంత్రం 6:10 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో తిరుగు ప్రయాణం కానున్నారు.

## క్లుప్తంగా...

### భట్టి, కొండా సురేఖకు సీఎం క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్



నల్లగొండ టూటౌన్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో డిప్యూటీ సీఎం భటి విక్రమా ర్క, మంత్రి కొండా సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని, వారికి వెంటనే క్షమాపణ చెప్పాలని భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధనకు సోమవారం నల్లగొండలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అగ్రవర్ణ సీఎం, మంత్రులు తమకన్నా తక్కువ ఎత్తులో భట్టి విక్రమార్క, సురేఖను కూర్చోబెట్టి అవమానించడం తగద ని చెప్పారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని గతంలో స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తే, దళితుడికి వినతిపత్రం ఇచ్చారని రేవంత్ అవమానించాడన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, రూ.20 కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ తేవాలని డిమాండ్ చేశారు. కేబినెట్‌లో మున్నూరు కాపు, యాదవ, ముదిరాజ్, రజక, విశ్వబ్రాహ్మణ, కురుమ, వడ్డెర సామాజికవర్గాలకు చోటు ఎందుకు కల్పించలేదని కవిత ప్రశ్నించారు. ఈ సమావేశంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ గట్టు రామచంద్రరావు, జూలూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### దళితులకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: దళిత సామాజిక వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను యాదగిరి నరసింహుడి దగ్గర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవమానించారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టికి జరిగిన ఈ అవమానం సమస్త దళిత జాతికి జరిగినట్లుగా భావిస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలనంటూ ఊదరగొడుతున్న రేవంత్‌రెడ్డి సమక్షంలో డిప్యూటీ సీఎం భట్టికి జరిగిన అవమానం పట్ల సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎంకు పేద ప్రజలంటే గౌరవం లేదని, జన్వాడలో దళితులపై దాడి జరిగితే ఖండించలేదని ప్రవీణ్ విమర్శించారు. గురుకులంలో పేద వర్గాలకు చెందిన విద్యార్థులు వరుస ఆత్మహత్యలు చేసుకొని చనిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు.

### సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

బాల్క సుమన్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు జరిగిన అవమానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, వాసుదేవరెడ్డితో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ భార్యను కుర్చీలో కూర్చోబెట్టి మంత్రి కొండా సురేఖను కింద కూర్చోబెట్టారని, 75 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో దళితులకు అవమానం జరుగుతూనే ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రభుత్వ ప్రచార ప్రకటనలు సహా అన్ని చోట్ల ప్రాధాన్యత తగ్గించారని సుమన్ విమర్శించారు. యాదాద్రి గుడిలో భట్టివిక్రమార్కకు జరిగిన అవమానంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

### ఆ 4 మండలాలకూ 'సింగరేణి' స్థానికత

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ

సాక్షి, హైదరాబాద్: హుస్నాబాద్, అక్కన్నపేట్, కోహెడ, బెజ్జంకి మండలాలకు చెందిన యువతకు సింగరేణి ఉద్యోగాలకు సంబంధించి ఊరట లభించింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల అభ్యర్థులకు సింగరేణి ఉద్యోగాలకు సంబంధించి స్థానికత ఉంటుంది. జిల్లాల పునర్విభజన అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట్, కోహెడ, బెజ్జంకి మండలాలు సిద్దిపేట జిల్లాలో కలవడంతో హైదరాబాద్ జోన్ పరిధిలోకి బదిలీ అయ్యాయి. దీంతో ఈ మండలాల యువత సింగరేణి ఉద్యోగాల భర్తీలో స్థానికతను కోల్పోయారు. ఈ నేపథ్యంలో వీరికి న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఇంధన శాఖ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. వారికి స్థానికత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్‌ను ఆదేశించారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఆ నాలుగు మండలాల యువతకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు.

# ఆడబిడ్డల పేరిట ఇందిరమ్మ ఇళ్లు

**ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున మంజూరు చేస్తాం**

- భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ ప్రకటన
- రూ.22,500 కోట్లతో మొత్తం 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం
- నాడు వైఎస్ ఆకాశమే హద్దుగా లక్షలాది ఇళ్లు ఇచ్చారు
- కేసీఆర్ డబుల్ బెడ్రూం పేరిట ఊరించి పేదలను మోసం చేశారని ఆరోపణ
- కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని వెల్లడి

**మహిళల పేరిటే 'ఇందిరమ్మ' ఇళ్లు**

ఇల్లాలి ముఖంలో సంతోషం ఉంటే ఆ ఇల్లు బాగున్నట్టే. ఇంటి పెత్తనం తమ చేతిలో ఉంటే చక్కదిద్దే బాధ్యత ఆడబిడ్డ తీసుకుంటుంది. అందుకే ఇందిరమ్మ ఇళ్ల పట్టా మహిళల పేరుతోనే ఉంటుంది. తద్వారా ఆ ఇల్లు బాగుంటుంది. పిల్లలు చదువుకుంటారు. ఆ కుటుంబం సమాజంలో గౌరవంగా బతుకుతుందనేది మా ప్రభుత్వ భావన.



భద్రాచలం రామాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని.. పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రతీ శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇల్లాలి ముఖంలో సంతోషం ఉంటే ఆ ఇల్లు బాగున్నట్టేనని, అందుకే ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే ఇస్తామని చెప్పారు. సోమవారం భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్న రేవంత్‌రెడ్డి.. తర్వాత ఇక్కడి వ్యవసాయ మార్కెట్ మైదానంలో నిర్వహించిన సభలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. రేవంత్ ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే..

''భద్రాచలం రాముడి సాక్షిగా ఆయన ఆశీర్వాదం తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తున్నాం. పేదల చిరకాల కోరిక ఇది. దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్లు. పేదవాళ్లు ఆత్మగౌరవంతో బతకాలంటే, పది మందిలో తలెత్తుకొని నిలబడాలంటే సొంతిల్లు ఉండాలని ఆలోచించి నాడు వైఎస్సార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆకాశమే హద్దుగా లక్షలాది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చింది. పేదలు నేటికీ ఆ ఇళ్లలో ఉంటున్నారు. నాటి పిల్లలు ఇప్పుడు పెద్దవారయ్యారు. పెళ్లయి పిల్లలతో కుటుంబంగా మారారు. వారు కూడా సొంతింట్లో ఆత్మగౌరవంతో బతకాలనే ఆశయంతో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నాం.

**ఆ అబద్ధాలకు కాలం చెల్లింది**

2014 ఎన్నికలకు డబ్బా ఇల్లు వద్దు, డబుల్ బెడ్రూం ఇల్లు ముద్దు అంటూ పేదల సొంతింటి కలలతో కేసీఆర్ ఓట్ల వ్యాపారం చేశారు. పంచాయతీ ఎన్నికలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో ఇదే కథ మళ్లీ మళ్లీ చెప్పి ప్రజలను మోసం చేశారు. కేసీఆర్ మోసాలు, అబద్ధాలకు కాలం చెల్లడంతోనే ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారు. మేం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఇళ్ల పథకాన్ని ప్రారంభించాం. అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లను మంజూరు చేస్తాం. డబుల్ బెడ్రూం ఇళ్లున్న ఊళ్లలో కేసీఆర్ ఓట్లు వేయించుకోవచ్చు. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊళ్లలోనే మేం ఓట్లు వేయించుకుంటాం. ఇందుకు కేసీఆర్ సిద్ధమా?

**ఆ ఊళ్లలో ఓట్లు వేయించుకోండి**

ప్రధాని మోదీ మాటలకు హద్దే లేదు. ఆయన మంచి మంచి డ్రెస్సులు వేసి తీయని మాటలు చెప్పడం తప్ప చేసేదేమీ లేదు. 2022 నాటికి దేశంలోని పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని గత ఎన్నికల ముందు బీజేపీ మేనిఫెస్టోలో పెట్టింది. మరి కేంద్రం రాష్ట్రంలో ఎక్కడ ఇళ్లు కట్టించిందో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఈటల రాజేందర్ చెప్పాలి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్లున్న చోట బీజేపీ నాయకులు ఓట్లు వేయించుకోవాలి. మేం అక్కడ ఓట్లు అడగబోం. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. కానీ పెట్టుబడి కూడా రాక లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కనీస మద్దతు ధర కోసం ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళనలు చేస్తున్నారు.

**భద్రాచలం రిటైనింగ్ వాల్‌కు రూ.500 కోట్లు**

గోదావరి ముంపు నుంచి భద్రాచలం పట్టణాన్ని రక్షించేలా రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.500 కోట్లు మంజూరు చేశాం. ఏపీలో విలీనమైన ఐదు గ్రామాలను తిరిగి భద్రాచలంలో కలపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కోరారు. రాములవారి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి తుమ్మల అడిగారు. అన్నింటినీ పరిశీలిస్తాం. కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉన్నందునే ముగ్గురు మంత్రులను ఇచ్చాం. ఇటీవల రేణుకాచౌదరిని రాజ్యసభకు ఎంపిక చేశాం..'' అని రేవంత్ చెప్పారు. సభలో పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాలకు చెందిన పలువురు మహిళలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రులతో కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, తుమ్మల, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాగా సీఎం భద్రాచలం పర్యటన సందర్భంగా కాన్వాయ్‌లోని వాహనం ఢీకొనడంతో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి.

### రాములవారిని దర్శించుకున్న సీఎం, మంత్రులు

భద్రాచలం అర్బన్: భద్రాచలం పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్, మంత్రులు తొలుత శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి చేరుకున్న సీఎం, మంత్రులకు అర్చకులు పరివట్టం కట్టి పూర్ణకుంభంతో ఆహ్వానించారు. గర్భగుడిలో సీఎం, మంత్రులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేసి, బెల్లంతో చేసిన రాముల వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

### పేదలు గుర్తుంచుకునే రోజు ఇది..: భట్టి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో రాయదగిన, పేదలు గుర్తుంచుకునే సందర్భం ఇది అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ''పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం సీతారామచంద్రస్వామి పాదాల సన్నిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేద, బలహీన వర్గాల వారు రాములవారి సన్నిధిలో ఇంటి పత్రాలు పొందడం శుభకరం. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల పథకాన్ని అటకెక్కిస్తే.. మేం అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే ప్రారంభించాం. దళిత, గిరిజనులు ఇల్లు కట్టుకోవడానికి రూ.6 లక్షలు, మిగతా వర్గాలకు రూ.5 లక్షలు ఇస్తాం. బీఆర్ఎస్‌లా హామీలిచ్చి విస్మరించకుండా.. బడ్జెట్‌లో నిధులు కేటాయించాకే పథకాలను ప్రారంభిస్తున్నాం. ఇళ్ల నిర్మాణం కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో తొలిదఫాగా రూ.7,740 కోట్లు కేటాయించాం..'' అని చెప్పారు.

# నేను గేట్లు తెరిస్తే.. బీఆర్ఎస్ ఉండదు

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులను ప్రకటించినా.. అందులో ఒక పార్టీ అభ్యర్థిని ప్రకటించిన స్థానంలో ఇంకో పార్టీ ప్రకటించలేదు. ఆయా అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేసుకునేలా రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. సీఎం కేసీఆర్ సొంత జిల్లా మెదక్‌తోపాటు కవిత పోటీచేసిన నిజామాబాద్, కీలకమైన సికింద్రాబాద్ వంటి స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఇంకా ఎందుకు ప్రకటించలేదో చెప్పాలి. మోదీ, కేడీ కలసి కాంగ్రెస్‌ను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కడుందని ప్రశ్నించిన వారు.. ఇప్పుడు ఈ బహిరంగ సభలో కాంగ్రెస్ కార్యకర్తల కేరింతలు వింటే గుండె ఆగి చస్తారు.

**అదే పనిగా విమర్శలు**

ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతుంటే.. అవేమీ చూడకుండా మా ప్రభుత్వంపై కేటీఆర్ సిగ్గులేకుండా విమర్శలు చేస్తున్నారు. ఉట్టి మీద పాల కోసం పిల్లి శాపాలు పెడితే ఉట్టి తెగదన్నట్టు.. అధికారం మీద యావతో కాంగ్రెస్ ప్రభుత్వం మీద కేటీఆర్ అదే పనిగా విమర్శలు చేస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన రెండో రోజునే రెండు హామీలు అమలు చేశాం. ఇప్పుడు భద్రాచలం సీతారాముల సాక్షిగా ఐదో హామీని అమలు చేస్తున్నాం.

**అందుకే భద్రాచలంలో ప్రారంభించాం..:** తూర్పునే సూర్యుడు ఉదయిస్తాడు. అందుకే రాష్ట్రానికి తూర్పు దిక్కున ఉన్న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించాం. గతంలో కేసీఆర్ ఇందిరమ్మ ఇళ్లు డబ్బా ఇళ్లంటూ విమర్శలు చేశారు. అన్ని హంగులతో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మాటలు చెప్పారు. కానీ పేదలెవరికీ ఇళ్లు ఇవ్వకుండా మోసం చేశారు. పేదలు సొంతింటి ముందు దర్జాగా నిలబడాలన్నదే మా లక్ష్యం. అందుకే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించాం..'' అని రేవంత్ వెల్లడించారు.



సోమవారం మణుగూరు సభకు హాజరైన జనం

**లక్షల ఇళ్లు కట్టించాం: మంత్రులు**

దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం కట్టని విధంగా లక్షలాది ఇందిరమ్మ ఇళ్లను గత కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించిందని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరు చెప్పి గృహ నిర్మాణ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఇప్పుడు తమ ప్రభుత్వం గృహ నిర్మాణశాఖను పటిష్టం చేస్తోందని చెప్పారు. కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి థర్మల్ ప్లాంట్‌ను నిర్మించి ఈ ప్రాంతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ఇక రాబోయే 35 రోజులు కార్యకర్తలు కష్టపడితే కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు తథ్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సేవకులుగా ఎంత కష్టమైనా పడేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# డూప్లెక్స్ 'ఇందిరమ్మ'!

**పేదింటి కొత్త నమూనాపై సర్కారు యోచన**

- ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించాలంటే 60 గజాల స్థలం అవసరం
- అంత స్థలం లేని పేదల్లో ఆందోళన
- వారి కోసం డూప్లెక్స్ తరహా నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లలో ఈసారి డూప్లెక్స్ తరహా నిర్మాణాలు దర్శనమిస్తాయా? పేద వర్గాల నుంచి వస్తున్న ఒత్తిడి ఆధారంగా ప్రభుత్వం ఆ దిశగా యోచిస్తున్నట్లు కనిపిస్తోంది. సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకోనుంది. దిగువ అంతస్తులో కొన్ని గదులు, పై అంతస్తులో కొన్ని గదులు నిర్మించటం దీని ఉద్దేశం. కాదంటే పెద్ద సంఖ్యలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు చేజారే పరిస్థితి కనిపిస్తోంది.

**కనీసం 400 చదరపు అడుగుల్లో...**

గతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు చిన్నవిగా ఉండటంతో ఈసారి విశాలమైనవి సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు యూనిట్ కాస్టును రూ.5 లక్షలుగా ఖరారు చేసింది. ప్రతి ఇంట్లో కచ్చితంగా వంటగది, టాయిలెట్ నిర్మించాల్సిందేనని తేల్చి చెప్పింది. ఇవికాకుండా మరో రెండు గదులు ఉండాలని పేర్కొంది. దీని ప్రకారం ఇల్లు సమకూరాలంటే కనీసం 400 చదరపు అడుగులకు తగ్గకుండా నిర్మించాల్సి ఉంటుంది. అందుకు 60 గజాల వరకు స్థలం అవసరం. కానీ, చాలామంది నిరుపేదలకు అంతమేర స్థలం లేదు. 30 గజాల లోపు స్థలం ఉన్నవారు ఎందరో. అందులో నిర్మించాలంటే, నిబంధనల ప్రకారం ఖరారు చేసిన విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం అసాధ్యం. ఇరుకు ఇంటిని నిర్మించాల్సి ఉంటుంది. అందుకు నిర్ధారిత యూనిట్ కాస్ట్ రూ.5 లక్షల కంటే తక్కువ మొత్తం విడుదల చేయాల్సి ఉంటుంది. ఇది తమ హామీకి విరుద్ధంగా ఉంటుందని భావిస్తున్న ప్రభుత్వం రూ.5 లక్షలు కచ్చితంగా అందించాలంటోంది. అంత మొత్తంతో ఇంటిని నిర్మించాలంటే 60 గజాల స్థలం ఉన్నవారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీంతో తక్కువ స్థలం ఉన్న నిరుపేదల్లో ఆందోళన మొదలైంది. తమకున్న చిన్న స్థలంలో నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించాలంటే కచ్చితంగా డూప్లెక్స్ తరహాలో నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పడక గదులను పైన నిర్మించుకుని, వంటిల్లు, హాలు, మరుగుదొడ్డిని దిగువ అంతస్తుల్లో నిర్మించాలి. ఈ నమూనాకు ఆమోదం తెలపాలని కోరుతున్నారు. దీంతో ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

# చేతులెత్తి మొక్కుతున్నాం..

- ఎమ్మెల్సీలుగా మా అభ్యర్థిత్వాన్ని ఆమోదించండి
- గవర్నర్ తమిళిసైకి దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: ఎమ్మెల్సీలుగా రాజ్యాంగబద్ధంగా నామినేటైన తమ అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ.. గవర్నర్ తమిళిసైకి విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా తమ పేర్లను ఆమోదించాల్సిందిగా చేతులెత్తి మొక్కుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ సోమవారం రాజ్‌భవన్‌లో వినతి పత్రం సమర్పించారు. తమ విజ్ఞాపనతో పాటు ఇటీవల హైకోర్టు వెలువరించిన 88 పేజీల తీర్పు కాపీని కూడా జత చేసి గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. తమను ఎమ్మెల్సీలుగా ఆమోదించాలని రాజ్‌భవన్ గేట్లకు మొక్కారు.

**రాజ్యాంగ ఉల్లంఘనపై హైకోర్టుకు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసినా, 55 రోజుల తర్వాత కేబినెట్ ప్రతిపాదనను గవర్నర్ తిరస్కరించారని దాసోజు శ్రవణ్ మీడియాకు తెలిపారు. అయితే తమ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించడంపై హైకోర్టును ఆశ్రయించామన్నారు. మరోవైపు కొత్త ప్రభుత్వం గవర్నర్ కోటాలో కోదండరాం, అమేర్ అలీఖాన్ పేర్లను ప్రతిపాదించగా గవర్నర్ ఆమోదించారన్నారు. ఈ మేరకు గెజిట్ కూడా విడుదల కాగా, కోదండరాం, అమేర్ అలీఖాన్‌లను నామినేట్ చేయడం రాజ్యాంగ ఉల్లంఘన అని హైకోర్టు పేర్కొందన్నారు. అట్టడుగు కులాలకు చెందిన తమకు న్యాయం చేయాలని దాసోజు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. తాము ఇద్దరూ గతంలో బీజేపీ, దాని అనుబంధ విభాగాల్లో పనిచేశామని దాసోజు, కుర్రా సత్యనారాయణ తమ వినతిపత్రంలో పేర్కొన్నారు.

### టెస్కో నుంచే వస్త్ర ఉత్పత్తులు కొనాలి

ప్రభుత్వ విభాగాలకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ విభాగాలన్నీ తెలంగాణ చేనేత సహకార సంఘం (టెస్కో) నుంచి వస్త్ర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. నేత కార్మికుల జీవనోపాధి లక్ష్యంగా ఉమ్మడి ఏపీలో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు ఆప్కో నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేసేవని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో నేత కార్మికుల జీవనోపాధికి భద్రత కల్పించడమే లక్ష్యంగా టెస్కో ఏర్పాటైందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ విభాగాలు తమ అవసరాల మేరకు టెస్కో నుంచి వస్త్ర ఉత్పత్తులు కొనుగోలు చేయడాన్ని తప్పనిసరి చేస్తున్నట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అవసరమైన వస్త్ర ఉత్పత్తులు టెస్కో వద్ద లభ్యం కాకుంటే ఆ సంస్థ నుంచి తప్పనిసరిగా 'నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్' తీసుకోవాలన్నారు. ఆ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాతే ఇతర సంస్థల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# 16, 18, 19 తేదీల్లో మోదీ ఎన్నికల ప్రచారం!

**జగిత్యాల, నాగర్‌కర్నూల్, మల్కాజిగిరిలో బహిరంగ సభలు**



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 16, 18, 19 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలోని వివిధ చోట్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్టు బీజేపీ వర్గాల సమాచారం. ఈ నెల 15 నుంచి 19 దాకా దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మోదీ సమయం కేటాయించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ మూడు తేదీల్లో మూడుచోట్ల పార్టీపరంగా ఏర్పాటు చేయనున్న బహిరంగసభల్లో ఆయన ప్రసంగిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. మోదీ పర్యటన సందర్భంగా జగిత్యాల, నాగర్‌కర్నూల్, మల్కాజిగిరిలలో సభల నిర్వహణకు రాష్ట్ర పార్టీ సన్నాహాలు ప్రారంభిస్తున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్రంలో ప్రధాని మోదీ మూడు రోజుల పర్యటనకు సంబంధించిన వివరాలను సోమవారం పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు చింతల రామచంద్రారెడ్డి, డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి తెలియజేశారు. ఒక్కో చోట నిర్వహించే బహిరంగసభలో రెండు, మూడు లోక్‌సభ నియోజకవర్గాలు కవర్ అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జగిత్యాల సభలో నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలు, నాగర్‌కర్నూల్ బహిరంగసభలో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, మల్కాజిగిరి సభలో భువనగిరి, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాలు కవరయ్యేలా కార్యక్రమాన్ని పార్టీ నాయకులు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

# లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న రేవంత్

- యాదగిరిగుట్టలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- తొలిపూజలో సతీసమేతంగా పాల్గొన్న సీఎం.. స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ
- సీఎం హోదాలో తొలిసారి పర్యటన



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీత. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. సీఎం హోదాలో తొలిసారి యాదగిరిగుట్టకు వచ్చిన ఆయన.. సోమవారం నారసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో సతీమణి గీతారెడ్డితో కలసి తొలిపూజలో పాల్గొన్నారు. తొలుత తూర్పు త్రితల రాజగోపురం వద్ద సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దీపజ్యోతి వద్ద సీఎం జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. సీఎం వెంట పూజల్లో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్, వేముల వీరేశం, మందుల సామేలు తదితరులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు వచ్చిన సీఎం.. 12 గంటలకు భద్రాచలం వెళ్లారు.

**స్వర్ణ తాపడం పూర్తి చేయించండి**

యాదగిరిగుట్టకు వచ్చిన సీఎం రేవంత్‌ను ప్రధానాలయ దివ్య విమాన గోపురానికి స్వర్ణ తాపడం పనులు పూర్తి చేయించాలని ఆలయ ఈవో రామకృష్ణారావు కోరారు. కొంత బంగారంతో ధ్వజస్తంభం బంగారు తాపడం చేయించామని తెలిపారు.

**నారసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

యాదగిరిగుట్ట ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం పంచరాత్ర ఆగమం ప్రకారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున ఉదయం నిత్యారాధనల అనంతరం శ్రీవిష్వక్సేన ఆరాధనతో ఉత్సవాలను మొదలుపెట్టారు. స్వస్తి వచనం, రక్షాబంధన కార్యక్రమాలు, పారాయణలు నిర్వహించారు.

**ప్రొటోకాల్ వివాదం**

సీఎం పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. దేవస్థానం అధికారులు సీఎంకు ఆశీర్వచనం ఇచ్చే సమయంలో డిప్యూటీ సీఎంకు.. మంత్రులకు వేసిన పీటల కంటే చిన్నపీట వేయడం వివాదాస్పదమైంది. సీఎం పక్కన ఆయన సతీమణి గీతారెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ సమానమైన ఎత్తు పీటలపై కూర్చున్నారు. దేవాదాయ మంత్రి కొండా సురేఖను ఆశీర్వచనం ఇస్తున్న అర్చకుల వెనుక కూర్చోబెట్టారు. దీనిపై ఆలయ ఈవో రామకృష్ణారావు స్పందిస్తూ, సీఎంతో పాటు మంత్రులందరికీ పీటలు వేశామని, ఇందులో ప్రొటోకాల్ వివాదమేమీ లేదన్నారు.

# నేడు కేబినెట్ భేటీ!

▶ మొదటి పేజీ తరువాయి

పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న మహిళా సదస్సులో ముఖ్యమంత్రి ఈ మేరకు నిర్ణయాలను ప్రకటించనున్నారు. కాగా మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ప్రతినెలా రూ.2,500 చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని ఇచ్చిన హామీని ఇప్పట్లో అమలు చేసే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పరిస్థితిలో ప్రభుత్వంపై ఆర్థిక భారం పడే నిర్ణయాలు ఉండకపోవచ్చని తెలిసింది.

**గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై నిర్ణయం**

గవర్నర్ కోటా కింద నామినేటెడ్ ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించగా, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. తాజాగా ఈ ఉత్తర్వులను కొట్టివేసిన రాష్ట్ర హైకోర్టు, వారి పేర్లను పునః పరిశీలన జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమెర్ అలీ ఖాన్‌లను నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను కూడా హైకోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్రమంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మళ్లీ కోదండరాం, ఆమెర్ అలీ ఖాన్‌ల పేర్లనే గవర్నర్‌కు ప్రతిపాదించే అవకాశాలున్నాయి. ప్రభుత్వంలో కొనసాగుతున్న 1100 మంది రిటైర్డ్ అధికారులను కొనసాగించాలా? వద్దా? అనే అంశంపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది. అలాగే విద్యుత్ సంస్థల్లో కొత్త డైరెక్టర్లు, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకం, అదనపు పోస్టులతో గ్రూప్–2, గ్రూప్–3 అనుబంధ నోటిఫికేషన్ల జారీ లాంటివి కూడా మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.

**కాళేశ్వరంపై 15 అంశాల్లో విచారణ**

కాళేశ్వరం ప్రాజెక్టు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, కొత్త సచివాలయం, అమరవీరుల స్థూపం నిర్మాణం, మిషన్ భగీరథ వంటి అంశాలపై జ్యుడిషియల్, విజిలెన్స్ విచారణలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఆయా విచారణలకు సంబంధించిన విధివిధానాలను కేబినెట్ భేటీలో చర్చించి ఆమోదించనున్నారు. విజిలెన్స్, ఏసీబీ, సీఐడీ, ఇతర దర్యాప్తు సంస్థలతో విచారణకు ఆదేశించే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో కమిషన్ వేసి విచారణకు ఆదేశించే అంశంపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని 15 అంశాలపై విచారణ జరిపించాలని ప్రతిపాదిస్తూ ఆ మేరకు విధివిధానాలను నీటిపారుదల శాఖ సిద్ధం చేసింది.

## క్లుప్తంగా...

### హామీలు అమలు చేయకపోతే దండన తప్పదు: పొన్నాల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల నుంచి దండన తప్పదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య హెచ్చరించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 90 రోజులకుపైగా అయినా సాగు నీరు విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు మొదలయ్యాయని, రైత్యాంగ సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి చేయకుండా బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని పొన్నాల మండిపడ్డారు. ప్రజలకు అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

### 'ఇందిరమ్మ ఇళ్లలో సింహభాగం సొమ్ము కేంద్రానిదే'



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెచ్చించే సొమ్ములో సింహభాగం కేంద్ర ప్రభుత్వ సహకారంతో వచ్చే నిధులేనని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా కేంద్ర నిధులు, హడ్కో ద్వారా కేంద్ర సహకారంతో వచ్చే రుణంతోనే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం రాష్ట్రంలో 95,235 ఇళ్ల నిర్మాణానికి హడ్కో రుణం రూ.3,000 కోట్లు తీసుకుంటున్నారన్నారు.

### సీఎంపై కేటీఆర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సత్యం, ఎడ్మ బొజ్జు




మేడిపల్లి సత్యం



ఎడ్మ బొజ్జు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఎడ్మ బొజ్జు డిమాండ్ చేశారు. కేటీఆర్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడకపోతే ప్రజలు తిరగనివ్వరని హెచ్చరించారు. సోమవారం గాంధీభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, పంచాయతీ ఎన్నికల నుంచి పార్లమెంటు వరకు గెలిచిన చరిత్ర రేవంత్‌రెడ్డిది అన్న విషయం తెలుసుకోవాలని హితవుపలికారు. 'కేటీఆర్.. తెలంగాణ ఉద్యమంలో నీ జాడ ఎక్కడ? నీ అయ్య కేసీఆర్ ఎవరి బూట్లు నాకి ముఖ్యమంత్రి అయ్యాడో చెప్పాలి. తెలంగాణ ఉద్యమ ముసుగులో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అన్ని వర్గాలను మోసం చేసిన చరిత్ర మీది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోతుంది' అని ధ్వజమెత్తారు. కేటీఆర్‌కు దమ్ముంటే ఎంపీ ఎన్నికల్లో రెండు సీట్లు గెలిపించుకోవాలని, ఆయనకు సిరిసిల్లలో నూకలు చెల్లాయని సత్యం, ఎడ్మ ఎద్దేవాచేశారు.

### 17న బీసీ కులాల ఆత్మీయ అభినందన సభ: జాజుల



సాక్షి, హైదరాబాద్: ఈనెల 17న హైదరాబాద్‌లో బీసీ ప్రతినిధులతో బీసీ కులాల ఆత్మీయ అభినందన సభను నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కుల సంఘాల ఐక్య సమావేశంలో బీసీ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, బీసీ విద్యావంతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ సమగ్ర కులగణన చరిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకొని బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంలకు ఆత్మీయ అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జాజుల తెలిపారు.

### బీఆర్ఎస్ పాలనలో గొల్ల కురుమలకు అన్యాయం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గొల్ల కురుమలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్‌యాదవ్, అధికార ప్రతినిధులు గౌరీ సతీశ్ కురుమ, లింగం యాదవ్, కార్పొరేటర్ రవీందర్ యాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బీర్ల శంకర్ కురుమ, రాష్ట్ర ఎంపీపీల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చీర శ్రీశైలం కురుమతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారని, మరో రెండ్రోజుల్లో కార్పొరేషన్ ఏర్పాటు కానుందని తెలిపారు.

# పదవుల కోసం పోయెటోళ్లతో పరేషానొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

మేలు చేస్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారని, అన్ని స్థాయిల్లో పార్టీ నేతలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.



సోమవారం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ సమావేశంలో కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేతలు గాంధీ, సబిత ఇంద్రారెడ్డి, మధుసూదనాచారి, రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్

#### చేవెళ్ల అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్!

చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీకి విముఖత వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మరో దీటైన అభ్యర్థిని బరిలోకి దించుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వంపై నియోజకవర్గం పరిధిలోని కీలక నేతల నుంచి అభిప్రాయాలు సేకరించిన ఆయన.. కాంగ్రెస్, బీజేపీలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని అభ్యర్థులుగా ఎంపిక చేసిన నేపథ్యంలో బీసీ (ముదిరాజ్) సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ దీటైన అభ్యర్థి అవుతారని పేర్కొన్నారు. త్వరలో చేవెళ్లలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు తేదీ నిర్ణయించాల్సిందిగా పార్టీ నేతలకు సూచించారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ. మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ ఆనంద్, రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, పార్టీ నేతలు కార్తీక్‌రెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

#### రంజిత్‌రెడ్డి, గుత్తా అమిత్ దూరం

లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి సోమవారం నాటి భేటీకి దూరంగా ఉన్నారు. తాను పోటీకి సిద్ధంగా లేనని కొద్ది రోజుల క్రితం రంజిత్‌రెడ్డి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సమాచారం అందించినట్లు తెలిసింది. మరోవైపు మొన్నటివరకు నల్లగొండ, భువనగిరిలో ఏదో ఒకచోట నుంచి టికెట్ ఆశించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి కూడా కేసీఆర్‌తో జరిగిన భేటీకి హాజరు కాలేదు. టికెట్ రేసు నుంచి తాను తప్పుకుంటున్నట్లు ఆయన కూడా వారం క్రితమే పార్టీ అధినేతకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన నేపథ్యంలో త్వరలో పార్టీ కొత్త ఇన్‌చార్జిని ప్రకటిస్తామని..తెలంగాణ భవన్‌లో తనను కలిసిన ఆ నియోజకవర్గ నేతలకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు.

#### నల్లగొండ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి?

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కీలక నేతలతోనూ కేసీఆర్ విడిగా సమావేశమయ్యారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహా పార్టీ కీలక నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా రాజకీయ సమీకరణాలపై కేసీఆర్ విశ్లేషించారు. పార్టీ అభ్యర్థులుగా ఎవరుంటే బాగుంటుందనే కోణంలో అభిప్రాయాలు సేకరించారు. కంచర్ల కృష్ణారెడ్డి, తేరా చిన్నపరెడ్డి పేర్లను పార్టీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. దీంతో మంగళవారంలోగా ఈ ఇద్దరిలో ఎవరైతే బాగుంటుందో ఏకాభిప్రాయానికి రావాలని కేసీఆర్ సూచించారు. ఈ భేటీలో కంచర్ల కృష్ణారెడ్డి కూడా పాల్గొనడం గమనార్హం. కాగా పార్టీ నేతల్లో ఎక్కువ మంది కంచర్ల అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఈ భేటీలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గ్యాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, చెరుకు సుధాకర్, కదారి అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

#### రెండు మూడు రోజుల్లో రెండో జాబితా?

బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు కొనసాగిస్తున్న కేసీఆర్ రెండు మూడురోజుల్లో రెండో జాబితా విడుదల చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం), మన్నె శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), మాలోత్ కవిత (మహబూబాబాద్)తో పాటు మాజీ ఎంపీ వినోద్ కుమార్ (కరీంనగర్), మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ (పెద్దపల్లి) అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. తాజాగా గాలి అనిల్‌కుమార్ (జహీరాబాద్), కాసాని జ్ఞానేశ్వర్ (చేవెళ్ల) పేర్లపై దాదాపుగా స్పష్టత వచ్చింది. బీఎస్పీతో పొత్తు చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు నాగర్‌కర్నూలు కేటాయించే అవకాశముంది. ఇక పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మల్కాజిగిరి, సికింద్రాబాద్, మెదక్ అభ్యర్థుల విషయంలో మాత్రం చివరి నిమిషం దాకా వేచిచూసే ధోరణిలో కేసీఆర్ ఉన్నారు. ఈ నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను బట్టి బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపిక చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి రెండురోజుల క్రితం బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన నేపథ్యంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిశారు. గిరిజనులు ఎక్కువగా ఉండే హుజూర్‌నగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా గిరిజన నేతకు బాధ్యతలు అప్పగించాలని కొందరు కోరారు. అయితే కేసీఆర్ ప్రస్తుతానికి జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌కు నియోజకవర్గ సమన్వయ బాధ్యతలు అప్పగించారు.

# నేడు బీఆర్ఎస్ 'కరీంనగర్ కదనభేరి'

- లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా తొలి బహిరంగ సభ
- హాజరుకానున్న పార్టీ అధినేత కేసీఆర్
- భారీగా జనసమీకరణపై నేతల దృష్టి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల, వినోద్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్న భారత్ రాష్ట్ర సమితి మంగళవారం కరీంనగర్ వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. 'కరీంనగర్ కదనభేరి' పేరిట నిర్వహిస్తున్న ఈ సభకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరుకానున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికల సభ కావడంతో భారీ జన సమీకరణపై పార్టీ నేతలు దృష్టి కేంద్రీకరించారు. కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థిగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పెద్దపల్లి అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్లను ఇప్పటికే ఖరారు చేసిన విషయం తెలిసిందే. కాగా మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తదితరులు సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**సెంటిమెంట్ కలిసి వస్తుందనే..!**

ఉద్యమ పార్టీగా 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు కాగా, అదే ఏడాది మే 17న కరీంనగర్ సింహగర్జన పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించారు. అదే సెంటిమెంటును కొనసాగిస్తూ కరీంనగర్ ఎస్సార్ కాలేజీ మైదానంలో తాజాగా కరీంనగర్ కదనభేరి సభ నిర్వహిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాలు, బీఆర్ఎస్ నుంచి వలసలు, కేసీఆర్ కుటుంబం లక్ష్యంగా సీఎం రేవంత్ చేస్తున్న వ్యాఖ్యలు తదితర అంశాల నేపథ్యంలో కరీంనగర్ సభపై ఆసక్తి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికల సభ కావడంతో కేసీఆర్ ప్రసంగం ఎలా ఉంటుంది? ఆయా అంశాలపై ఎలా స్పందిస్తారన్న ఉత్కంఠ బీఆర్ఎస్ శ్రేణుల్లో నెలకొంది.

#### ఏర్పాట్లు పూర్తి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: సోమవారం సాయంత్రం 5 గంటలకు జరిగే బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి దాదాపు లక్ష మంది హాజరవుతారని భావిస్తున్నారు. సభ విజయవంతంపై జిల్లా ముఖ్యనేతలు ఇప్పటికే కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తున్న పార్టీ అధినేతకు ఘనస్వాగతం పలికేందుకు కరీంనగర్ కూడళ్లతో పాటు దారిపొడవునా గులాబీ జెండాలు, భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. కాగా సోమవారం రాత్రి పార్టీ నేతలు గంగుల కమలాకర్, వినోద్‌కుమార్, సునీల్‌రావు తదితరులు వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలించారు.

## ముస్లింలే లక్ష్యంగా సీఏఏ: అసదుద్దీన్

సాక్షి, హైదరాబాద్: ముస్లింలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం- 2019 ( సీఏఏ) అమల్లోకి తీసుకొచ్చిందని ఎఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం సీఏఏ అమల్లోకి తీసుకురావడంపై ఆయన స్పందిస్తూ సోమవారం ఈ మేరకు ఎక్స్(ట్విటర్)లో పోస్టు పెట్టారు. మతం ఆధారంగా కాకుండా హింసకు గురైన వారికి ఆశ్రయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఏఏపై అభ్యంతరాలుంటే ఐదేళ్లుగా పెండింగ్‌లో పెట్టి ఇప్పుడే ఎందుకు అమలు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. వీటికి కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించాలన్న గాడ్సే ఆలోచన మేరకే ఈ చట్టం అమల్లోకి తీసుకువచ్చినట్టుందని ఒవైసీ విమర్శించారు.

# హామీలు, గ్యారంటీలు ఏవీ?

- ఉద్దెర మాటల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్‌కు సోయి వస్తుంది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట జోన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్దెర హామీలు ఇచ్చిందని, కానీ ఇప్పటికీ వేటికీ అతీగతీ లేకుండా పోయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, వరి పంటకు బోనస్ వంటి వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సోమవారం సిద్దిపేటలో నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఏకలవ్య భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాలనీ, అప్పుడే కాంగ్రెస్‌కు సోయి వస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కరువు తెచ్చిందని ఎద్దేవా చేశారు. కరెంట్ కష్టాలు మొదలయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల పట్ల అంతటా చర్చ మొదలైందన్నారు. హామీల అమలుపై కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చి గెలిచాక ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. కాగా, మెదక్ జిల్లా వెంకటాయపల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ అనంతరం కూడా హరీశ్‌రావు మాట్లాడారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలు, 13 హామీలు అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇక మిగిలింది ఆరు రోజులేనన్నారు. 'బిడ్డా రేవంత్.. హామీలు అమలు చేయకపోతే ప్రజలే గద్దె దించుతారు' అని హరీశ్ హెచ్చరించారు.

# స్థానిక ఎమ్మెల్సీ ఉపఎన్నిక బరిలో 16 మంది

- ముగిసిన నామినేషన్ల ఘట్టం
- ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే
- స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 1,439 మంది ఓటర్లు
- 28న పోలింగ్.. 2న కౌంటింగ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి సోమవారంతో నామినేషన్ల ఘట్టం ముగిసింది. చివరి రోజు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి పారిశ్రామిక వేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల గడువు ముగిసేనాటికి మొత్తంగా 16 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. 28 సెట్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు 14 కాగా.. 28న ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. వచ్చే నెల రెండో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

**స్వతంత్ర అభ్యర్థులుగా 14 మంది**

కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలో ఐడీఓసీ బిల్డింగ్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. ఆయన వెంట మంత్రి జూపల్లి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి వెంట గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజేయుడు, గద్వాల మున్సిపల్ చైర్మన్ కేశవులు ఉన్నారు. వీరిద్దరు కాకుండా స్వతంత్ర అభ్యర్థులుగా మరో 14 మంది నామినేషన్లు దాఖలు చేశారు. తగిన బలం లేకపోవడంతో బీజేపీ ఈ ఉప ఎన్నికకు దూరంగా ఉంది.















నా ఆలోచనలో, పనిలో ఎవరైనా తప్పును చూపిస్తే, నేను తప్పకుండా మార్చుకుంటాను. నాకు సత్యం కావాలి; అది ఎవరికీ హాని కలిగించలేదు. హాని తమను తాము మోసపుచ్చుకోవడంలో, అజ్ఞానంలో ఉంది.

– మార్కస్ అరేలియస్



సాక్షి

మంగళవారం, 12 మార్చి 2024

# సరైన కార్యాచరణ ఎక్కడ?!

నటన ఒక స్థాయికి మించితే బెడిసికొడుతుంది. తెరపై అతిగా నటిస్తే ఓవరాక్షన్ అంటారు. ఆ పనే నిజజీవితంలో చేస్తే వంచన అంటారు. గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండ 157 రోజులుగా అంతూ దరీ లేకుండా సాగుతోంది. ముస్లింలు ఎంతో పవిత్రంగా పరిగణించే రంజాన్ మాసం మొదలైనా మారణకాండ, విధ్వంసం ఆగటంలేదు. ఆకలితో అల్లాడుతున్న ప్రజానీకం అడపా దడపా వచ్చిపడుతున్న క్షిపణులకూ, బాంబులకూ పిట్టల్లా రాలుతున్నారు. ఇప్పటికి 31,000 మంది పౌరులు ఈ దాడుల్లో మరణించారని పాలస్తీనా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చెబుతుండగా అందులో 13,000 మంది ఉగ్రవాదులున్నారని ఇజ్రాయెల్ ప్రకటిస్తోంది. 'సంపూర్ణ విజయం' సాధించేవరకూ విశ్రమించబోమని ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చెబుతున్నారు. నిరుడు అక్టోబర్ 7న ఇజ్రాయెల్ భూభాగంలోకి ప్రవేశించిన హమాస్ మిలిటెంట్లు 1,200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చి, 250 మంది పౌరులను అపహరించినప్పటినుంచీ గాజాపై దాడులు సాగుతూనేవున్నాయి. కిడ్నాప్ చేసినవారిలో 150 మందిని హమాస్ విడుదలచేసింది. ఇంకా 100 మంది వారి చెరలోనేవున్నారు. ఈ మానవ హననాన్ని నిలువరించటానికి తన పలుకుబడిని వినియోగించాల్సిన అగ్రరాజ్యం అమెరికా అందుకు భిన్నంగా ద్విపాత్రాభినయం చేస్తూ తన నటనావైదుష్యాన్ని ప్రదర్శిస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దేశ ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో గాజాపై దాడులు నిలపాలనీ, కనీసం రంజాన్ మాసంలోనైనా కాల్పుల విరమణకు అంగీకరించాలనీ నెతన్యాహూను కోరారు. మంచిదే. కానీ ఆయన లక్ష్యపెట్టిందెక్కడ? తన మాటకు విలువీయని దేశానికి బైడెన్ ఆయుధ సరఫరా ఎలా కొనసాగిస్తున్నారు?

అమెరికాయే కాదు... దాని మిత్రదేశాలు కూడా ఈ ద్విపాత్రాభినయాన్ని అలవాటు చేసుకున్నాయి. ఇదే సమయంలో యుద్ధం ఆపాలంటూ వర్ధమాన దేశాలు తీసుకొస్తున్న తీర్మానాలకు భద్రతామండలిలో అమెరికా తన వీటో అధికారంతో గండికొడుతోంది. నెతన్యాహూపై బైడెన్ తరచు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రఫాపై దాడికి పూనుకుంటే లక్ష్మణరేఖ దాటినట్టేనని హెచ్చరిస్తున్నారు. ఎవరిని వంచించటానికి ఈ హెచ్చరికలు? గాజా ప్రజల క్షేమంపై ఆయనకు నిజంగా ఆందోళనవుంటే దాని పొరుగు దేశమైన ఈజిప్టును ఒప్పించి గాజా పౌరులు సరిహద్దుదాటి తలదాచుకునేందుకు అనుమతించమని అడగొచ్చు. కానీ ఆయన ఆ పని చేయటం లేదు. ఈజిప్టుకు ఏటా అమెరికా 103 కోట్ల డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందిస్తోంది. ఆ దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో బైడెన్‌కు మంచి సంబంధాలున్నాయి. అయినా ఈ ప్రతిపాదన చేయరు. ఇందుకు బదులు ఆహార పొట్లాలు అందించటం మొదలెట్టారు. ఆ ఉద్దేశం వెనకున్న ఆంతర్యాన్ని కూడా అనేకులు తప్పుబడుతున్నారు. దేశప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో గాజాలో పోర్టు నిర్మాణాన్ని మొదలుపెడతామని బైడెన్ ప్రకటించారు. ఇది ఆహార సరఫరా సులభం చేయటం కోసమని ఆయన చెబుతున్నా ఆ వంకన అక్కడ తిష్టవేయటమే అమెరికా లక్ష్యమన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ చేసుకునే హక్కుందని బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ మాట్లాడే మాటలు 31,000 మంది మరణించాక కూడా చెల్లుబాటవుతాయా? అయిదు నెలలు గడిచాక కూడా ఇంకా హమాస్‌ను అంతం చేయటమే లక్ష్యమంటూ ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేథాన్ని అమెరికా చూసీ చూడనట్టు వదిలేయటం సరైందేనా? హమాస్ తన దుందుడుకు చర్యలతో గాజా ప్రజలకు తీరని నష్టం చేసింది. దానిపై దాడి పేరుతో అదే పని ఇజ్రాయెల్ కూడా కొనసాగిస్తోంది. కానీ ఒకరి దాడిని ఉగ్రవాదంగా చిత్రీకరిస్తూ మరొకరిని అనునయిస్తూ, వేడుకుంటూ అదే సమయంలో వారికి కావలసిన ఆయుధ సామగ్రి అందిస్తూ కాలం గడపటం సరైందేనా?

గాజాలో నాగరిక సమాజాలు ఏమాత్రం అంగీకరించటం సాధ్యంకాని ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయి. గాజా పౌరులు ఆకలికి తట్టుకోలేక ఆకులు అలములు తింటున్నారు. కడుపు నింపుకోవటానికి పశుదాణా సైతం వినియోగిస్తున్నారు. నెలలు నిండకమునుపే గర్భిణులకు ప్రసవాలవుతున్నాయి. ఆ నవజాత శిశువులకు అవసరమైన సంరక్షణ కూడా సాధ్యం కావటం లేదు. అధిక రక్తస్రావంతో తల్లులు కన్నుమూస్తున్నారు. సకాలంలో మేల్కొని ఆపకపోతే ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా కూడా దోషిగా నిలబడాల్సివస్తుంది. రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో దినదిన గండంగా బతుకుతున్న ఉక్రెయిన్‌కు ఇంతవరకూ అమెరికా ఒక్కటే 7,500 కోట్ల డాలర్ల సాయం అందించింది. నాటో సభ్య దేశాలు తమ వంతుగా మరింత సాయం అందిస్తున్నాయి. ఇందువల్ల రష్యా ఎక్కడా తగ్గిన దాఖలా లేదు. అటు ఉక్రెయిన్‌కు కూడా ఒరిగేదేమీ వుండటం లేదు. లాభపడేది అమెరికా రక్షణ ఉత్పత్తుల కంపెనీలే. సాయం పేరుతో అందించేదంతా తిరిగి ఆ కంపెనీలకు చేరుతోంది. ఉక్రెయిన్ ఆ డబ్బుతో అమెరికా ఆయుధాలు, క్షిపణులు వగైరాలు కొంటున్నది. అటు ఉక్రెయిన్, ఇటు గాజా ఏకకాలంలో శ్మశానాలను మరపిస్తుండగా... రక్షణ ఉత్పత్తుల కంపెనీలు మాత్రం పచ్చగా వెలుగుతున్నాయి. పోనీ అమెరికా అయినా ప్రశాంతంగా వుంటున్నదా? కొన్ని దశాబ్దాలక్రితం పౌరహక్కుల కోసం చేతులు కలిపిన నల్లజాతీయులు, యూదులు ఇప్పుడు పరస్పరం దూషించుకుంటున్నారు. యూదులపై అక్కడక్కడ దాడులు కూడా జరుగుతున్నాయి. దీన్నంతటినీ ఆపాలంటే గాజాతోపాటు ఉక్రెయిన్‌లోనూ ప్రశాంతత నెలకొనాలి. అది అమెరికా అధ్యక్షుడు బైడెన్ చేతుల్లోనేవుంది. ఇప్పుడు కావాల్సింది నటన కాదు... సరైన కార్యాచరణ.

# పాక్ నాయకత్వానికి అసలు పరీక్ష

విశ్లేషణ



మలీహా లోధి

ఎన్నికలపై రాజకీయ గందరగోళం, వివాదాలతో కూడిన వాతావరణంలో పాకిస్తాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రధానిగా తన రెండవ పదవీ కాలంలో, షెహబాజ్ షరీఫ్ బలహీనమైన ఆరు పార్టీల సంకీర్ణానికి నాయకత్వం వహిస్తున్నారు. ఇది పాలనాపరమైన పని నుండి ప్రభుత్వ దృష్టిని మరల్చగలదు. ఆందోళనా రాజకీయాలను ఆశ్రయించాలని 'పీటీఐ' భావించడం కూడా పాలక కూటమికి సవాలే. పరిపాలనలో సైనిక వ్యవస్థ అజమాయిషీ కూడా ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేసేదే. ఇక ఆర్థిక సవాలు, అత్యంత ముఖ్యమైనది. పాక్ దారుణమైన సంక్షోభంలో ఉంది. అయితే, కఠినమైన ఆర్థిక చర్యల ద్వారా భారత్ సహా పలు దేశాలు భయంకరమైన ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాయని గుర్తుంచుకోవాలి.

పూర్తి మెజారిటీ లేని నాయకుడిగా షెహబాజ్ షరీఫ్ తన ప్రభుత్వ మనుగడ కోసం పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)పై ఆధారపడ్డారు. ఈ పార్టీ కేబినెట్‌లో చేరడానికి నిరాకరిస్తూ ప్రభుత్వానికి మద్దతునిచ్చింది. దీని అర్థం ఏమిటంటే, పీపీపీ, ఇతర మిత్రపక్షాలను సంతోషంగా ఉంచడానికీ, వారి డిమాండ్లను నెరవేర్చడానికీ ప్రభుత్వం నిరంతర ప్రయత్నాలలో నిమగ్నమై ఉంటుంది. ఆందోళనా రాజకీయాలను ఆశ్రయించాలని పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పీటీఐ) భావిస్తున్నందున ఇది పాలక కూటమికి నిరంతరం సవాలును విసురుతుంది. జాతీయ అసెంబ్లీలో ప్రతిపక్షం పెద్ద కూటమిగా ఏర్పడినందున పార్లమెంటరీ వ్యవహారాలను నిర్వహించే పనిని అది మరింత కష్టతరం చేస్తుంది. అసెంబ్లీ ప్రారంభ సెషన్లలో పీటీఐ మద్దతుగల జాతీయ అసెంబ్లీ సభ్యుల విఘాతకరమైన ప్రవర్తన, రాబోయే పరిణామాల స్వరూపాన్ని సూచిస్తోంది. ప్రత్యేకించి వారు ప్రతి సెషన్‌లోనూ నిరసనలు తెలుపుతామని తేల్చి చెప్పారు. ఈ ఘర్షణ శాసన నిర్మాణానికి అడ్డంకులుగా మారుతుంది. పైగా పార్లమెంట్ కార్యకలాపాలను కూడా స్తంభింపజేస్తుంది.

పరిపాలనలో సైనిక వ్యవస్థ అజమాయిషీ కూడా ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేస్తుంది. తన మునుపటి పదవీకాలంలో, షెహబాజ్ షరీఫ్ సైనిక వ్యవస్థకు చాలా ప్రాధాన్యతనిచ్చారు. ఇప్పుడు ఏదైనా ముఖ్యమైన మార్గంలో దానిపై తిరగబడడం లేదా దాని పాత్రను తగ్గించడం అసంభవం. కాబట్టి దేశం ఎలా నడుస్తుందనే అంశంపై సైన్యం అజమాయిషీ కొనసాగుతుందని దీని అర్థం.

తర్వాత క్లిష్టమైన ప్రాదేశిక ముఖచిత్రం కూడా ఉంది. రాష్ట్రాలకు సంబంధించి పీఎమ్ఎల్–ఎన్ ఒక ప్రావిన్స్‌ను మాత్రమే నియంత్రిస్తోంది. మిగిలిన మూడు ప్రావిన్సులను వేర్వేరు పార్టీలు నియంత్రిస్తున్నాయి. పైగా ఖైబర్ పఖ్తున్‌క్వాలో పూర్తిగా వ్యతిరేకమైన ప్రభుత్వం కొనసాగుతోంది. ఇది కూడా కొత్త ప్రభుత్వానికి పరిమితులు విధిస్తుంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను నిర్వహించడం ఒక స్పష్టమైన సవాలుగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఆచరణాత్మకమైన తత్వం, దృఢంగా వ్యవహరించడం మధ్య తెలివైన కలయిక అవసరం.

అయితే దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి ఈ పరిమితులు ఏవీ ప్రభుత్వాన్ని నిరోధించకూడదు. ఏదేమైనా, అది ప్రభుత్వ బాధ్యత. దీని కోసం, ప్రధానమంత్రి తన మునుపటి పదవీకాలంలో నియమించిన విచిత్రమైన, సంఖ్యరీత్యా పెరిగిపోయిన క్యాబినెట్‌ను కాకుండా, ఒక సమర్థమైన బృందాన్ని ఎంచుకోవాలి. స్పష్టమైన, పొందికైన విధాన ఎజెండాను రూపొందించాలి.

ఆర్థిక సవాలు, వాస్తవానికి అత్యంత ముఖ్యమైనది. పాకిస్తాన్ భారీ విదేశీ రుణ సేవా బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుండి కోరుకోవాల్సింది పొందేందుకు షరీఫ్ ప్రభుత్వం కఠినమైన, రాజకీయంగా బాధాకరమైన నిర్ణయాలను తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. ఆర్థిక సవాలు తీవ్రమైనది అయినప్పటికీ ఈ సంక్షోభంలోనూ ప్రభుత్వం ఒక అవకాశాన్ని చూడాలి. ఎక్కువ రుణాలు తీసుకోవడం, ఉద్దీపనలు, సంస్కరణలను వాయిదా వేయడం, అధిక స్థాయి రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని సృష్టించకుండా ఎక్కువ రుణాలు సేకరించడం– ఇవన్నీ పాక్ రహదారిపై మరొక సంక్షోభానికి మాత్రమే హామీ ఇస్తాయి. వృద్ధి, పెట్టుబడులను ప్రోత్సహించడానికి లేదా రికార్డు స్థాయి ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే విషయంలో ఏమీ చేయదు.



సంకీర్ణ ప్రభుత్వంలో పాకిస్తాన్‌కు రెండోసారి ప్రధాని అయిన షెహబాజ్ షరీఫ్

కాబట్టి రోగాన్ని దాచిపెట్టే బ్యాండ్ ఎయిడ్ విధానం, ఏ విధంగానూ ఇప్పుడు ఆమోదయోగ్యం కాదు. ప్రత్యామ్నాయంగా ఈ సంక్షోభాన్ని విస్తృత శ్రేణి నిర్మాణాత్మక సంస్కరణలను ప్రారంభించడానికీ, ఆర్థిక వ్యవస్థను విష వలయం నుండి బయట పడేయటానికీ ఉపయోగించవచ్చు. నిలకడలేని ఆర్థిక అసమతుల్యతలు, భారీ దేశీయ, విదేశీ రుణాలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తక్కువ పొదుపులు, పెట్టుబడి, స్తంభించిన వృద్ధి– ఇవన్నీ ఈ విషవలయంలో భాగమే.

ప్రపంచంలోని పలు దేశాలు పాకిస్తాన్ ఎదుర్కొంటున్న దాని కంటే భయంకరమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. కానీ అవి సంక్షోభాన్ని బలంగా, మరింత స్థితిస్థాపకంగా తిరిగి లేచినిలబడేలా ఉపయోగించుకోగలిగాయి. 1997లో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న ఆగ్నేయాసియా దేశాలు ప్రాథమిక సంస్కరణలను చేపట్టడం ద్వారా, కఠినమైన ఆర్థిక చర్యలతో నిర్మాణాత్మక సమస్యలను పరిష్కరించడం ద్వారా గట్టెక్కాయి. అదేవిధంగా, 1990లలో భారతదేశం, 1980లు, 1990లలో అనేక లాటిన్ అమెరికన్ దేశాలు కూడా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొన్నాయి. అవి తర్వాత కోలుకోవడమే కాకుండా పటిష్ఠమైన వృద్ధి బాటలో పయనించగలిగాయి. ఆర్థిక స్థిరత్వాన్ని సాధించాయి. ప్రతి సందర్భంలోనూ, దీర్ఘకాల నిబద్ధత చూపుతూ, స్థిరమైన విధానాలను ఈ దేశాల నాయకులు అమలుపరిచారు. అతుకుల బొంత పరిష్కారాలు నిజానికి పరిష్కారాలే కావనీ, నిర్మాణాత్మక సర్దుబాట్లు, కఠినమైన ఆర్థిక విధానం, ఇతర సంస్కరణ చర్యలు ముందుకు సాగడానికి చాలా అవసరమనీ విశ్వసించిన సమర్థ బృందాల దన్నుతో నాయకులు తగు చర్యలు ప్రారంభించారు.

స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని నెలకొల్పడానికి తక్షణ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉన్నప్పటికీ, మరొక సంక్షోభం కూడా షరీఫ్ ప్రభుత్వానికి సవాలుగా నిలుస్తుంది. ఇది మానవాభివృద్ధిలో సంక్షోభం. అక్షరాస్యత, విద్య, ఆరోగ్యం, పేదరికం, సామాజిక న్యాయం, మానవ సంక్షేమానికి సంబంధించిన ఇతర అంశాలు ఇటీవలి సంవత్సరాలలో క్షీణిస్తున్నాయి. ప్రపంచ మానవాభివృద్ధి ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ గణనీయంగా పడిపోవడంతో ప్రపంచ బ్యాంక్ దీనిని 'నిశ్శబ్ద, లోతైన మానవ మూలధన సంక్షోభం'గా పేర్కొంది.

అత్యధిక సంఖ్యలో బడి మానేసిన 2 కోట్లకు పైగా పిల్లలతో ప్రపంచంలోనే పాకిస్తాన్ రెండవ స్థానంలో ఉందనే భయంకరమైన వాస్తవం, దాని విద్యా అత్యవసర పరిస్థితిని ప్రతిబింబిస్తుంది. 40 శాతం మంది నిరక్షరాస్యులతో అక్షరాస్యత స్థాయిలు నిలిచిపోయాయి. అంతకుముందటి సంవత్సరంతో పోలిస్తే 2023లో 1.25 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి నెట్టబడ్డారని అంచనా. మానవ అభివృద్ధికి సంబంధించిన పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఇది దేశ స్థిరత్వం, ఆర్థిక పురోగతి గొప్ప ప్రమాదంలో పడనుందనే వాస్తవాన్ని తెలియజేస్తోంది. పాకిస్తాన్ నిద్రలో నడుచుకుని వెళ్తూ విపత్తులో పడిపోవచ్చని సూచిస్తుంది.

ఈ సవాళ్లను నిండు రాజకీయ వాతావరణంలోనే పరిష్కరించవలసి ఉంటుందనీ, ప్రభుత్వ అధికారంపై ఉన్న పరిమితులు, ప్రధాన విధాన చర్యలను అమలు చేయగల దాని సామర్థ్యంపై భారంగా పడతాయనీ అంగీకరించాలి. రాజకీయ ఉద్రిక్తతలను తగ్గించడానికీ, కీలక చర్యలపై రాజకీయ ఏకాభిప్రాయాన్ని ఏర్పరచడానికీ ప్రభుత్వం మార్గాలను అన్వేషించాలి. ఇది సులభం కాదు. ప్రభుత్వ సంకీర్ణ భాగస్వాములు కఠినమైన ఆర్థిక చర్యల నుండి తమను తాము దూరం చేసుకోవాలనుకుంటున్నారు. ఇమ్రాన్ ఖాన్ పార్టీకి చెందిన నాయకులను వారి పోరాట మార్గం నుండి తప్పించడం కూడా అంతే కష్టం. అందుకే, షెహబాజ్ షరీఫ్‌కు ఇది నాయకత్వ పరీక్ష.

వ్యాసకర్త పాకిస్తాన్ దౌత్యవేత్త; ఐరాసలో పాక్ మాజీ ప్రతినిధి

('ద డాన్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### మొదలైన ఉపవాసం



ఉదయం నాలుగ్గంటలకు నా సహర్ (ఉపవాస ప్రారంభానికి ముందు చేసే భోజనం) ఇదీ: గ్రనోలా (ఓట్స్‌తో కూడిన పదార్థం), యోగర్ట్ (పెరుగు లాంటిది), తేనె, ఇంకా ఎటూ చాలా మంచినీళ్లు. రమదాన్ మొదటిరోజు (ఊహించినట్టే కఠినంగా ఉంటుంది) మీకూ, మీ సంబంధీకులకూ బాగా జరుగుతుందని ఆశిస్తాను.

– హమ్జా యూసఫ్, స్కాట్‌లాండ్ ఫస్ట్ మినిస్టర్

### అన్నీ హెడ్‌లైన్లే!



పార్లమెంట్‌లో అంగీకారం పొందిన నాలుగేళ్ల తర్వాత, సాధారణ ఎన్నికల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం సీఏఏ (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్)ను అమలు చేస్తామని ప్రకటించింది. పొద్దుటి పతాక శీర్షిక ఎన్నికల బాండ్లు, సాయంత్రం పతాక శీర్షిక సీఏఏ.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

### సందడే సందడి



నా తోబుట్టువులు అద్భుతమైన ఇండియాకు రావడం ఎంతో సంతోషం. మేము ఎర్రకోట, లోటస్ టెంపుల్ దర్శించాం. ఢిల్లీ మార్కెట్లు గాలించాం. స్ట్రీట్ ఫుడ్ రుచి చూశాం. అలాగే గురుగ్రామ్‌లోని ఆంబియెన్స్ మాల్‌కు వెళ్లాం.

– గై నీర్, 'ఇండియాలో ఇజ్రాయిల్' ప్రతినిధి

### ఎందుకని?



స్విస్ బ్యాంక్ వివరాలు బయటపెడతానని అధికారంలోకి వచ్చిన బీజేపీ, ఎస్బీఐ వివరాలు బయటపెట్టడానికి భయపడుతోంది.

– మహువా మొయిత్రా, తృణమూల్ నేత

### నిజంగా చేయాల్సింది



బాహ్య ప్రపంచపు లోతుల్లోకి నువ్వు వెళ్లాల్సిన అవసరం లేదు. నీ లోకీ, నీ చైతన్యం లోకీ లోతుగా వెళ్లాల్సి ఉంటుంది. అదే జీవితంలో అత్యంత ముఖ్యమైన అన్వేషణ.

– కామ్యా బుచ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్



# వందరోజుల పాలన తీరు తెన్నులు

సందర్భం



జూలకంటి రంగారెడ్డి

వివిధ రాజకీయ పార్టీలు గద్దెనెక్కడానికి అనేక వాగ్దానాలు చేయడం పరిపాటిగా మారింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను అమలు జరపక ప్రజల చేత తిరస్కరించ బడుతుంటారు. గత పదేళ్ల పాలన చూస్తే 'నీళ్ళు, నిధులు, నియామకాల' పేరుతో వెళ్లమారిపోయింది. కోటి ఎకరాలకు నీళ్లు ఇస్తామని లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే బీటలు వారి ప్రజాధనం వృథాగా గోదావరిలో కలిసినట్లు అయింది. మనకు న్యాయంగా రావాల్సిన కృష్ణా జలాల వాటాలో ఒక్క టీఎంసీ కూడా కేసీఆర్ ప్రభుత్వం రాబట్టలేకపోయింది. ఉద్యోగ నియామకాల విషయానికి వస్తే 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉంది. టీఎస్పీఎస్సీ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలను నాశనం చేసింది. ఓట్ల కోసం చేపట్టిన అనేక జనాకర్షక పథకాలు చిత్తశుద్ధితో అమలు చేయక పోవడం వలన ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఏమాత్రం నమ్మకుండా తిరస్కరించారు.

పదేళ్ల విరామం తర్వాత కాంగ్రెస్ పార్టీ 'ఆరు గ్యారంటీల' పథకాల వాగ్దానంతో అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సహచర మంత్రుల పాలనా శైలి దూకుడుగా మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను ప్రజలకు వెల్లడించడం అవసరమే కానీ అసలు విషయాలు మరుగున పడకుండా ఆవేశం తగ్గించుకొని సంయమనంతో వ్యవహరించడం మంచిది. ఆరు గ్యారంటీలను వంద రోజులలో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు నాలుగు గ్యారంటీలను అమలు చేసింది. మిగతా రెండు గ్యారెంటీలను అమలు చేసే ప్రయత్నంలో ఉంది. వీటి అమలు కోసం ప్రభుత్వం నిధుల కొరతతో కింద మీద పడుతున్నట్టు అనిపిస్తున్నది. ఏదేమైనా గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం కొంత మేలన్నట్టుగా పరిపాలన మొదలైంది. ఈ ప్రభుత్వ పరిస్థితి గమనిస్తే, అప్పు తెచ్చుకుంటే తప్ప సంసారం సాగనట్లుగా ఉంది.

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే 'ఆరోగ్య శ్రీ' పథకాన్ని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచడం, 'మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం' కల్పించడం ఆహ్వానించదగ్గవే. 'గృహజ్యోతి' పథకం కింద ఉచిత విద్యుత్ సౌకర్యం, '500 రూపాయలకే గ్యాస్ సిలిండర్' పథకాన్ని అమల్లోకి తేవడం హర్షణీయం. అయితే, విద్యుత్ వినియోగం 200 యూనిట్లకు మించి ఒక్క యూనిట్ ఎక్కువగా వాడినా, మొత్తం వాడకానికి బిల్లు చెల్లించాల్సిందేనని మెలిక పెట్టడం పేద వర్గాలకు ఇబ్బందికరమే. తెల్ల రేషన్ కార్డు కలిగిన వాళ్లు 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే, ఆ పైన వినియోగించిన అదనపు యూనిట్లకు చార్జీ వసూలు చేయడం న్యాయమే.

దివ్యాంగులకు, వృద్ధులకు పెన్షన్ అమలు కావలసి ఉంది. కౌలు రైతులకు 'రైతుబంధు', రైతాంగానికి రుణమాఫీ, డబుల్ బెడ్ రూమ్ గృహాలు, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి అందించే పథకాలు త్వరితంగా అమలు చేస్తే ప్రభుత్వం పట్ల విశ్వాసం కలుగుతుంది. 'ధరణి'ని ఉంచుతారా ఎత్తివేస్తారా అన్నది ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. పోడు భూముల రైతులకు పట్టాలు అందజేయాలి.

రైతులు కరువు కాటకాలకు పెద్ద ఎత్తున పంట నష్టపోయారు. రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులు 30 శాతం భూమి సాగు చేస్తున్నారు. 'రైతు భరోసా' వాగ్దానాలను 2011 కౌలు రైతు చట్టాలను పరిగణలోకి తీసుకొని అమలు చేయాలి. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం, రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర గ్యారెంటీ చేసే చట్టం ప్రభుత్వం తీసుకురావాలి. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలి. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై తక్షణమే నిపుణులతో కమిటీ వేసి నిగ్గు తేల్చాలి. దీనికి బాధ్యులైన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. మూసీ నది ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలి.

రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ చేపట్టాలి. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలు సక్రమంగా నిర్వహించి ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి. వైద్యరంగంలో 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా ఖాళీలను భర్తీ చేయడంతో పాటు బస్తీ దవఖానాలు, పల్లె దవఖానాలను ప్రజలకు దగ్గరగా చేయాలి. కార్మికులకు కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలి.



చాల కాలంగా ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. వారు ఉంటున్న నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి, ఇళ్ళు మంజూరు చేయాలి. ఇందిరమ్మ ఇండ్ల కోసం 25 లక్షల దరఖాస్తులు ప్రభుత్వం వద్దకు చేరాయి. డబుల్ బెడ్ రూమ్ పథకం కింద గతంలో మూడు లక్షల ఇండ్లు కట్టించడం జరిగింది. వాటిలో 50,000 ఇళ్ళు మాత్రమే కేటాయించడం జరిగింది. మిగతా రెండున్నర లక్షల అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇండ్లను స్వాధీనం చేయాలి. భూముల పంపిణీ మీద కోనేరు రంగారావు కమిటీ చేసిన సిఫారసులను అమలు చేయాలి.

మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు రవాణా సౌకర్యం నేపథ్యంలో బస్సుల సంఖ్యను మరింత పెంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల అవసరం ఎంతో ఉంది. ఆటో కార్మికులకూ న్యాయం చేయాలి. కొత్త ప్రభుత్వం రాగానే కరువు భత్యం విడుదల చేస్తుందని ఉద్యోగులు ఎంతగానో ఆశించారు. దాదాపు 14 శాతం ఉద్యోగులకు రావలసిన కరువు భత్యం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. ఉద్యోగులు పెన్షనర్స్ ఎదురుచూస్తున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కార్పొరేట్ దవఖానాలలో అమలు అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యా బోధన సక్రమంగా జరిగేందుకూ, మంచి ఫలితాలు సాధించేందుకూ మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, బోధన, బోధనేతర ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన తక్షణం భర్తీ చేయాలి. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెరిగిన ధరలకు అనుగుణంగా సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ, నిరంతర పర్యవేక్షణ కొనసాగాలి.

ముఖ్యంగా ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు ఆయా ప్రభుత్వ శాఖల విభాగాల మీద నిరంతరం పర్యవేక్షణ జరపాలి. శాసనసభ సమావేశాలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, వివిధ అంశాల పట్ల హుందాగా చర్చలు జరగాలి. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు అమలు చేయడంతో పాటు రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం, సమగ్ర అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

వ్యాసకర్త మాజీ శాసన సభ్యులు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

# మారని భావనలు

ఆనందం, దఃఖం, ప్రేమ, విరహం వంటి అనుభూతులకు కొత్త, పాత అనే మాటలతో సంబంధం ఏముంటుంది? వెయ్యేళ్ళ క్రితం మానవ హృదయం అనుభవించిన విరహ భావానికీ, ఇప్పటి మనిషి అనుభవిస్తున్న విరహభావానికీ ఏదైనా తేడా చెప్పడం సాధ్యపడే విషయమేనా? నిన్నటి మనిషి అనుభవించిన ఆనందం పాతదిగానూ, నేటి మనిషి అనుభవిస్తున్న ఆనందం కొత్తదిగానూ తెలుసుకోగలిగే వీలు ఏ మానవ హృదయానికైనా కలిగించబడి వుంటుందా? కొన్నాళ్ళ క్రితం శోకంలోని దఃఖం కంటె నేటి దఃఖంలోని శోకం చాలా బాధకలిగించేదిగా వుందని ఏ మనిషైనా గుర్తించి చెప్పగలడా? గడచిన తరాల మనుషుల హృదయాలలో



జ్యోతిర్మయం

జనించిన ప్రేమ భావపు గాఢత ఇప్పటి తరం మనుషుల ప్రేమ భావపు గాఢతతో పోలిస్తే తక్కువదనీ, పాతబడిపోయినదనీ ఎవరైనా మాట్లాడే సాహసం చేయగలరా? చేయలేరు కదా! మానవ హృదయం పొందే అనుభవాల ఫలితమైన అనుభూతులలోని నాణ్యతకు కొత్త పాతల తేడా ఉండే అవకాశం లేదు కదా! సరిగ్గా ఈ అభిప్రాయాన్నే క్రీ.శ. 14–15 శతాబ్దుల కాలం వాడైన కొఱవి గోపరాజు అనే కవి తాను రచించిన 'సింహాసన ద్వాత్రింశిక' అనే కథా కావ్యం, ప్రథమా శ్వాసంలోని ఈ క్రింది కంద పద్యంలో విన సొంపుగా చెప్పాడు.

సంబంధము లగురసభా
వంబులు మునుకంటె నభినవంబులు గలవే?
యంబుధినె కాక బహు ర
త్నంబులు వర్తకుల కేమి తా బండినవే?

'మానవ హృదయాలకు సంబంధించిన వైన రస భావంబులు పూర్వపువాటి కంటె కొత్తవి అనదగినవి ఏవైనా ఉన్నాయా?' అనే సూటి ప్రశ్న వేయబడింది పై పద్యంలో. 'బహువిధాలైన రత్నాలు, సముద్రంలో అప్పటికే ప్రకృతిసిద్ధంగా వున్నవి కాక, వేరుగా ఏవైనా కొత్తగా వర్తకులు పండించినవి ఉన్నాయా?' అని ఒక అర్థవంతమైన పోలికతో ఆ ప్రశ్నకు సమాధానం చెప్పబడింది అందులోనే. మానవహృదయం సముద్రం వంటిదనీ, అందులో పుట్టే ఆనంద దఃఖాది రసభావాలు వివిధ రకాలైన మణుల వంటివనీ, అవి ప్రకృతి సిద్ధంగా వున్నవి ఎప్పటికైనా అవేననీ, మారేవి కావనీ, మనిషి మునుపటికంటె భిన్నంగా, కొత్తగా పుట్టించగలిగే రస భావం ఏదీ ఉండదనీ, అలా పుట్టించడం అసహజమనీ, ఆ ఆలోచన అర్థం లేనిదనీ పై పద్యంలో అందమైన పోలికతో చెప్పబడిందన్నది విదితము.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.విదియ ఉ.10.50 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** రేవతి రా.12.34 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.1.21 నుండి 2.49 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.35 నుండి 9.23 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.46 వరకు, **అమృతఘడియలు:** రా.10.22 నుండి 11.52 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.16, **సూర్యాస్తమయం:** 6.04.

# రైతుల కడుపు 'మండి'.. పంటకు నిప్పు



పెద్దలింగాపూర్‌లో ఎండిన వరిపంటకు నిప్పుపెడుతున్న రైతులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సాగునీరు అందక పంటలు ఎండిపోవడంతో రైతన్నల కడుపు 'మండి'ంది. విధిలేని పరిస్థితుల్లో అన్నదాతలు తమ పంటకు నిప్పు పెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌కు చెందిన అమ్ముల మహేశ్ రెండెకరాలు, కోరెం బుచ్చవ్వ నాలుగు ఎకరాలు, అరుకాల మల్లేశ్ మూడెకరాలు, బండారి రవి రెండెకరాలు, సలంద్రి పరశురాం మూడెకరాల్లో వరిపంట వేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోవడంతో ఆ ఐదుగురు రైతులు తమ పొలానికి సోమవారం నిప్పుపెట్టి నిరసన తెలిపారు. సాగునీరు అందించాలని ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.40 వేల చొప్పున పరిహారాన్ని ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు.



## నీళ్లు లేక.. నెర్రెలు బారింది

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రం శివారు లచ్చిరాం తండా సమీపంలో ఉన్న రైతు కర్ణం రాజన్న వరిపొలం నీళ్లు సరిపోక నెర్రెలు బారి ఇలా కనిపిస్తోంది. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు బావిలోని నీరు సరిపోక వరిపొలం ఎండిపోతోంది. – కురవి

## హోలీకి ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: హోలీ పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–గోమ్తి నగర్ (07219/07220), సికింద్రాబాద్–సంత్రాగచ్చి (07223/07224), సికింద్రాబాద్–షాలిమర్ (07224/ 07225), తదితర మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నాయి.

## క్లుప్తంగా...

### ప్రభుత్వ ఉద్యోగం రావడం లేదని...

- డిండి ప్రాజెక్టులో దూకి యువకుడి ఆత్మహత్య



గిరీష్‌కుమార్

డిండి: ప్రభుత్వ ఉద్యోగం రావడం లేదని ఓ యువకుడు డిండి ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా మునుగోడుకు చెందిన చెరుపల్లి గిరీష్‌కుమార్(30) ఆరేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేశాడు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయి పోటీ పరీక్షలు కూడా రాశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఇదే విషయంపై కొంతకాలంగా మనోవేదన చెందుతున్నాడు. మానసిక ప్రశాంతతకు శివుడిని దర్శించుకొని వస్తానని ఇంట్లో చెప్పి ఈ నెల 9న శ్రీశైలం వెళ్లాడు. 10వ తేదీన తిరుగు ప్రయాణంలో డిండికి చేరుకున్నాడు. అదేరోజు సాయంత్రం గిరీష్‌కుమార్ డిండి ప్రాజెక్టులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం ఉదయం చేపల వేటకు వెళ్లిన జాలరులకు నీటిపై తేలియాడుతూ మృతదేహం కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు గిరీష్‌కుమార్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతోనే గిరీష్ ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి సోదరుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ.రాజు తెలిపారు.

### పసుపు @ రూ.18,299

- నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆల్‌టైమ్ రికార్డు ధర

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపునకు సోమవారం ఆల్‌టైమ్ రికార్డు ధర పలికింది. ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన తీగల గంగారెడ్డి 18 క్వింటాళ్ల పసుపు మార్కెట్‌కు తీసుకురాగా, క్వింటాల్‌కు రూ.18,299 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్ యార్డు చరిత్రలోనే ఇదే అత్యధిక ధర అని అధికారులు చెప్పారు. 2011లో ఇదే మార్కెట్‌లో క్వింటాల్ పసుపునకు రూ.16 వేలు ధర పలికింది. 2 నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్ కింద జిల్లాకు పసుపు పంటను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. కేంద్రం నాలుగేళ్లలో ఎగుమతులు పెంచడం, దిగుమతులు తగ్గించడం వల్లే ధర పెరుగుతుందని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి. అయితే జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన కంఠం పురుషోత్తం క్వింటా పసుపు తీసుకురాగా, రూ.19,211 ధర పలికింది. కేవలం క్వింటాల్ పంటకు ఆ ధర రావడంతో దానిని పరిగణనలోకి తీసుకోలేదు. కేంద్రం చర్యల వల్ల పసుపు రైతులకు మంచి లాభాలు వస్తున్నాయని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే పసుపు ధర రూ.20 వేలకు పైనే ధర పెరిగే అవకాశముందన్నారు.



సోమవారం హైదరాబాద్‌లో టీశాట్ నెట్‌వర్క్ చానళ్ల సీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి

# ట్యాపింగ్‌కు 'ముందు-వెనుక' ఎవరు?

- సూత్రధారులు, పాత్రధారులపై ఆరా
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- కొందరు మాజీ అధికారుల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును పంజగుట్ట పోలీసులు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఆ విభాగం మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ కుమార్ అలియాస్ ప్రణీత్‌రావుపై కేసు నమోదు చేసిన అధికారులు సోమవారం నుంచి ఆధారాల సేకరణపై దృష్టి పెట్టారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేయడానికి ఎవరు ఆదేశాలిచ్చారు? టార్గెట్స్ వివరాలను ఎవరికి అందించే వాళ్లు? ఈ వ్యవహారంలో ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పాత్ర ఏంటి? ప్రణీత్‌తో కలిసి పని చేసిన 10 మంది సిబ్బంది ఎవరు? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం... ఈ వ్యవహారం కొందరు మాజీ అధికారుల మెడకు చుట్టుకోనున్నట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ విభాగంలో అంతర్భాగంగా ఉన్న ఎస్‌ఐబీ.. మావోయిస్టుల కదలికలు, కార్యకలాపాలపై నిఘా ఉంచుతుంది. దీనికోసం కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారులు, ఆయా విభాగాల అనుమతి తీసుకుని కొందరి ఫోన్ సంభాషణల్ని వినడం అనివార్యం. దీనికోసమే ఎస్‌ఐబీలో లీగల్ ఇంటర్‌సెప్షన్‌గా (ఎల్‌ఐ) పిలిచే ఫోన్ ట్యాపింగ్ కోసం ప్రత్యేక విభాగం పని చేస్తుంటుంది. ఇది అనుమానాస్పద, ఆరోపణలున్న వ్యక్తులకు సంబంధించిన ప్రొఫైల్స్ నిర్వహిస్తుంటుంది. దీన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించిన ప్రణీత్.. నమ్మకస్తులైన 10 మందితో టీమ్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది.



### ఎస్‌ఐబీ చీఫ్ చాంబర్‌లో...

ఎస్‌ఐబీ సైతం నిఘా విభాగాధిపతిగా ఉండే అదనపు డీజీ లేదా ఐజీ నేతృత్వంలో పనిచేస్తుంది. ఈ కారణంగానే ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రధాన కార్యాలయం లక్డీకాపూల్‌లో ఉన్నప్పటికీ... గ్రీన్‌ల్యాండ్స్‌లోని ఎస్‌ఐబీ కార్యాలయంలో సైతం ఆయనకు ఓ చాంబర్ ఉంది. కొన్నేళ్లుగా నిఘా విభాగాధిపతి అక్కడకు రాకపోవడంతో ప్రణీత్ ఈ చాంబర్‌తోపాటు పక్కన ఉన్న రూమ్‌ను అక్రమ ట్యా పింగ్ కోసం వినియోగించుకున్నట్లు చెబుతున్నారు. ఏకంగా నిఘా విభాగాధిపతి చాంబర్‌ను ప్రణీత్ వినియోగించుకునేలా అప్పటి ఎస్‌ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ప్రణీత్ ప్రతిపక్ష నేతల ఫోన్లు మాత్రమే కాకుండా కొందరు ఐపీఎస్‌లు, పోలీసు ఉన్నతాధికారులతో పాటు పలువురు ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పంజగుట్ట ఠాణాలో ఫిర్యాదు చేయడానికి ముందే ఎస్‌ఐబీ అధికారులు చేపట్టిన ప్రాథమిక విచారణలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గత డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ గెలవడంతో అప్రమత్తమైన ప్రణీత్ తన వద్ద పని చేసిన 10 మందినీ వివిధ విభాగాలకు బదిలీ చేయించాడు. ప్రస్తుతం సస్పెండ్ కావడంతో డీజీపీ ఆదేశాల మేరకు ప్రణీత్ సిరిసిల్లలోనే ఉంటున్నాడు. ఈ పది మందీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారనే దానిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.

### డిసెంబర్ 4 రాత్రి సీసీ కెమెరాలు ఆపేసి...

ప్రణీత్ ఎస్‌ఐబీ చాంబర్‌తోపాటు పక్కన ఉన్న రూమ్‌లో దాదాపు 17 అత్యాధునిక కంప్యూటర్లు ఏర్పాటు చేసుకుని పనిచేశాడు. గత డిసెంబర్ 4 రాత్రి ఎస్‌ఐబీ కార్యాలయంలోకి వచ్చిన ప్రణీత్ అక్కడి సీసీ కెమెరాలు పని చేయకుండా ఆపేశాడు. కంప్యూటర్లలో ఉన్న సమాచారాన్ని డిలీట్ చేయడంతోపాటు ఎస్‌ఐబీకి చెందిన 42 హార్డ్‌డిస్క్‌లను ఎత్తుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. దాదాపు 1,600 పేజీల కాల్ డేటాను కూడా ప్రణీత్ తగలబెట్టినట్లు తేలింది. హార్డ్‌డిస్క్‌ల్లో ఉన్న డేటాను ఏం చేశాడనే అంశంపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. నల్లగొండ జిల్లాలో పనిచేస్తూ, ఇన్‌స్పెక్టర్ హోదాలో 2018లో ఎస్‌ఐబీలోకి ప్రవేశించిన ప్రణీత్‌కు 2023లో డీఎస్పీగా యాక్సిలేటరీ పదోన్నతి లభించింది. సాధారణంగా యాక్సిలేటరీ పదోన్నతి ఇవ్వాలంటే మావోయిస్టుల కట్టడికి సంబంధించి ఉత్తమ పనితీరు కనబర్చాలి. కేవలం రాజకీయ ఆపరేషన్లు చేసిన ప్రణీత్ ప్రమోషన్‌కు అర్హుడు కాదని అప్పటి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్స్ కమిటీలో (డీపీసీ) ఉన్న కొందరు ఉన్నతాధికారులు అభ్యంతరం చెప్పినట్లు సమాచారం. దీంతో వాళ్లు సెలవులో ఉన్న రోజున ప్రణీత్ పదోన్నతి ఫైల్ క్లియర్ అయినట్లు, దీని వెనుక పెద్దల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది.

- కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేశాకే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడగాలని బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేయకపోతే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడగబోమని మంత్రులు పదే పదే చెప్పారని గుర్తుచేశారు. సోమవారం శంకర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్‌ఎస్ సర్కార్‌ను విమర్శిస్తూ పాలన సాగించాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉచిత బస్సు ప్రయాణం తప్పితే ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆయన ధ్వజమెత్తారు.

# 66.29 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

- గత ఏడాది కంటే 6.80 లక్షల ఎకరాలు తక్కువ
- 50.84 లక్షల ఎకరాల్లో వరి నాట్లు
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 66.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ సీజన్ సాధారణ విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు కాగా, 120 శాతం సాగయింది. అయితే, గతేడాది యాసంగితో పోలిస్తే సాగు తగ్గడం గమనార్హం. గత యాసంగిలో 73.09 లక్షల ఎకరాల్లో సాగైంది. దీంతో పోలిస్తే ఇప్పుడు 6.80 లక్షల ఎకరాలు తగ్గినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఇక వరి విస్తీర్ణం కూడా గత యాసంగి కంటే తక్కువ నమోదు కావడం గమనార్హం. యాసంగి వరి సాధారణ సాగు విస్తీర్ణం 40.50 లక్షల ఎకరాలు కాగా, గతేడాది ఇదే సమయానికి 57.09 లక్షల ఎకరాల్లో సాగైతే, ఈ ఏడాది ఇప్పటివరకు 50.84 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంటే గతేడాది కన్నా 6.25 లక్షల ఎకరాల వరి సాగు తగ్గింది. ఇక పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, అందులో ఇప్పటివరకు 3.18 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వాటిల్లో శనగ 2.55 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఇక వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2.77 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.08 లక్షల ఎకరాల్లో (75.25%) సాగైనట్లు పేర్కొంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 5.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు అత్యధికంగా 6.47 లక్షల ఎకరాల్లో (126.63 శాతం) సాగైంది. జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 1.02 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.28 లక్షల ఎకరాల్లో (223 శాతం) సాగైంది. జొన్న, మొక్కజొన్న పంటలు గణనీయంగా సాగయ్యాయి.

# 'ప్రెషర్‌మెయిన్' లైఫ్ 30 ఏళ్లే!

- సొరంగాలయితే వందేళ్లకు పైగా ఉంటాయి
- నారాయణపేట- కొడంగల్ లిఫ్టుపై నిపుణుల అభ్యంతరాలు
- ప్రెషర్ మెయిన్‌ను ఇప్పటికే తప్పుబట్టిన కాగ్
- మళ్లీ అదే తప్పులు కాంగ్రెస్ సర్కారు చేస్తోందని విమర్శలు

సాక్షి, హైదరాబాద్: 'నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల' నిర్మాణంలో ప్రెషర్ మెయిన్ (పైపుల వ్యవస్థ) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నీటిపారుదల రంగ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాంక్రీట్ లైనింగ్ చేసిన భూగర్భ సొరంగాలు అయితే వందేళ్లకు పైగా మన్నికగా ఉంటాయని, ప్రెషర్ మెయిన్ జీవితకాలం 30 ఏళ్లు కూడా ఉండదంటున్నారు. ఎత్తిపోతల పథకాల కరెంట్ బిల్లుతో పాటు నిర్మాణ వ్యయం భారీగా పెరుగుతుందని, నిర్వహణలో తీవ్ర సమస్యలు ఎదురవుతాయని స్పష్టం చేస్తున్నారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు నీరందించడానికి వీలుగా రూ.2,945.59 కోట్ల అంచనా వ్యయంతో నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరిలో పరిపాలన అనుమతులు జారీ చేసిన విషయం తెలిసిందే. తొలుత సొరంగాలు నిర్మించాలనుకున్నా, తర్వాత ప్రెషర్ మెయిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కాళేశ్వరంలో భాగంగా 1 నుంచి 4 ప్యాకేజీల పనుల్లో సొరంగాలకు బదులుగా ప్రెషర్ మెయిన్ ఏర్పాటుతో ఖర్చు భారీగా పెరిగిందని, దీని జీవితకాలం 30 ఏళ్లేనని కాగ్ సైతం అభ్యంతరం తెలిపింది. ఒక కిలోమీటర్ సొరంగం తవ్వడానికి రూ.86 కోట్ల నుంచి రూ.91 కోట్ల వ్యయం అయితే, ప్రెషర్ మెయిన్ కిలోమీటర్‌కు రూ.225 కోట్ల నుంచి రూ.251 కోట్ల వరకు వ్యయం అవుతుందని కాగ్ పేర్కొంది.

**మూడుచోట్ల పంపులు**

నారాయణపేట–కొడంగల్ లిఫ్టు స్కీంలో భాగంగా భూత్పూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో నీటిని తరలించడానికి మూడు చోట్ల పంప్‌హౌస్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. భూత్పూరు నుంచి ఊట్కూరు చెరువు, అక్కడి నుంచి జాజాపూర్, జాజాపూర్ నుంచి జయమ్మ చెరువు, చివరికి కొంకుంట్ల చెరువు వరకు నీటిని తరలించేలా ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. తొలి పంప్‌హౌస్ వద్ద 25 మెగావాట్ల సామర్థ్యం గల రెండు మోటార్లు, రెండో పంప్‌హౌస్ వద్ద 26 మెగావాట్ల సామర్థ్యం గల రెండు మోటార్లు, మూడో పంప్‌హౌస్ వద్ద 25 మెగావాట్ల సామర్థ్యంతో రెండు మోటార్లు ఏర్పాటు చేస్తారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేస్తోంది. మరోవైపు సొరంగాలకు బదులుగా వ్యయప్రయాసలతో కూడిన ప్రెషర్ మెయిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడాన్ని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అవసరానికి మించి మోటార్ల సామర్థ్యాన్ని ప్రతిపాదించిన నేపథ్యంలో కరెంట్ బిల్లులు సైతం పెరుగుతాయంటున్నారు.

## ఎంసీఆర్ హెచ్చార్డీ 'కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్'




లోక్‌సభ సెక్రటేరియట్ 'ప్రైడ్' డైరెక్టర్ పి.కె. మల్లిక్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న శశాంక్ గోయల్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ సెక్రటేరియట్ లైబ్రరీ ప్రొఫెషనల్స్ కోసం ఎంసీఆర్ హెచ్చార్డీ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించింది. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఈ శిక్షణ ప్రోగ్రామ్‌ను నిర్వహించనుంది. పార్లమెంట్ లైబ్రరీలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ పరిశోధన అధికారులు, సీనియర్ లైబ్రరీ అసిస్టెంట్లు ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొంటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో వచ్చే తాజా పరిణామాలను కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ అందిస్తుందని తెలిపారు. వారి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ డైరెక్టర్, సీనియర్ ఫ్యాకల్టీ కందుకూరి ఉషారాణి కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ గురించి వివరించారు.

## 'ఆర్టీసీ ఫిట్‌మెంట్‌ను 30 శాతానికి సవరించాలి'

సాక్షి, హైదరాబాద్: ఎన్నో ఏళ్లుగా ఓపికగా ఎదురు చూసిన ఆర్టీసీ కార్మికులకు సహేతుకమైన వేతన సవరణ చేయాల్సిన అవసరం ఉందని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఇటీవలి ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్‌కు పూర్తి మద్దతు ప్రకటించిన విషయాన్ని కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తక్కువ వేతనాలు ఉన్నందున ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ ఫిట్‌మెంట్‌ను 21 శాతం నుంచి 30 శాతానికి సవరించాలన్నారు. మరో ఏడాదిలో మూడో వేతన సవరణ అర్హత వస్తున్నందున, పెండింగ్‌లో ఉన్న 2021 నాటి వేతన సవరణపై ప్రభుత్వం ఓ స్పష్టమైన ప్రకటన చేయాలని నాగేశ్వరరావు కోరారు.

# సిరిసిల్లలో రోడ్డెక్కిన నేతన్నలు

- ఉపాధి కల్పించాలంటూ అంబేడ్కర్ సర్కిల్ వద్ద రాస్తారోకో
- బతుకమ్మ చీరల ఆర్డర్లు, బకాయిలు ఇవ్వాలని డిమాండ్




రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ఆసాముల ధర్నా

సిరిసిల్ల: నేత కార్మికులు, ఆసాములు తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ రోడ్డెక్కారు. నెలరోజులుగా సిరిసిల్లలో వస్త్రోత్పత్తి నిలిచిపోయింది. దీంతో వస్త్రోత్పత్తి చేసే ఆసాములు, కార్మికులకు పనిలేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలకు ఆర్డర్లు ఇవ్వగా, ఆ బకాయిలు రూ.200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభంలో పడింది. పవర్‌లూమ్స్‌పై పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేసే ఆసాములకు బీములు, కోములను యజమానులు(మాస్టర్ వీవర్స్) ఇవ్వడం లేదు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నేతకార్మికులు రాస్తారోకోకు దిగారు. కార్మికులు పని లేక అర్ధాకలితో గడుపుతున్నారని, వెంటనే ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వాలని కార్మిక నాయకులు కూరపాటి రమేశ్, మూషం రమేశ్, కోడం రమణ డిమాండ్ చేశారు. రాస్తారోకోతో కామారెడ్డి–కరీంనగర్, సిరిసిల్ల–సిద్దిపేట రోడ్లపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి రాస్తారోకో చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. నేతకార్మికులు పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు.

**కలెక్టరేట్ వద్ద ఆసాముల ధర్నా**

సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు పని కల్పించాలని, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరుతూ ఆసాముల సమన్వయ కమిటీ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏడు రోజులుగా ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని ఆసాములు కోరారు.

# అమల్లోకి సీఏఏ

**వివాదాస్పద చట్టంపై కేంద్రం నిర్ణయం**
- నియమ నిబంధనలతో నోటిఫికేషన్ జారీ
- లోక్‌సభ ఎన్నికల ముంగిట కీలక పరిణామం

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల వేళ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం-2019ను దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. తద్వారా సీఏఏను అమలు చేస్తామన్న గత లోక్‌సభ ఎన్నికల హామీని బీజేపీ నిలబెట్టుకున్నట్టయింది. సీఏఏకు నాలుగేళ్ల క్రితమే పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదముద్ర పడ్డా దేశవ్యాప్త వ్యతిరేకత, పూర్తి నిబంధనలపై సందిగ్ధత తదితరాల నేపథ్యంలో అమలు వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో చట్టం తాలూకు నియమ నిబంధనలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. మతం ప్రాతిపదికగా భారత పౌరసత్వం కల్పిస్తున్న తొలి చట్టమిది! పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు ధ్రువీకరణ పత్రాలతో నిమిత్తం లేకుండా పౌరసత్వం కల్పించడం దీని ఉద్దేశం. 2014 డిసెంబర్ 31కి ముందు ఆ దేశాల నుంచి భారత్‌కు వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు దీని ప్రకారం ఎలాంటి రుజువులు, ధ్రువీకరణలతో నిమిత్తం లేకుండా పౌరసత్వం మంజూరు చేస్తారు. వీటిని పౌరసత్వ (సవరణ) నిబంధనలుగా పిలుస్తారని కేంద్ర హోం శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ''సీఏఏ చట్టం-2019 ప్రకారం అర్హులైన వారంతా భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక విండో అందుబాటులో ఉంచాం'' అని ఆయన వెల్లడించారు.

**బీజేపీ హర్షం, విపక్షాల ధ్వజం**

సీఏఏ అమలు, నిబంధన జారీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా హర్షం వెలిబుచ్చారు. రాజ్యాంగ నిర్మాతల హామీని ప్రధాని మోదీ అమల్లోకి తెచ్చి చూపారంటూ అభినందించారు. పాక్, బంగ్లా, అఫ్గాన్లలో మతపరమైన ఊచకోతకు గురైన ముస్లిమేతర మైనారిటీలు భారత పౌరసత్వం పొందేందుకు ఈ నిబంధనలు ఉపకరిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. విపక్షాలు మాత్రం కేంద్రం నిర్ణయంపై మండిపడ్డాయి. ఇది దేశ సమగ్రతకు సీఏఏ విఘాతమంటూ కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్, ఆప్, సమాజ్‌వాదీ, వామపక్షాలు, మజ్లిస్ తదితర పార్టీలు దుయ్యబట్టాయి. దీన్ని కేవలం బీజేపీ ఎన్నికల లబ్ధి ఎత్తుగడగా అభివర్ణించాయి. ముఖ్యంగా పశ్చిమబెంగాల్, అసోంలలో మతపరమైన విభజన తెచ్చి ఓట్లు కొల్లగొట్టేందుకే ఈ చర్యకు దిగిందని ఆరోపించాయి. ఆమ్నెస్టీ ఇండియా కూడా కేంద్రం నిర్ణయాన్ని తప్పుబట్టింది. ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించనందుకు ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు అక్షింతలు వేసిన వైనం మీడియా హెడ్‌లైన్లలో రాకుండా చూసేందుకు బీజేపీ ఈ పని చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. సీఏఏను కేరళలో అమలు చేయబోమని సీఎం పినరయి విజయన్ స్పష్టం చేశారు. ఇది సమాజంలో మతపరంగా విభజనకు దారి తీస్తుందదన్నారు. ప్రజల హక్కులను హరించే ఎలాంటి మత, కుల, సామాజికపరమైన వివక్షనైనా తుదికంటా వ్యతిరేకించి తీరతామని పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. అసోంతో పాటు పలు ఈశాన్య రాష్ట్రాల్లో విద్యార్థి సంఘాలు ఆందోళనలకు పిలుపునిచ్చాయి. పాక్ తదితర దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతర శరణార్థులు మాత్రం దీన్ని స్వాగతించారు. ముస్లింల పట్ల సీఏఏ పూర్తిగా వివక్షపూరితమంటూ ఈ చట్టానికి వ్యతిరేకంగా 2019లోనే దేశవ్యాప్తంగా ఆందోళనలు, ఘర్షణలు, అల్లర్లు చెలరేగాయి. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం నుంచి ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా పలుచోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఏఏ అమలు నిర్ణయం వెలువడ్డ నిమిషాల్లోనే సంబంధిత ఇ-గెజిట్ వెబ్‌సైట్ క్రాషైంది. దాన్ని కాసేపటికి పునరుద్ధరించారు.

### సీఏఏలో ఏముంది...!

- సీఏఏ-2019 చట్టం ప్రకారం మతపరమైన ఊచకోత బాధితులైన మైనారిటీలకు భారత పౌరసత్వం కల్పిస్తారు.
- 2014 డిసెంబర్ 31కి ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులు ఇందుకు అర్హులు.
- అంతకుముందు కనీసం ఏడాది నుంచి భారత్‌లో ఉంటున్నవాళ్లకు, 14 ఏళ్లలో కనీసం ఐదేళ్లు ఉన్నవాళ్లకు పౌరసత్వం కల్పిస్తారు. గతంలో 11 ఏళ్లుండగా ఐదేళ్లకు తగ్గించారు.
- ఇందుకు వీరు ఎలాంటి శరణార్థి తదితర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరముండదు. ఈ మేరకు పౌరసత్వ చట్టం-1955కు మోదీ సర్కారు సవరణలు చేసింది.
- అసోం, మేఘాలయ, మిజోరం, త్రిపురల్లోని గిరిజన ప్రాంతాలను ఈ చట్టం పరిధి నుంచి మినహాయించారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

# అమ్ములపొదిలో దివ్యాస్త్రం


**అగ్ని-5 పరీక్ష దిగ్విజయం**
- విజయవంతంగా లక్ష్యాల ఛేదన
- స్వదేశీ ఖండాంతర అణు క్షిపణి
- అత్యాధునిక ఎంఐఆర్‌వీ సామర్థ్యం
- 5,000 కిలోమీటర్ల పైగా రేంజ్
- పరిధిలోకి చైనాతో పాటు యూరప్‌లో పలు ప్రాంతాలు
- డీఆర్‌డీఓ సైంటిస్టులకు మోదీ అభినందనలు
- ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మహిళ సారథ్యం

**బాలాసోర్/న్యూఢిల్లీ:** మన అమ్ముల పొదిలోకి తిరుగులేని 'దివ్యాస్త్రం' చేరింది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో అద్భుతం చేసింది. ఒకటికి మించిన లక్ష్యాలను ఒకేసారి అత్యంత కచ్చితత్వంతో ఛేదించగల అత్యాధునిక ఖండాంతర అణు క్షిపణి అగ్ని-5ను తొలిసారి ప్రయోగించింది. నిర్దేశించిన ఒకటికి మించిన లక్ష్యాలను అది విజయవంతంగా ఛేదించింది! శత్రు దేశాలకు వణకు పుట్టించగల ఈ 'దివ్యాస్త్రం' ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతమిచ్చేలా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందింది. దీనిలో తొలిసారిగా వాడిన మల్టిపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికత ద్వారా ఒకే క్షిపణితో వేర్వేరు లక్ష్యాలపై అనేక వార్‌హెడ్లను పూర్తి కచ్చితత్వంతో ప్రయోగించవచ్చు. 5,000 నుంచి 5,800 కిలోమీటర్ల లోపు లక్ష్యాలను అగ్ని-5 ఛేదించగలదు. తక్కువ బరువున్న వార్‌హెడ్లను అమర్చే పక్షంలో క్షిపణి రేంజ్ ఏకంగా 8,000 కి.మీ. దాకా పెరుగుతుంది! 'మిషన్ దివ్యాస్త్ర' పేరిట జరిగిన ఒడిశా తీర సమీపంలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి సోమవారం జరిగిన ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. ''మిషన్ దివ్యాస్త్రను దిగ్విజయం చేసిన డీఆర్‌డీఓ సైంటిస్టులకు హృదయపూర్వక అభినందనలు. వారి ఘనతను చూసి గర్విస్తున్నా'' అంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**అతి కొద్ది దేశాల సరసన...**

అగ్ని-5 పరీక్ష విజయవంతం కావడంతో ఎంఐఆర్‌వీ సామర్థ్యమున్న అతి కొద్ది దేశాల సరసన భారత్ చేరిందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ''దేశ దీర్ఘకాలిక రక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అగ్ని-5ని అభివృద్ధి చేశాం. భారత శాస్త్ర, సాంకేతిక నైపుణ్యానికి ఇది మచ్చుతునక. ఈ ప్రాజెక్టు డైరెక్టర్ మహిళ కావడం విశేషం. రక్షణ రంగంలోనూ దేశ ప్రగతికి నారీ శక్తి ఎంతగా దోహదపడుతోందో చెప్పేందుకు ఇది తాజా తార్కాణం'' అని వివరించాయి. అగ్ని-1 నుంచి అగ్ని-4 దాకా ఇప్పటిదాకా అభివృద్ధి చేసిన క్షిపణుల రేంజ్ 700 కి.మీ. నుంచి 3,500 కి.మీ. దాకా ఉంది. ఇవిప్పటికే రక్షణ దళంలో చేరాయి. భూ వాతావరణ పరిధిలోనూ, దాని ఆవల కూడా ఖండాంతర క్షిపణులను ప్రయోగించడంతో పాటు విజయవంతంగా అడ్డగించే సామర్థ్యాల సముపార్జనలో భారత్ ఏటేటా ప్రగతి సాధిస్తూ వస్తోంది. మొత్తం ఆసియా ఖండంతో పాటు యూరప్‌లో కూడా పలు ప్రాంతాలు అగ్ని-5 పరిధిలోకి వస్తాయి! అణు దాడులు చేయడమే గాక వాటిని అడ్డుకునే సత్తా దీని సొంతం.






| జరిపిన పరీక్షలు | అగ్ని-1 2012 | అగ్ని-2 2013 | అగ్ని-3 2015 | అగ్ని-4 2015 |
|---|---|---|---|---|
| దూరం | 700 కి.మీ. | 2,000 కి.మీ. | 3,500 కి.మీ. | 4,000 కి.మీ. |

*1,500 కిలోల వార్‌హెడ్‌తో 5,550 కి.మీ., తేలికైన వార్‌హెడ్‌తో 8,000 కి.మీ.

ఐసీబీఎం జోన్: అగ్ని-5 5,550 కిలోమీటర్ల పై చిలుకు రేంజ్‌తో కూడిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. ఇలాంటి క్షిపణులు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ వద్ద మాత్రమే ఉన్నాయి.

# శత్రువుకు వణుకే...!

ఖండాంతర లక్ష్యాలను అతి కచ్చితత్వంతో ఛేదించగల రేంజ్, బహుళ సామర్థ్యం. అత్యాధునిక పరిజ్ఞానం. వీటన్నింటి మేలు కలయికగా అగ్ని-5 క్షిపణి రూపుదిద్దుకుంది. ఇందుకోసం డీఆర్‌డీఓ సైంటిస్టులు ఏళ్ల తరబడి నిరంతర తపస్సే చేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొన్నేళ్లుగా భారత్ సాధిస్తున్న అద్భుత ప్రగతి ఇందుకు తోడైంది. 5,000 కిలోమీటర్ల పై చిలుకు రేంజ్‌తో కూడిన అగ్ని-5 క్షిపణి రాకతో దేశ రక్షణ వ్యవస్థ దుర్నిరీక్ష్యంగా మారింది...

**ఆద్యంతం ఆత్మనిర్భర్...**

- చైనా వద్ద ఉన్న డాంగ్‌ఫెంగ్ తదితర క్షిపణుల రేంజ్ 10 వేల నుంచి 15 వేల కి.మీ. దాకా ఉంది!
- వాటిని దృష్టిలో ఉంచుకుని, లక్ష్యఛేదనలో కచ్చితత్వానికి పెద్దపీట వేస్తూ అగ్ని-5ని అభివృద్ధి చేశారు.
- దీని తయారీకి అవసరమైన వైమానిక వ్యవస్థలను పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేశారు.
- అంతేగాక అత్యంత కచ్చితత్వంతో కూడిన సెన్సర్లను కూడా ఈ వ్యవస్థలో అమర్చారు.
- వీటి సాయంతో అణు వార్‌హెడ్లు లక్ష్యాన్ని అణుమాత్రమైనా తేడా లేకుండా ఛేదించగలవు.

**గురి తప్పదంతే!**

అగ్ని-5లో వాడిన మల్టిపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికత దీన్ని మరింత విధ్వంసకంగా, ప్రమాదకారిగా మారుస్తోంది. ఒకే క్షిపణి ప్రయోగంతో ఒకటికి మించిన లక్ష్యాలను ఛేదించేందుకు వీలు కల్పించడం దీని ప్రత్యేకత. ఈ టెక్నాలజీ 1960ల్లో తొలుత తెరపైకి వచ్చింది. 1968లో అమెరికా దీన్ని అభివృద్ధి చేసింది. మైన్యూట్‌మ్యాన్-3 క్షిపణి వ్యవస్థలో దీన్ని వాడింది. 1970ల నుంచి ఎంఐఆర్‌వీ సాంకేతికత ఖండాంతర క్షిపణుల్లో పూర్తిస్థాయిలో వాడకంలోకి వచ్చింది.

- ఖండాంతర క్షిపణుల తయారీ, పేలోడ్ వ్యవస్థ తదితరాల్లో విప్లవాత్మక మార్పులకు ఎంఐఆర్‌వీ శ్రీకారం చుట్టింది.
- ఈ పరిజ్ఞానం సాయంతో ఒకే క్షిపణి ద్వారా ఒకటికి మించిన సంఖ్యలో సంప్రదాయ, అణు వార్‌హెడ్లను ప్రయోగించవచ్చు.
- ఇందుకోసం ఒకే పెద్ద వార్‌హెడ్ బదులుగా పలు చిన్న చిన్న వార్‌హెడ్లను క్షిపణికి సంధిస్తారు.
- వీటిలో ప్రతి వార్‌హెడ్ స్వతంత్రంగా భిన్న లక్ష్యంపై దాడి చేయగలదు.
- తద్వారా ఒకే క్షిపణి ద్వారా ఒకటికి మించిన లక్ష్యాలను ఛేదించవచ్చు.
- ఒకటికి మించిన వార్‌హెడ్ల కారణంగా శత్రు దేశాల మిసైల్ డిఫెన్ వ్యవస్థలను ఏమార్చడంతో పాటు వాటి ఖండాంతర క్షిపణి విధ్వంస దాడులను తట్టుకుని లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఛేదించే సంభావ్యత ఎంతగానో పెరుగుతుంది.
- అంతేగాక లక్ష్యఛేదన కచ్చితత్వంతో జరిగేలా చూడటం ఎంఐఆర్‌వీ ప్రత్యేకత.
- అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా వద్ద మాత్రమే ఈ సాంకేతికత ఉంది.
- పాకిస్తాన్ కూడా ఈ సాంకేతికతను అందిపుచ్చుకునే ప్రయత్నంలో ఉంది. ఇటీవల అబాబీల్ మధ్య శ్రేణి క్షిపణి ప్రయోగంలో దీన్ని ప్రయత్నించి చూశారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

## ఇద్దరు ఈసీల ఎంపిక.. 14న ప్రధాని కమిటీ భేటీ

**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘంలోని ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఎంపిక కోసం ప్రధాని మోదీ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఈ నెల 14వ తేదీనే సమావేశం కానుంది. వాస్తవానికి ఈ కమిటీ ఈ నెల 15న సాయంత్రం 6 గంటలకు సమావేశం కావాల్సి ఉంది. తాజా షెడ్యూల్ ప్రకారం 14న మధ్యాహ్నం సమావేశమవుతుందని అధికారవర్గాలు తెలిపాయి. కమిటీలో ఒక కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి సభ్యులు. ఇటీవల రాజీనామా చేసిన అరుణ్ గోయెల్, 14న రిటైర్ కానున్న అనూప్ చంద్ర పాండేల స్థానంలో ఈ కమిటీ కొత్త కమిషనర్లను ఎంపిక చేయనుంది.

## కాంగ్రెస్‌లోకి బీజేపీ ఎంపీ

**జైపూర్:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించడంతో రాజస్తాన్‌లోని చురుకు చెందిన బీజేపీ ఎంపీ రాహుల్ కస్వాన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీకి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఆయన ప్రకటించారు. చురు లోక్‌సభ స్థానం నుంచి రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేసే అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ నడ్డాలకు కస్వాన్ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దోస్తారా కాంగ్రెస్‌లోకి ఆయనకు స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికలకు గాను చురు నియోజకవర్గానికి గాను పారాలింపిక్ బంగారు పతక విజేత దేవేంద్ర ఝఝూరియాకు బీజేపీ టిక్కెట్ ఇచ్చింది.

## గాల్లో కుదిపేసిన విమానం

**సిడ్నీ:** ఆస్ట్రేలియా నుంచి చిలీకి వెళ్తున్న ఒక విమానం మార్గమధ్యంలో ఒక్కసారిగా కుదుపులకు లోనై ప్రయాణికులకు చుక్కలు చూపించింది. విమాన ప్రయాణికులు కుదుపులకు సీట్లలోంచి చెల్లాచెదురుగా పడి గాయాలపాలయ్యారు. విమానంలో తలెత్తిన ఒక సాంకేతికత సమస్య దీనికి అసలు కారణం. దాదాపు 50 మంది ప్రయాణికుల రక్తం కళ్లజూసిన ఈ ఎల్ఏ800 లాటన్ విమానం.. ఘటనకు ముందు సిడ్నీ నుంచి చిలీ దేశంలోని శాండిగో నగరానికి సోమవారం బయల్దేరింది. మార్గమధ్యంలో షెడ్యూల్ ప్రకారం ఆక్లాండ్‌లో దిగాలి. ఆ లోపే ఆకాశంలో కుదుపులకు లోనైందని ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. విమానంలో గాయపడిన వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించేందుకు అక్లాండ్ ఎయిర్‌పోర్ట్ వద్ద 10 అత్యయిక వాహనాలను సిద్ధంగా ఉంచారు. విమానం ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే గాయపడిన ప్రయాణికులను ఆస్పత్రులకు తరలించారు. అందరికీ మోస్తరు దెబ్బలే తగిలాయి. ఒక వ్యక్తికి మాత్రం తీవ్రమైన గాయాలయ్యాయని ఎయిర్‌లైన్స్ సంస్థ పేర్కొంది.

# నారీశక్తి నూతనాధ్యాయం లిఖిస్తా

**సశక్తి- నారీశక్తి కార్యక్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు**

**సాక్షి, న్యూఢిల్లీ/గురుగ్రామ్:** ఎన్డీఏ ప్రభుత్వం మూడో దఫా కొలువుతీరడం ఖాయమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. హ్యాట్రిక్ పాలనలో మహిళల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం పాటుపడుతుందని ప్రకటించారు. నారీశక్తి అభివృద్ధిలో నూతన అధ్యయనం లిఖిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన 'సశక్తి-నారీశక్తి' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. 'గత కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళల కష్టాలు, కన్నీళ్లను ఏమాత్రం లెక్కలోకి తీసుకోలేదు. మా ప్రభుత్వాలు మహిళలను ప్రతిదశలోనూ చేయి అందించిమరీ వారి అభ్యున్నతికి పాటుపడ్డాయి. మరుగుదొడ్ల లేమి, శానిటరీ ప్యాడ్‌ల వాడకం, వంటచెరకు వాడకంతో వంటగదుల్లో పొగచూరిన మహిళల బతుకులపై మాట్లాడిన ఏకైక ప్రధాని మంత్రిని నేనే. మహిళలందరికీ బ్యాంక్ ఖాతాలు ఉండాలని ఎర్రకోట వేదికగా పిలుపునిచ్చా'' అని మోదీ వ్యాఖ్యానించారు.

1,000 మంది 'నమో డ్రోన్ దీదీ'లకు డ్రోన్లు సశక్తి-నారీశక్తి కార్యక్రమంలో భాగంగా స్వయంసహాయక బృందాలకు దాదాపు రూ.8,000 కోట్ల బ్యాంక్ రుణాలను మోదీ అందజేశారు. ఈ సందర్భంగా వారిలో కొందరితో మోదీ స్వయంగా మాట్లాడారు. స్వావలంబనతో అభివృద్ధిలోకి వచ్చిన వారిని మెచ్చుకున్నారు. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కార్యక్రమం మద్దతుతో లక్షాధికారులుగా మారిన 'లఖపతి దీదీ'లను ఈ సందర్భంగా మోదీ సత్కరించారు. వ్యవసాయం, సాగు సంబంధ పనుల్లో డ్రోన్లను వినియోగించడంలో ఇప్పటికే తర్ఫీదు పొందిన 1,000 మంది 'నమో డ్రోన్ దీదీ'లకు మోదీ డ్రోన్లను పంపిణీచేశారు. మూలధన సంబంధ నిధి కింద స్వయం సహాయక బృందాలకు మరో రూ.2,000 కోట్లను మోదీ పంపిణీచేశారు.



ఐఏఆర్ఐలో వ్యవసాయ డ్రోన్ల పనితీరును ప్రధానికి వివరిస్తున్న నమో డ్రోన్ దీదీలు

ప్రతికూల మనస్తత్వానికి ప్రతిబింబం..

కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు సానుకూల మనస్తత్వం ఏ కోశానా లేదని మోదీ విమర్శించారు. దేశ వ్యాప్తంగా రవాణా వ్యవస్థలను మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు వీలుగా 112 జాతీయ రహదారులకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.



భూమికి సంబంధించి అత్యంత స్పష్టతతో కూడిన ఫొటో ఇది. ఇన్శాట్ 3-డీఎస్ ఉపగ్రహం తాలూకు అత్యాధునిక పేలోడ్లు తీసిన ఈ ఫొటోను ఇస్రో సోమవారం విడుదల చేసింది. ఇందులో భారత్‌ను స్పష్టంగా చూడొచ్చు.

## 40 మందితో కాంగ్రెస్ మలి జాబితా

**న్యూఢిల్లీ:** రానున్న లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులను గాను కాంగ్రెస్ పార్టీ మరో 40కి పైగా అభ్యర్థులను సోమవారం ఖరారు చేసింది. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఉత్తరాఖండ్, అస్సాంలలోని 60కిపైగా సీట్లకు అభ్యర్థిత్వాలను ఖరారు చేసేందుకు అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. చింద్వారా నుంచి మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ కుమారుడు వైభవ్, తాజాగా బీజేపీ నుంచి పార్టీలో చేరిన రాహుల్ కస్వాన్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. తొలి జాబితాలో రాహుల్ గాంధీ సహా 39 మందికి చోటు దక్కడం తెలిసిందే.

# ఇన్ని రోజులు ఏం చేశారు?

**ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించనందుకు ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు మండిపాటు**
- నేటి సాయంత్రంలోగా ఎన్నికల సంఘానికి వివరాలు ఇవ్వాల్సిందేనని ఆదేశాలు
- వాటిని 15వ తేదీ సాయంత్రంలోగా వెబ్‌సైట్‌లో ఉంచాలని ఈసీకి నిర్దేశం

**సాక్షి, న్యూఢిల్లీ:** ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు పొందిన విరాళాల వివరాలను మంగళవారం సాయంత్రంకల్లా కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)కి సమర్పించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దీంతో మరింత గడువు కావాలంటూ కోర్టు మెట్లెక్కిన భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ)కి న్యాయస్థానంలో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ''రాజకీయ పార్టీలు పొందిన విరాళాల సమగ్ర వివరాలను 12వ తేదీ పనిగంటలు ముగిసేలోగా ఈసీకి వెల్లడించాలి. తర్వాత అందరికీ బహిర్గతం చేయాలి'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల రాజ్యాంగ ధర్మాసనం ఎస్‌బీఐను ఆదేశించింది. మరోవైపు, మార్చి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటలలకల్లా తమ అధికారిక వెబ్‌సైట్‌లో సమగ్ర వివరాలను పొందుపరచాలని ఈసీకి కోర్టు సూచించింది. బ్యాంక్‌కు ఆదేశాలు, గడువుకు సంబంధించి ఫిబ్రవరి 15వ తేదీన ఇచ్చిన ఉత్తర్వుల ఉల్లంఘనకు బ్యాంక్ పాల్పడితే బ్యాంక్‌పై చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎలక్టోరల్ బాండ్ల విధానం రాజ్యాంగవిరుద్ధమని పేర్కొంటూ ఆ పద్ధతిని రద్దుచేస్తూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగధర్మాసనం ఫిబ్రవరిలో చరిత్రాత్మక తీర్పునివ్వడం తెల్సిందే. 2019 ఏప్రిల్ 12వ తేదీ నుంచి ఎస్‌బీఐ ద్వారా జరిగిన ఎలక్టోరల్ బాండ్ల అధికారిక కొనుగోలు, డిపాజిట్ లావాదేవీల వివరాలను మార్చి ఆరో తేదీలోపు ఈసీకి ఇవ్వాలని కోర్టు గతంలోనే ఆదేశించడం తెల్సిందే. దీంతో జూన్ 30వ తేదీకా గడువు పొడిగించాలని ఎస్‌బీఐ కోర్టును కోరడం, అలా గడవు కోరడాన్ని కోర్టు ధిక్కారణగా పరిగణించాలంటూ కోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలవడం తెల్సిందే. ఎస్‌బీఐ తరఫున సీనియర్ లాయర్ హరీశ్ సాల్వే వాదించారు. '' బాండ్లను కొనుగోలు చేసిన వారు, డిపాజిట్ చేసుకున్న వారి వివరాలు వేర్వేరుగా ఉన్నాయి. వాటిని సరిపోల్చి నివేదించాల్సిఉంది. వేర్వేరు చోట ఉన్న బ్రాంచీల్లో నిక్షిప్తమైన డేటాను సరిపోల్చేందుకు చాలా సమయం పడుతుంది. అందుకే గడువు పెంచండి' అని కోరారు. '' విరాళాల దాతలు, గ్రహీతల వివరాలను సరిపోల్చి మ్యాచింగ్ వివరాలని ఇవ్వాలని మేం అడగలేదు. మీ దగ్గర ఉన్నది ఉన్నట్లుగా సీల్డ్ కవర్ లోంచి తీసి ఈసీకిస్తే చాలు'' అని ఆదేశించింది. '' ఫిబ్రవరి 15న తీర్పు ఇచ్చాం. అంటే ఈ 26 రోజుల నుంచి ఏం చేసినట్లు? ఇంతకాలం మౌనం వహించి ఇప్పుడొచ్చి గడువు పెంచమంటారా? కోర్టు ఉత్తర్వులపై ఇంత నిర్లక్ష్యమా?'' అని దుయ్యబట్టింది.

**స్వాగతించిన కాంగ్రెస్**

సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. భారీ కాంట్రాక్టులను సంపాదించేందుకు బీజేపీకి భారీగా విరాళాల విరాళాలిచ్చిన వారి వివరాలూ బయటికొచ్చేలా ఉత్తర్వులిస్తే బాగుండేదని పేర్కొంది. ''స్విస్ ఖాతాల నుంచి కోట్ల నల్లధనం తెస్తామన్న వాళ్లే తమ సొంత ఖాతాల వివరాలు సుప్రీం కంటబడకుండా దాచేస్తున్నారు'' అని ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు.

## కేర్ వర్కర్లు కుటుంబీకుల్ని తీసుకురావద్దు

**ఈ వారం నుంచి నిషేధాన్ని అమల్లోకి తెస్తున్న బ్రిటన్**

**లండన్:** ఇంటి పనుల్లో సాయపడే కేర్ వర్కర్లు ఇకపై తమ వెంట కుటుంబసభ్యులను బ్రిటన్‌కు తీసుకురావడానికి వీల్లేదంటూ బ్రిటన్ ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఈ నూతన వలస విధానాన్ని ఈ వారం నుంచే అమలుచేసే అవకాశముంది. ఈ విషయమై బ్రిటన్ హోం శాఖ మంత్రి జేమ్స్ క్లెవెర్లీ మాట్లాడారు. '' కేర్ వీసా విధానం ద్వారా గత ఏడాది 1,00,000 మంది కేర్ వర్కర్లను బ్రిటన్‌లోకి అనుమతిచ్చాం. అయితే వారి వెంట 1,20,000 మంది డిపెండెంట్‌లు వచ్చారు. ఇది వీసా దుర్వినియోగాలపై మేం తీసుకుంటున్న చర్యలకు విఘాతం కల్గిస్తోంది. ఇలాంటి పరిస్థితిని అనుమతించబోం' అని అన్నారు. దీనికి సంబంధించిన నూతన వలస విధానాన్ని గురువారమే ప్రభుత్వం పార్లమెంట్ ముందుంచనుంది.

## చైల్డ్ పోర్నోగ్రఫీపై ఆ తీర్పు దుర్మార్గం: సుప్రీం

**న్యూఢిల్లీ:** చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేయడం, చూడటం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు దుర్మార్గంగా అభివర్ణించింది. ఆ తీర్పుపై విచారణ జరిపేందుకు అంగీకరించింది. చెన్నైకి చెందిన ఎస్.హరీశ్(28) పిల్లలతో కూడిన పోర్నోగ్రఫీ కంటెంట్‌ను తన సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడంటూ పోలీసులు కేసు పెట్టారు. దీనిపై హరీశ్ మద్రాస్ హైకోర్టుకు వెళ్లాడు. విచారణ చేపట్టిన ఏకసభ్య ధర్మాసనం పోక్సో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాల ప్రకారం చైల్డ్ పోర్నోగ్రఫీ కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేయడం, చూడటం నేరం కాదని పేర్కొంటూ జనవరి 11వ తేదీన తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేస్తూ ఫరీబాద్‌కు చెందిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్, ఢిల్లీకి చెందిన బచ్‌పన్ బచావో ఆందోళన్ అనే ఎన్జీవోలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పు చట్టాలకు వ్యతిరేకం, దుర్మార్గమని పేర్కొంది. ఏకసభ్య ధర్మాసనం ఇలాంటి తీర్పు ఎలా ఇవ్వగలదని ప్రశ్నించింది.

## ప్రొఫెసర్ సాయిబాబా విడుదల సబబే: సుప్రీం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను జైలు నుంచి విడుదల చేయడంపై స్టే ఇవ్వాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సరైన ఆరోపణలను చూపలేకపోయినందున సాయిబాబాను విడుదల చేయాలంటూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రాథమికంగా సరైందిగానే భావిస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ అంశంపై జోక్యం చేసుకోలేమని తెలిపింది. అయితే, పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ దీపక్ మెహతా ధర్మాసనం తెలిపింది.

## 'సందేశ్‌ఖాలి'పై మమత సర్కార్‌కు సుప్రీం షాక్

**న్యూఢిల్లీ:** సందేశ్‌ఖాలిలో ఈడీ అధికారులపై దాడి కేసులో పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. కేసును సీబీఐకి అప్పగిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను కోర్టు సోమవారం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులపై తీర్పులో చేసిన వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పేర్కొంది. జనవరి 5వ తేదీన దాడి ఘటన చేసుకోగా సస్పెండైన టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను వెంటనే ఎందుకు అరెస్ట్ చేయలేదని, ఈ కేసు దర్యాప్తు ఎందుకు ఆలస్యమైందని నిలదీసింది.

## ప్రధాని మోదీ రంజాన్ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ:** మంగళవారం నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ''అందరికీ శుభ రంజాన్ శుభాకాంక్షలు. ఈ పవిత్ర మాసం అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, సంపద తేవాలి'' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.


7

# సాక్షి హైదరాబాద్

మంగళవారం । 12 । మార్చి । 2024



చార్మినార్, మక్కామసీదు వద్ద సోమవారం రాత్రి ముస్లింల ప్రార్థనలు









నగరంలో రంజాన్ సందడి షురూ అయింది. సోమవారం నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ నెల ప్రారంభమైనట్లు సైరన్లు మోగించి మతగురువులు ప్రకటించారు. దీంతో పాతబస్తీలో ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనల కోసం భారీగా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా మక్కామసీదు, చార్మినార్ వద్ద ఇక నుంచి నెల రోజుల పాటు భారీ రద్దీ ఉంటుంది. మంగళవారం తెల్లవారుజామున సహర్‌తో ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయి. సాయంత్రం ఇఫ్తార్‌తో ఉపవాస దీక్ష విరమిస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఐదు మార్లు నమాజ్‌లు చేస్తారు. చార్మినార్, నయాపూల్, అఫ్జల్‌గంజ్, మల్లేపల్లితో, మెహిదీపట్నం, టోలిచౌకీతో పాటు ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాల్లో రంజాన్ మార్కెట్లు వెలిశాయి. ఆయా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పూలు, పండ్ల మార్కెట్లలో రద్దీ పెరిగింది. పలు చోట్ల హలీం సెంటర్లు వెలిశాయి.

– సాక్షి, సిటీబ్యూరో

## ఏసీబీ వలలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్



ఏసీబీకి చిక్కిన రాధాకృష్ణ

**లింగోజిగూడ:** మ్యుటేషన్ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌ను సోమవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని లింగోజిగూడ డివిజన్ పరిధిలోని టి.శ్రీధర్ ఇంటి ట్యాక్స్‌లో తన పేరు వచ్చేందుకు (మ్యుటేషన్) కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దీనికోసం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాధాకృష్ణ లంచం డిమాండ్ చేశారు. దీంతో శ్రీధర్ రూ.8 వేలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను సంప్రదించి వివరాలను అందజేశారు. సోమవారం రసాయనాలు పూసిన నగదును ఏసీబీ అధికారులు శ్రీధర్‌కు అందజేసి రాధాకృష్ణకు ఇవ్వాలిందిగా తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో శ్రీధర్ నుంచి రాధాకృష్ణ నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అతని నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. వేలి ముద్రలు సేకరించి అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలతో నాంపల్లి ఏసీబీ కోర్టులో రాధాకృష్ణను హాజరుపరిచారు. అధికారులు లంచం డిమాండ్ చేస్తే 1064కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోరారు.

## పకడ్బందీగా 'పది' పరీక్షలు: కలెక్టర్




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**సాక్షి, సిటీబ్యూరో:** ఈ నెల 18 నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, కస్టోడియన్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వార్షిక పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రోహిణి, చీఫ్ సూపరిటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్స్ తదితరులు పాల్గొన్నారు

## హుస్సేన్‌సాగర్ అలలపై.. లేజర్ 'సౌండ్ అండ్ లైట్' షో



- నేటి సాయంత్రం ప్రజలకు అంకితం చేయనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**సనత్‌నగర్:** పర్యాటక రంగానికి సంబంధించి భాగ్యనగర సిగలో మరో కొత్త ప్రాజెక్టు ప్రజలకు అంకితం కానుంది. ఆధునిక సాంకేతికతతో వాటర్ స్క్రీన్, మ్యూజికల్ ఫౌంటెన్‌పై లేజర్ ఆధారిత సౌండ్ అండ్ లైట్ షోను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన 'కోహినూర్' వజ్రం గురించిన కథ ఈ లైట్ అండ్ షోలో ఉండబోతుంది. తెలంగాణ నుంచి మొదలైన కోహినూర్ కథను వాటర్ స్క్రీన్‌పై రంగురంగుల లేజర్ వెలుతురులో వివరించనున్నారు. ఈ కథను రాజ్యసభ సభ్యుడు, సినీ రచయిత విజయేంద్రప్రసాద్ పర్యవేక్షణలో..ప్రముఖ రచయిత ఎస్ఎస్ కంచి రాశారు. ప్రముఖ నేపథ్య గాయని సునీత గాత్రాన్ని అందించగా ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ సంగీతాన్ని అందించారు. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లో అక్కడి చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తూ..సౌండ్ అండ్ లైట్ షోలు ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ కథ, ఇక్కడి సంస్కృతి, దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఈ షోను డిజైన్ చేశారు. ఓ లేక్ అలలపై లేజర్ ఆధారిత సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటుచేయడం దేశంలోనే ఇది ప్రప్రథమం.ఈ షో పర్యాటకులను అమితంగా ఆకట్టుకోనుంది.

**తిలకించేందుకు సీటింగ్ ఏర్పాట్లు సైతం..**

ఈ లేజర్ షోకు వచ్చే పర్యాటకుల కోసం సైన్‌బోర్డ్స్ (సూచికలు) ఏర్పాటుతో పాటు 800 నుంచి 1000 మంది కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం అన్ని వసతులతో కూడిన గ్యాలరీని ఏర్పాటు చేశారు. దీనిని కూడా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

**రోబోటిక్ నాజిల్స్ అండ్ లైటింగ్..**

వెయ్యికి పైగా రోబోటిక్ నాజిల్స్, డీఎంఎక్స్ ప్రొటోకాల్‌తో కూడిన అడ్వాన్స్‌డ్ అండర్ వాటర్ లైటింగ్ సిస్టమ్స్ ద్వారా అద్భుతమైన రంగురంగుల లైట్లు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఆకర్షణీయమైన లేజర్ రంగుల కోసం మూడు 40డబ్ల్యు ఆర్‌జీబీ లేజర్లను ఏర్పాటుచేశారు.

**గ్యాలరీ, రూఫ్‌టాప్ రెస్టారెంట్..**

800 నుంచి 1000 మంది కూర్చొనేలా సీటింగ్ గ్యాలరీ. సంజీవయ్య పార్కు, మల్టీ మీడియా షోను పనోరమిక్ వ్యూ కోసం రూఫ్‌టాప్ రెస్టారెంట్ ఏర్పాటుచేశారు.

**హెచ్‌డీ ప్రొజెక్షన్..**

ఒక్కొక్కటి 34 వేల ల్యుమెన్స్ సామర్థ్యం గల 3 హెచ్‌డీ ప్రొజెక్టర్స్ ద్వారా వాటర్‌స్క్రీన్‌పై స్పష్టమైన, ఆకర్షణీయమైన ప్రొజెక్షన్ ఉండేలా ఏర్పాట్లు చేశారు.

**చారిత్రక ఘట్టాల ఆవిష్కృతం**

కోహినూర్ వజ్రానికి సంబంధించిన కథ, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు దేశ స్వాతంత్ర్య సంగ్రామం వంటి ఘట్టాలను సాగర్ అలలపై అందమైన లైటింగ్ ప్రొజెక్షన్ ద్వారా పర్యాటకులను ఆకట్టుకునేలా వివరిస్తారు. దీనికి తోడు 5.1 డాల్బీ స్టయిల్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ ద్వారా ఆడియో ఎక్స్‌పీరియన్స్ కూడా చాలా స్పష్టంగా ఉండబోతుంది. కథను వివరించే క్రమంలో (స్టోరీ టెల్లింగ్) సాంకతికత సృజనాత్మకతకు పెద్దపీట వేశారు.

**రికార్డ్–బ్రేకింగ్ వాటర్ ఫౌంటెన్**

260 అడుగుల ఎత్తు, 540 ఇన్‌టూ 130 డైమెన్షన్‌తో దేశంలోనే అతిపెద్ద వాటర్ ఫౌంటెన్ ఈ ప్రాజెక్టులో వినియోగిస్తున్నాయి.

# గ్రేటర్‌కు పొలిటికల్ ఫీవర్

- మొదలైన పార్లమెంట్ ఎన్నికల హడావుడి
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ..
- సమాలోచనల్లో బీఆర్ఎస్.. ఖరారు కోసం కాంగ్రెస్ కసరత్తు
- సభలు.. ప్రచారాల్లో పీఎం, సీఎం, కేంద్రమంత్రులు

### అందరి గురి చేవెళ్ల, మేడ్చల్, మల్కాజిగిరి ఎంపీ స్థానాల పైనే..




**నేడు ఎల్బీ స్టేడియంలో అమిత్‌షా.. పరేడ్ గ్రౌండ్‌లో సీఎం సభలు**

పార్లమెంట్ ఎన్నికల నగారాకు ముందే ప్రధాన రాజకీయ పక్షాలు ఎన్నికల శంఖరావం పూరించేందుకు సిద్ధమయ్యాయి. మంగళవారం హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్, బీజేపీ పక్షాలు భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నాయి. బీజేపీ ఎల్బీ స్టేడియంలో విజయ సంకల్ప సమ్మేళనం పేరుతో జరిగే సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా బూత్ ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేయనున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ పరేడ్ గ్రౌండ్‌లో లక్ష మంది మహిళా సంఘాల సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి సభ నిర్వహించన్నారు. దీంతో రెండు సభలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికలలో అమలు చేయాల్సి వ్యూహాలను రచిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అధికార కాంగ్రెస్ మాత్రం అభ్యర్థుల ఎంపిక కోసం సీరియస్‌గా కసరత్తు చేస్తోంది.

**సాక్షి, సిటీబ్యూరో:** చేవెళ్ల, మేడ్చల్, సికింద్రాబాద్...ఈ మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో రాజకీయ వేడి రోజురోజుకూ పెరిగిపోతోంది. క్రమేపి పెరుగుతున్న ఎండల వేడిమికంటే ఈ నియోజకవర్గాలను దక్కించుకునేందుకు మూడు ప్రధాన పార్టీలు చేస్తున్న ముమ్మర కసరత్తుతో పొలిటికల్ హీట్ ఎక్కువవుతోంది. అందుకు కారణం ఈ మూడూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో భాగంగా ఉండటమే.

**వ్యూహ ప్రతివ్యూహాల్లో నేతలు**

మల్కాజిగిరి నుంచి బీజేపీ టికెట్ దక్కించుకున్న ఈటల రాజేందర్ ఇప్పటికే తన వ్యూహం అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి కంచర్ల చంద్రశేఖరరెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, సర్వే సత్యనారాయణ, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మోతె శోభన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, తదితరులు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి గెలిచిన నియోజకవర్గమైనందున దీన్ని తిరిగి కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. తగిన నేత కోసం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక గ్రేటర్ పరిధిలోని అన్ని అసెంబ్లీస్థానాలను గెలుచుకున్న బీఆర్ఎస్..ఆ బలంతో అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని కూడా తమ ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది. తొలుత మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి ప్రచారం సైతం ప్రారంభించినప్పటికీ, తదనంతరం వైఖరి మారింది. ఈలోగా మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖరరెడ్డి కళాశాలల భవనాల కూల్చివేతల నేపథ్యంలో తాము ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేయమని ప్రకటించారు. దీంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు తదితరుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ, అధిష్టానం మదిలో ఏముందో తెలియదు. బీజేపీ నుంచి టికెట్ ఆశించి దక్కని విద్యాసంస్థల అధినేత ఒకరు టిక్కెట్టిస్తే పార్టీ మారతారనే ప్రచారం తాజాగా మొదలైంది.

**చేవెళ్ల నుంచి ఎవరెవరో ?**

చేవెళ్ల నియోజకవర్గానికి కాంగ్రెస్ నుంచి స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆ పార్టీ నుంచి టికెట్ పట్నం సునీతారెడ్డికి దాదాపుగా ఖరారైనట్లే. బీజేపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ప్రకటించింది. బీఆర్ఎస్ రంజిత్‌రెడ్డిని ఖరారు చేసినా వెనకడుగువేశారు. దీంతో కాంగ్రెస్ నుంచి సునీతారెడ్డి బరిలో దిగనున్నందున బీఆర్ఎస్ సైతం సబితారెడ్డిని దింపవచ్చుననే అభిప్రాయాలున్నాయి. లేని పక్షంలో కాసాని జ్ఞానేశ్వర్ తనయుడు వీరేశం, సబిత కుమారుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్వర్‌రెడ్డిలు ఆసక్తి లేనట్లు అధిష్టానానికి వెల్లడించినట్లు సమాచారం.

**లష్కర్ గెలుపు కోసం..**

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరు దాదాపుగా ఖరారైనట్లు ప్రచారంలో ఉంది. జీహెచ్ఎంసీ మాజీ కోఆప్షన్ సభ్యురాలు విద్యాస్రవంతి ప్రయత్నిస్తున్నప్పటికీ అవకాశం ఉండకపోవచ్చునంటున్నారు. అసెంబ్లీలోనే కాదు లోక్‌సభలోనూ బలం చాటేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఇక్కడ కూడా గెలవాలనే లక్ష్యంతో ఉంది. బీజేపీ నుంచి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉన్నందున రామ్మోహన్‌నే దింపుతుందా లేక కొత్త వారు తెరపైకి వస్తారా అనేది అంతుపట్టడంలేదు. ఈ నియోజకవర్గానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక బీఆర్ఎస్ నుంచి క్రితం సారి పోటీ చేసిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు సాయికిరణ్‌పేరు వినపడుతున్నప్పటికీ, శ్రీనివాస్‌యాదవ్ పేరును కూడా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు.

**ప్రచారం ప్రారంభం..**

అభ్యర్థులెవరైనప్పటికీ కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటికే తమ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఇటీవలే నగరంలో పర్యటించిన ప్రధాని మోదీ మరో రెండు పర్యాయాలు నగరానికి వచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంగళవారం నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల కార్యాచరణ గురించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు చెబుతున్నారు. మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇటీవల కంటోన్మెంట్‌లో 'సఖి'మహిళా వసతిగృహం ప్రారంభోత్సవంతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇక కాంగ్రెస్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి పాతబస్తీలో మెట్రో విస్తరణ, ఎన్‌హెచ్ 44పై ఎలివేటెడ్ డబుల్‌డెక్కర్ పనులకు శంకుస్థాపనలు, బైరామల్‌గూడ రెండో ఫ్లైఓవర్‌కు ప్రారంభత్సవంతోపాటు మరి కొన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళవారం పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సంఘాలతో జరిగే భారీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇలా ఓవైపు అభ్యర్థుల ఎంపిక కసరత్తు.. మరోవైపు ప్రచారాలతో పార్టీల్లో, శ్రేణుల్లో హీట్ పెరుగుతోంది.

**రంజిత్ అస్త్ర సన్యాసం!**



చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అస్త్రసన్యాసం చేశారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది లేదని తేల్చి చెప్పారు. దీంతో గులాబీ అధిష్టానం పునరాలోచనలో పడింది. సిట్టింగ్ ఎంపీ పోటీకి వెనుకడుగు వేయడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఆఖరికి ఎన్నికల వేళ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వానికి మొగ్గు చూపింది. ఇదే విషయాన్ని సోమవారం జరిగిన నియోజకవర్గ నేతల సమావేశంలో గులాబీ బాస్ కేసీఆర్ ప్రకటించారు. ఇటీవల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి మరోసారి బరిలో ఉంటారని ప్రకటించారు. కొన్నాళ్లు ఆయన కూడా ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన పరిణామాలు ఆయనను పునరాలోచనలో పడేశాయి. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి దంపతులు హస్తం గూటికి చేరడం..పలువురు దిగువశ్రేణి నాయకులు కూడా కారు దిగడం..ఆయనను ఆత్మరక్షణలో పడేసింది. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి పోటీకి దూరంగా ఉండడమే మేలనే అభిప్రాయానికి వచ్చిన ఆయన కొన్నాళ్లుగా మౌనముద్ర దాల్చారు.

## మద్యం మత్తులో ఉరేసుకుని...



ఆత్మహత్య చేసుకున్న నజీర్

**మైలార్‌దేవ్‌పల్లి:** మద్యం మత్తులో గేటుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..శాస్త్రిపురం రిజ్వాన్ కాలనీకి చెందిన మహమ్మద్ నజీర్ (35) ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. 11 ఏళ్ల క్రితం రహీమా బేగంతో వివాహమైంది. బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. నిత్యం మద్యం తాగి వస్తుండడంతో భార్యతో గొడవలు జరిగాయి. దీంతో రహీమా బేగం పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. నజీర్ శాస్త్రిపురంలో ఉంటున్న తన తల్లిదగ్గరకు వెళ్లిపోయాడు. సోమవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఉన్న నజీర్ గేటుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వందేభారత్..నయా లుక్



సికింద్రాబాద్ స్టేషన్‌లో నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

**సాక్షి, సిటీబ్యూరో:** సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణానికి అందుబాటులోకి రానున్న రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సరికొత్త రంగుల్లో ఆకట్టుకుంటోంది. ఆరెంజ్, ట్యాంజెరిన్ గ్రే రంగుల్లో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న అందమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సోమవారం సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రధాని మోదీ ఈ ట్రైన్‌ను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ స్టేషన్ 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు దక్షిణమధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. 13వ తేదీన విశాఖపట్టణం నుంచి, 15వ తేదీన సికింద్రాబాద్ నుంచి వందేభారత్ సెకెండ్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ కోసం ప్రయాణికులు 12వ తేదీన రిజర్వేషన్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి.ఈ ట్రైన్ సికింద్రాబాద్‌లో ఉదయం 5.05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2.35 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి రాత్రి 11.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ట్రైన్ వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో నిమిషం నుంచి 2 నిమిషాల పాటు హాల్టింగ్ సదుపాయం ఉంది. ఈ ట్రైన్‌లో 7 ఏసీ చైర్‌కార్ కోచ్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ ఏసీ చైర్ కోచ్ ఉంటాయి. 530 మంది ప్రయాణం చేసే సామర్థ్యంతో ఈ ట్రైన్ ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.

# విద్యుత్ వాడకం 'పీక్'

### భగ్గున మండుతున్న ఎండలు..



- గిర్రున తిరుగుతున్న మీటర్లు
- పెరిగిన విద్యుత్ డిమాండ్

**గత పది రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఇలా..(ఎంయూలలో)**

| తేదీ | 2023 | 2024 |
|---|---|---|
| 01 | 58.52 | 66.54 |
| 02 | 58.86 | 64.66 |
| 03 | 59.53 | 61.18 |
| 04 | 56.61 | 66.99 |
| 05 | 52.15 | 68.11 |
| 06 | 58.75 | 69.31 |
| 07 | 56.05 | 70.71 |
| 08 | 53.07 | 70.26 |
| 09 | 56.03 | 66.57 |
| 10 | 58.03 | 63.19 |
| 11 | 56.73 | 70.01 |

**సాక్షి, సిటీబ్యూరో:** గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ డిమాండ్ పీక్ స్థాయికి చేరుకుంది. సాధారణంగా ఏప్రిల్ మూడో వారం నుంచి మే మాసంలో కన్పించాల్సిన ఈ డిమాండ్ మార్చి రెండో వారంలోనే కన్పిస్తుండటం ఆందోళన కలిగిస్తుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..భవిష్యత్తులో సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఓవర్ హెడ్‌లైన్లు మరింత ఒత్తిడికి గురయ్యే అవకాశం లేకపోలేదు. మెజార్టీ సబ్‌స్టేషన్లలో, డీటీఆర్‌ల వద్ద సరైన ఎర్తింగ్ సిస్టం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. ఎండలు పెరగడంతో ఉపశమనం కోసం జనం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను ఆన్ చేశారు. ఫలితంగా ఇంట్లో కరెంట్ మీటర్ గిర్రున తిరుగుతోంది.



**రికార్డులు బ్రేక్..**

2023 మే 19న విద్యుత్ వినియోగం 79.33 మిలియన్ యూనిట్లు(ఎంయూలు)గా నమోదైంది. డిస్కం చరిత్రలో ఇప్పటి వరకు ఇది ఆల్‌టైం రికార్డు. సాధారణంగా ఏప్రిల్, మే మాసాల్లో నమోదు కావాల్సిన రికార్డులు..ఈసారి మార్చిలోనే నమోదయ్యే అవకాశం లేకపోలేదని డిస్కం అంచనా వేస్తుంది. 2024 మార్చి 7న 70.71 ఎంయూలు నమోదైంది. గత ఏడాది మార్చిలో నమోదైన సగటు వినియోగంతో పోలిస్తే ఈ సారి 1000 మెగావాట్లు అధికంగా నమోదైంది. ఇక సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్‌పై పర్యవేక్షణ చేస్తూ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూస్తున్నారు. మిగతా ఇంజనీర్లు, సిబ్బంది కూడా విధుల్లో ఉన్నారు.

# నిరీక్షణే..!

### ట్యాంకర్లకు పెరిగిన డిమాండ్

- కనీసం 48 గంటలు దాటాల్సిందే..
- జలమండలికి పెరిగిన బుకింగ్ తాకిడి

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ మహానగరంలో వేసవి ప్రారంభంలోనే నీటి కష్టాలు తప్పడం లేదు. మండుతున్న ఎండలకు భూగర్భజలాలు పడిపోతుండటంతో గృహోపయోగ బోర్లు బోరుమంటున్నాయి. జలమండలి రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్న నల్లా నీరు పెరిగిన అవసరాలకు సరిపోవడం లేదు. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోని కాలనీలు, బహుళ అంతస్తుల సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. దీంతో జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ బాగా పెరిగినట్లయింది. కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. గత నెల రోజులుగా జలమండలి 'డయల్ యువర్ ట్యాంకర్లకు'కు ఫోన్ల తాకిడి బాగా పెరిగింది. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉందంటే మండు వేసవి మార్చి చివర, ఏప్రిల్, మే మాసాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆలోచన మరింత ఆందోళన కలిగిస్తోంది.

**70పైనే ట్యాంకరు ఫిల్లింగ్ కేంద్రాలు**

జలమండలి పరిధిలో ప్రస్తుతం 70 ఫిల్లింగ్ కేంద్రాలు ఉన్నాయి. గత నెల రోజులుగా ట్యాంకర్ల బుకింగ్ బాగా పెరిగింది. సాధారణ రోజుల్లో కంటే మూడింతలు పైగా ట్యాంకర్ల బుకింగ్ పెరిగినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం జలమండలికి దినసరి ట్యాంకర్ల బుకింగ్ సంఖ్య రెండు వేల వరకు ఉండగా ట్యాంకర్ల సరఫరా మాత్రం నత్తలకు నడక నేర్పిస్తోంది. కనీసం కనీసం 48 గంటల నుంచి 72 గంటల పాటు నిరీక్షించే పరిస్థితి నెలకొంది. తాజా పరిస్థితులతో బహుళ అంతస్తుల భవన సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలు 80 శాతం ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నాయి. శివారు ప్రాంతాల్లో సమస్య మరింత అధికమైంది. మాదాపూర్, ఎస్ఆర్‌నగర్, నిజాంపేట, మణికొండ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, కేపీహెచ్‌బీ, ప్రగతినగర్, వనస్థలిపురం, బాచుపల్లి, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, గౌతమ్ నగర్, బాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో నీటి కష్టాలు అధికమయ్యాయి.

**పెరిగిన తాకిడి**

ప్రధానంగా ఆలియాబాద్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కేపీహెచ్‌బీ, బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, షేక్‌పేట, మియాపూర్ తదితర వాటర్‌బోర్డు ఫిల్లింగ్ స్టేషన్ల పరిధిలో ట్యాంకర్లకు తాకిడి పెరిగింది. మాదాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో కమర్షియల్, డొమెస్టిక్ ట్యాంకర్ల బుకింగ్‌లు భారీగా పెరిగినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు బోర్డు ట్యాంకర్ల రాక ఆలస్యం కావడంతో కొందరూ ప్రైవేటుట్యాంకర్లవైపు మొగ్గు చూపుతున్నారు.



## దూసుకొచ్చిన మృత్యువు..

- ఓఆర్ఆర్‌పై ఆగిఉన్న కారును ఢీకొన్న టస్కర్ వాహనం
- ఒకరి మృతి..ఇద్దరికి గాయాలు
- గోవాకు వెళ్తుండగా ఘటన



ప్రమాదానికి కారణమైన టస్కర్ వాహనం

**రాజేంద్రనగర్:** గోవాకు వెళ్లి సరదగా గడిపి వద్దామని కారులో బయలుదేరగా...వేగంగా దూసుకొచ్చిన ఓ టస్కర్ వాహనం ఒకరి ప్రాణం తీసింది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బోరబండ ప్రాంతానికి చెందిన అనిల్ (27), సురేశ్ (29), కిరణ్ కుమార్ (29), నాగరాజు, పాండు స్నేహితులు. వీరంతా గచ్చిబౌలి ప్రాంతంలోని వివిధ ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్నారు. గోవాకు వెళ్లేందుకు ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో బోరబండ నుంచి కారులో బయలుదేరారు. హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు వద్దకు రాత్రి 12.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. వాహనం నుంచి శబ్దాలు వస్తుండటంతో పక్కకు ఆపి పరిశీలిస్తున్నారు. అనిల్, సురేశ్, కిరణ్ కుమార్‌లు పక్కనే మూత్ర విసర్జన చేసి నిలబడి ఉన్నారు. ఇదే సమయంలో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళుతున్న భారీ టస్కర్ వాహనం వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో అనిల్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా..సురేశ్, కిరణ్ కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ఓఆర్ఆర్ అంబులెన్స్ సిబ్బంది ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. టస్కర్ వాహనం డ్రైవర్ అజాగ్రత్త..అతివేగం కారణంగా ఈ సంఘటన చోటు చేసుకుందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సాక్షరత కార్యక్రమం విజయవంతం చేయాలి

- జిల్లాలో 68,454 మంది నిరక్షరాస్యుల గుర్తింపు
- ఈ ఏడాది 9,135 మందిని అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయం
- అదనపు కలెక్టర్ పి.కదిరవన్

సాక్షి, సిటీబ్యూరో : నవభారత సాక్షరత కార్యక్రమం ద్వారా నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సహకారం అందించాలని అదనపు కలెక్టర్ కదిరవన్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నవభారత సాక్షరత కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో 68,454 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు పట్టణ ప్రగతి సర్వే ద్వారా గుర్తించామన్నారు. ఈ సంవత్సరం 9,135 మందిని అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయించామన్నారు. నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సహకారం అందించాలని సూచించారు. నవభారత సాక్షరతా కార్యక్రమం 2022-27 వరకు ఐదు సంవత్సరాలపాటు అమలయ్యేలా ప్రకటించినట్లు గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు ఖర్చు పెడుతాయని, 15-35 సంవత్సరాల వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, వయోజన విద్య డీడీ నాగలక్ష్మి, డీఈఓ రోహిణి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కదిరవన్

# మీరాలం ట్యాంక్‌పై కేబుల్ బ్రిడ్జి

- రూ.363 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్న హెచ్ఎండీఏ
- పాతబస్తీలో పర్యాటక హంగులు
- కేబుల్‌బ్రిడ్జి నిర్మాణం పై అసదుద్దీన్ హర్షం

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ పర్యాటక హంగులను అద్దుకోనుంది. సందర్శకులను ఆకట్టుకునేందుకు చారిత్రక మీర్ ఆలం ట్యాంక్‌పైన కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు హెచ్ఎండీఏ కమిషనర్ దానకిషోర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు రూ.363 కోట్ల అంచనాలతో కేబుల్ స్టే బ్రిడ్జిని నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందులో రూ.359.53 కోట్లు సివిల్ పనుల కోసం ఖర్చు చేయనున్నారు. మరో రూ.3.47 కోట్లు షిఫ్టింగ్ పనులకు వినియోగించనున్నారు. ఇది మీరాలం ట్యాంక్ పైన ఇటు బెంగళూర్ జాతీయ రహదారి నుంచి అటు చింతల్‌మెట్ రోడ్డు వరకు నాలుగు లేన్‌లతో 2.65 కిలోమీటర్ల పొడవున ఈ కేబుల్ బ్రిడ్జి ఉంటుంది. బ్రిడ్జిపైన రెండు చోట్ల 140 మీటర్లతో ప్రవేశానికి ర్యాంపులను ఏర్పాటు చేస్తారు. ఒక చోట 110 మీటర్‌లతో ఎగ్జిట్ ర్యాంపు ఉంటుంది. అలాగే కేబుల్ బ్రిడ్జిపైన ఆర్నమెంటల్ లైటింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూమిని టీడీఆర్ పద్ధతిలో సేకరించనున్నారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో ఈ బ్రిడ్జిని నిర్మించనున్నారు.

**ఎంపీ అసద్ హర్షం...**

ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న మీరాలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హర్షం వ్యక్తం చేశారు. ఇది వినియోగంలోకి వస్తే అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నగరవాసులకు చక్కటి ఆహ్లాదకరమైన పర్యాటక సదుపాయం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులకు కూడా ఎంతో సదుపాయంగా ఉంటుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ


జాతీయ మిడ్ వైఫరీ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

బన్సీలాల్‌పేట్: ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించడానికి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సికింద్రాబాద్ బోయిగూడలోని జాతీయ మిడ్ వైఫరీ శిక్షణా కేంద్రాన్ని సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు, యువత సంపూర్ణ ఆరోగ్య కోసం వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా మిడ్ వైఫరి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయమన్నారు. తల్లి బిడ్డ క్షేమంతో పాటు సుఖ ప్రసవానికి ఉపయోగపడేలా నిష్ణాతులైన వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కోరారు. పేదల వైద్య ఆరోగ్య సేవల కోసం తెలంగాణ ప్రభుత్వం నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందన్నారు. పేదలకు సకాలంలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడానికి నిర్దిష్టమైన కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల యునిసెఫ్ ఫీల్డ్ ఆఫీసర్ చీఫ్ డాక్టర్ జెలాలెం, ఫెర్నాండెజ్ ఆసుపత్రి ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ ఏవిటా ఫెర్నాండెజ్‌లను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో యూనిసెఫ్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. నర్సింగ్ సంబంధిత పలు విభాగాలను అనుసంధానం చేసేలా నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటును సీఎం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డి, స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, డీఎంఈకేవీ కరణ్, డీఎంఈ డాక్టర్ వాణి పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు జీహెచ్ఎంసీ నిదర్శనం

హిమాయత్‌నగర్: మహిళా సాధికారతకు జీహెచ్ఎంసీ నిదర్శనమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమీషనర్ రోనాల్డ్ రాస్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా మాధురి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలకు సాటి మహిళలు సహకారం అందించినపుడే మహిళాభ్యున్నతి సాకారమవుతుందన్నారు. అంతకు ముందు మేయర్ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా 15 మంది శానిటేషన్ కార్మికులను సత్కరించారు. ఆ తర్వాత మేయర్ శానిటేషన్ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తాం

హిమాయత్‌నగర్: నగరంలో ప్రశాంత వాతావరణంలో పార్లమెంటు ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్, హైదరాబాద్ నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ) కార్యాలయంలో ఎన్నికల సమన్వయ సమావేశాన్ని నగర లా అండ్ ఆర్డర్ విభాగం అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, నోడల్ అధికారులతో కలిసి నిర్వహించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన అడిషనల్ నోడల్ అధికారులు, సబ్ నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారలు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఇతర పోలీసు అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్‌లు సూచించారు.

# 4.4 కిలోల గంజాయి, 5 ఎల్ఎస్‌డీ పేపర్లు స్వాధీనం

ఐదుగురి అరెస్ట్


గంజాయితో పట్టుబడ్డ కుషాల్ ప్రదాన్


మిథున దాల్


మహ్మద్ షకీల్


విశాల్

గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి నాలుగున్నర కిలోల గంజాయి, ఐదు ఎల్ఎస్‌డీ పేపర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆయా పీఎస్‌ల పరిధిలో కేసులు నమోదు చేసి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు, మాదాపూర్ పోలీసులు ఖైత్లాపూర్ సిగ్నల్ వద్ద ఒడిషాకు చెందిన గగన్ కుమార్(24) వద్ద 1.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సిద్దిఖీనగర్‌లో ఒడిషాకు చెందిన కుషాల్ మిథున్, మిథున దాల్ వద్ద 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. బల్కంపేటలోని ఎల్లమ్మ టెంపుల్ సమీపంలో లా చదువుతున్న విషాల్(30) వద్ద ఐదు ఎల్ఎస్‌డీ(మత్తు మందు) పేపర్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. అత్తాపూర్‌లోని డి మార్ట్ సర్వీస్ రోడ్డులో ఆటోలో గంజాయి పెట్టుకొని విక్రయిస్తున్న యువకుడు మహ్మద్ షకీల్(34)ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసును అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు.

## ఐఆర్‌సీటీసీ పేరుతో ఆన్‌లైన్‌లో నగదు మాయం

వెంగళరావునగర్: ఐఆర్‌సీటీసీ పేరుతో ఆన్‌లైన్‌లో యువతి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం... గోపిశెట్టి కుమారి అనే మహిళ ఓ ప్రైవేటు సంస్థలో విధులు నిర్వహిస్తూ రహమత్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఈమె ఈ నెల 10న ఏలూరు నుంచి బేగంపేటకు ఐఆర్‌సీటీసీ రైల్వే అధికారిక వెబ్‌సైట్ నుంచి టికెట్‌ను బుక్ చేసింది. కొన్ని గంటల తర్వాత దానిని క్యాన్సిల్ చేయడం కోసం కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతికింది. దాంతో గుర్తు తెలియని నెంబర్ నుంచి ఆమెకు ఫోన్ వచ్చింది. ఐఆర్‌సీటీసీ నుంచి చేస్తున్నామని చెబుతూ ఆమె వివరాలు అడిగి 403 నెంబర్‌కు కాల్ చేస్తే క్యాన్సిల్ అవుతుందని చెప్పారు. దాంతో ఆ నెంబర్‌కు కాల్ చేయగా ఆమె నెంబర్ హ్యాక్ అయింది. వెంటనే ఆమె ఖాతాలో నుంచి రూ. 78,974 నగదు కట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. ఆమె నిర్ఘాంతపోయి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి కొంత నగదును బ్లాక్ చేయించింది. అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి దరఖాస్తును పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ పి.కదిరవన్



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.కదిరవన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్‌లతో మాట్లాడుతూ వారి పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 132 అర్జీలు రాగా 117 గృహ నిర్మాణ శాఖకు, ఇతర శాఖలకు సంబంధించినవి 15 ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవోలు, తహసీల్దార్లు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సమాజంలో మహిళలదే కీలక పాత్ర

– ధర్మపురి క్షేత్రం వ్యవస్థాపకురాలు సత్యవాణి


మాట్లాడుతున్న ధర్మపురి క్షేత్రం వ్యవస్థాపకురాలు సత్యవాణి

సాక్షి,సిటీబ్యూరో: మహిళలు చాలా శక్తిమంతులని, ఓర్పు నేర్పు నిబద్ధతతో పనిచేస్తారని ధర్మపురి క్షేత్రం వ్యవస్థాపకురాలు సత్యవాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయం, చరిత్రలను చిన్నతనంలోనే అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్, డీఆర్ఓ వెంకటాచారి, డిప్యూటీ కలెక్టర్లు లావణ్య, అపర్ణ, తహసిల్దార్లు, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అనధికారికంగా తిరుగుతున్న ఆటోలపై చర్యలు తీసుకోవాలి

పంజగుట్ట: రవాణాశాఖ రిజిస్ట్రేషన్ ప్రకారం హైదరాబాద్ మహానగరంలో లక్ష 30 వేల ఆటోలు ఉండాలని కాని ఆ సంఖ్య అనధికారికంగా 3 లక్షలు ఉందని తెలంగాణ ఆటో యూనియన్స్ ఫెడరేషన్ కన్వీనర్ శివానందం అన్నారు. సోమవారం పంజగుట్ట, సోమాజిగూడ పలు ప్రాంతాల్లో ఆటోలకు సిటీ పర్మిట్ అనే స్టిక్కర్లను అంటించారు. ఫెడరేషన్ కో కన్వీనర్ మహ్మద్ ఇబ్రహీం అహ్మద్‌తో కలిసి మాట్లాడుతూ... ఏ ఆటో అయినా పర్మిట్ నిబంధనల ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిలో అయితే జీహెచ్ఎంసీలోనే తిరగాలని, లేకపోతే రిజిస్ట్రేషన్ అయిన ఇంటి నుంచి 60 కిలోమీటర్లలోపు మాత్రమే తిరగాలన్నారు. అయితే ఉపాధి కల్పన పేరుతో వివిధ జిల్లాల నుంచి ఆటోలను తీసుకొచ్చి జీహెచ్ఎంసీ పరిధిలో నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లామని అయినా చర్యలు శూన్యమన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## డ్రగ్స్ పార్సిల్ చేస్తున్నారంటూ రూ. 19 లక్షలు మోసం

ముంబై పోలీసులమంటూ బాధితుడికి స్కైప్ కాల్

హిమాయత్‌నగర్: ముంబై కస్టమ్స్ అధికారులమంటూ ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్‌కి చెందిన ఓ వ్యక్తికి ముంబై పోలీసులమంటూ సైబర్ నేరగాళ్లు కాల్ చేశారు. తన పేరుతో డీహెచ్ఎల్ పార్సిల్‌లో నిషేధిత పదార్థాలు (డ్రగ్స్) సీజ్ చేసినట్లు చెప్పారు. ముంబై పోలీసులమంటూ స్కైప్‌లో వీడియో కాల్ ద్వారా పోలీసుల వేషధారణలో బాధితుడిని నమ్మించి, పార్సిల్‌తో పాటు బాధితుడి వివరాలు చూపించి భయపెట్టారు. ఈ కేసు నుంచి బయటపడలేవని, తాము చెప్పిన విధంగా చేయాలని బెదిరించారు. ఈ కేసుకు సంబంధించి సీబీఐ,ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం గోప్యంగా విచారించాలన్నారు. అందుకు గాను ఈ కేసులో క్లియరెన్స్, ఎన్‌వోసీ జారీ చేయాలంటే, వివిధ కారణాలు చెబుతూ రూ.19 లక్షల 30 వేలు బదిలీ చేయించుకున్నారు. వాటిని వెరిఫై చేసి వెంటనే తిరిగి పంపిస్తామని నమ్మించారు. అనంతరం వారు స్పందించకపోవడంతో మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

## సైఫాబాద్ పీజీ కాలేజీలో స్టాటిస్టిక్స్ కోర్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సైఫాబాద్ పీజీ కాలేజీలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ కోర్సును ఈ విద్య సంవత్సరం నుంచి ప్రవేశ పెట్టారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుగా 40 సీట్లతో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం



**ఫిలింనగర్:** కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ కార్యాలయం వద్ద సోమవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, రిసోర్స్ పర్సన్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, డి. సుకన్య, జయ, సునీత, దేవి, లత, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష వాహన సేవలో శ్రీవారు



**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామి వారిని సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవలో, సాయంత్రం సర్వభూపాల వాహన సేవలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ... కోరిన కోర్కెలు తీర్చేది కల్పవృక్షమని, ఇహ లోక సుఖాలు తీర్చేందుకు కల్పవృక్షానికి ఎంతో పూజలు చేస్తారని అలాంటి కల్పవృక్షంపై శ్రీనివాసుడు భక్తుల చెంతకు వస్తున్నాడని అన్నారు. వేడుకగా జరిగిన ఈ పూజాదికాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాలొన్నారు.

## గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

**హిమాయత్‌నగర్:** గిరిజనులకు జనాభా ప్రాతిపదికన 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని భారతీయ బంజారా సేన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బంజారా సేన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా సేన జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు శేషు రామ్ నాయక్ మాట్లాడుతూ... మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బంజారా భాష మాట్లాడుతున్న వారిని ఒకే కులంలో చేర్చాలని, అలాగే గ్యార్ బోలీ భాషను ప్రవేశ పెట్టాలని, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు రుక్మిణి నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు డి.ప్రేమ్ చంద్ నాయక్, రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**ఫిలింనగర్:** షేక్‌పేట మండలం జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలో వంద గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి వినాయకనగర్‌లో ఎ.రమణయ్య, నాగేశ్వరరావు అనే ఇద్దరు దర్జాగా స్థలం కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. కొంతకాలంగా రమణయ్య, నాగేశ్వరరావు ఇద్దరూ కలిసి వినాయకనగర్ గుట్ట మీద ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతుండగా, పలుమార్లు రెవెన్యూ సిబ్బంది హెచ్చరించినా పట్టించుకోలేదు. దీంతో వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కబ్జాదారులపై క్రిమినల్ కేసు కూడా నమోదైంది. ఈ నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అధికారుల కదలికతో ఖరీదైన సర్కార్ జాగాకు విముక్తి లభించింది.

## త్రివిధ దళాలకు సైఫాబాద్ ఎన్‌సీసీ క్యాడెట్లు

రాణిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు.. పలువురు ప్రశంసలు

**బంజారాహిల్స్:** ఇటీవల విడుదలైన నౌకాదళం ఫలితాలలో సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ఎన్‌సీసీ క్యాడెట్లు అధికారులుగా ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన క్యాడెట్ సాయివీర్, రాజ్‌కుమార్‌లు నేవీ ఎస్ఎస్ఆర్ అధికారులుగా ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పల్లాటి నరేషలు హర్షం వ్యక్తంచేస్తూ వారిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్ విద్యార్థుల శ్రమ, ప్రతిభ ఎనలేనిదన్నారు. కళాశాలలో శిక్షణ పొందిన క్యాడెట్లకు దేశ రక్షణ ప్రాథమిక బాధ్యత అనే నినాదాన్ని నింపుతూ శారీరకంగా, మానసికంగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఈ విద్యార్థులు దేశ సేవలో చాలా ధనికులుగా కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు.




సాయివీర్



రాజ్‌కుమార్

## అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



**శ్రీనగర్‌కాలనీ:** విద్యార్థులు సాంస్కృతిక, ఆధునిక, జానపద నృత్యాలతో పాటు పలు ఆలోచింపజేసే ప్రదర్శనలు ఆహూతులను అమితంగా ఆకట్టుకున్నాయి. సోమవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జూబ్లీహిల్స్ సెయింట్ మేరీస్ కల్చరల్ నైట్–2024ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. అత్యుత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కరెస్పాండెంట్ ఎం.జె.థామస్, ప్రిన్సిపాల్ ఆశలత, వైఎస్ ప్రిన్సిపాల్ సునీత, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ సైంటిస్ట్ హైదరాబాద్ డాక్టర్ జయప్రకాష్ నాయర్, టీచర్స్ పాల్గొన్నారు.

## సందడిగా 'నేనూ మోదీ కుటుంబ సభ్యుడినే'



**శ్రీనగర్‌కాలనీ:** ప్రధాని వెంటే తాము అని, నూటనలభై కోట్ల భారతీయులు నా కుటుంబ సభ్యులని అని తెలిపిన ప్రధాని మోదీ నినాదానికి మద్దతుగా వెంగళరావునగర్ డివిజన్ వెల్లంకి ఫుడ్స్ వద్ద నేనూ మోదీ కుటుంబ సభ్యుడినే అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బీజేపీ తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనూహ్య రెడ్డి నేతృత్వంలో కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోత మోగితే.. ఫైన్ పడుద్ది..!

- మోడిఫైడ్ సైలెన్సర్లపై పోలీసులు ఉక్కుపాదం
- సైలెన్సర్ మార్చేంత వరకు సీజ్.. జరిమానా తథ్యం
- వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో బైక్‌లను తనిఖీ చేస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్

**బంజారాహిల్స్:** ఎక్కువ సౌండ్ కోసం బైక్ సైలెన్సర్ మార్చడం.. అందరూ తమను గుర్తించాలనే స్టైల్ కోసం వెహికల్‌ను మోడిఫికేషన్ చేయించడం వంటి చర్యలతో రోడ్లపై చెవులు దద్దరిల్లే రీతిలో దూసుకుపోతున్న బైక్‌లపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు.

- వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొంతకాలంగా మోడిఫైడ్ సైలెన్సర్ల స్కూటర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ తిరుగుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు.
- ఈ నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటికే 400లకు పైగా మోడిఫైడ్ సైలెన్సర్ల బైక్‌లను గుర్తించి జరిమానాలు విధించడమే కాకుండా అక్కడికక్కడే వాటిని తొలగించి వాహనంతో పాటు వచ్చిన సైలెన్సర్‌ను బిగించిన తర్వాతనే విడుదల చేస్తున్నారు. దీనికి రూ. 10 నుంచి రూ. 20 వేల వరకు జరిమానా విధిస్తూ వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు.
- వాహనంతో పాటు వచ్చిన సైలెన్సర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం వాహనం వచ్చిన తర్వాత అందులో ఏ ఒక్క పరికరాన్ని కూడా మార్చడానికి వీల్లేదు.
- అలా మార్చడం చట్ట విరుద్ధం. స్కూటరిస్టులు స్టైల్ కోసం కొంతకాలంగా సైలెన్సర్లను మార్చి ఇష్టానుసారంగా దూసుకుపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీరి స్పీడ్‌కు, శబ్దానికి కళ్లెం వేస్తున్నారు.
- తరచూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీలు చేపట్టి మోడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించి అవి తొలగించిన తర్వాత బుల్డోజర్లతో తొక్కిస్తున్నా కొందరు ఆకతాయిలు మళ్లీ సైలెన్సర్లను ఏర్పాటు చేస్తూ రోడ్లపై దూసుకుపోతున్నారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, నెక్లెస్‌రోడ్డు, ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో అర్ధరాత్రి పూట అధిక శబ్దంతో బైక్‌లు, కార్లు దూసుకెళ్తున్నట్లుగా ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి.

### సైలెన్సర్లు మారిస్తే కఠిన చర్యలు

షోరూం నుంచి వచ్చిన వాహనాలకు అధిక శబ్దం సైలెన్సర్లను ఏర్పాటు చేస్తూ కొంత మంది స్కూటరిస్టులు సైలెన్సర్లను మారుస్తూ మోడిఫైడ్ చేస్తున్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. పంజగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో రోజూ వాహనాల తనిఖీ చేపడుతూ మోడిఫైడ్ సైలెన్సర్లను ఏర్పాటు చేసిన బైక్‌లను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటున్నాం. వాహనాలు సీజ్ చేసి ఒరిజినల్ సైలెన్సర్లను ఏర్పాటు చేసేదాకా విడుదల చేయడం లేదు. వాహనదారులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రోజూ ఈ తనిఖీలు ఉంటాయి.

– కట్టా హరిప్రసాద్, ఏసీపీ, వెస్ట్‌జోన్ ట్రాఫిక్

## సాయిబాబాకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం



**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని విశ్వసాయి మందిర్‌లో కొలువుదీరిన శ్రీసాయిబాబాకు మాఘ మాస పూజా మహోత్సవాల్లో భాగంగా ఆఖరు రోజున వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అత్యంత వైభవంగా అభిషేకం నిర్వహించారు. గత నెల 10వ తేదీన మాఘ మాస మహోత్సవాలు ప్రారంభం కాగా వేడుకల్లో భాగంగా ముగింపు రోజున సుగంధ ద్రవ్యాలతో అభిషేకం అనంతరం స్వామివారి ఉత్సవమూర్తికి ఏకవారాభిషేకం, సహస్రనామ పుష్పార్చన, నక్షత్ర హారతి, అర్చన, ధూపసేవ, మధ్యాహ్న హారతి, సంధ్యాహారతి, శేజ్ హారతి, పుంజలసేవ కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. సుఖ జీవనం, కీర్తి ప్రతిష్టలను భక్తులు పొందేవిధంగా ఈ అభిషేకాన్ని అత్యంత ఆడంబరంగా నిర్వహించారు. వేడుకల ముగింపు రోజున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. నెల రోజుల పాటు వివిధ రకాల ద్రవ్యాలతో సాయిబాబాకు ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్లకూరి బాపేశ్వరశర్మ, సురేందర్‌శర్మలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## సినీ, టీవీ రంగాల్లో డబ్బింగ్ కళాకారుల పాత్ర కీలకం



డబ్బింగ్ ఆర్టిస్ట్స్ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న డబ్బింగ్ ఆర్టిస్ట్స్, పలు యూనియన్ల ప్రతినిధులు

**శ్రీనగర్‌కాలనీ:** సినిమా, టెలివిజన్ రంగంలో డబ్బింగ్ కళాకారుల పాత్ర చాలా కీలకమైనదని, వారి స్వరంతో బుల్లితెర, వెండితెరకు ఓ మణిహారమని సీనియర్ నటి రోజారమణి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నేడు అన్ని భాషల చిత్రాలకు మరింత వన్నె తెచ్చేలా, కథకు తగ్గట్టుగా పాత్రలకు తమ స్వరాన్ని అందించి చిత్ర విజయాల్లో భాగస్వాములుగా డబ్బింగ్ కళాకారుల ప్రతిభ అద్వితీయమన్నారు. డబ్బింగ్ కళాకారుల అభ్యున్నతి, సంక్షేమం కోసం అధ్యక్షుడు ఆర్.సి.ఎం.రాజు, జనరల్ సెక్రటరీ, చంద్రశేఖర్ వర్మ, ట్రెజరర్ టి.వి.వి.ఎస్.వరప్రసాద్‌ల చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. తెలుగు సినిమా డిజిట్ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు గోగినేని శివరాంప్రసాద్, తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ నాగబాల సురేష్‌కుమార్, తెలుగు సినిమా ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, నటులు కాదంబరి కిరణ్, అజయ్ ఘోష్, తెలుగు టీవీ, డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాకేష్, విజన్ వీవీకే చైర్మన్ విజయ్‌కుమార్, తెలుగు టెలివిజన్ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు వినోద్‌బాల, మ్యూజిక్ డైరెక్టర్ బంటి పాల్గొన్నారు.

## ఘనంగా ఆల్ ఇండియా ఓపెన్ బ్రిడ్జ్ టోర్నీ ముగింపు వేడుకలు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

**ఫిలింనగర్:** ఫిలింనగర్ కల్చరల్ సెంటర్(ఎఫ్ఎన్‌సీసీ) 12వ ఆల్ ఇండియా ఓపెన్ బ్రిడ్జ్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ నెల 9 తేదీన ప్రారంభమైన ఈ టోర్నమెంట్ 11న ముగియగా దేశ నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో చెన్నైకి చెందిన నెస్ట్ ఇన్ టీం చాంపియన్‌గా నిలిచింది. ఈ జట్టుకు నవయుగ ట్రోఫీతో పాటు, నగదు బహుమతి అందజేశారు. ఈ టోర్నమెంట్ మెయిన్ స్పాన్సర్‌గా నవయుగ ఇంజినీరింగ్ వ్యవహరించింది. విజేతకు ట్రోఫీ అందజేసిన వారిలో నిర్మాత కె.ఎల్.నారాయణ, డైరెక్టర్ బి.గోపాల్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీసీ సెక్రటరీ ముళ్లపూడి మోహన్, జాయింట్ సెక్రటరీ పెద్దిరాజు, ట్రెజరర్ రాజశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఖాజా సూర్యనారాయణ, జె.బాలరాజు, శైలజ, ఏడిద రాజా, సామా ఇంద్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి: బీజేపీ




బీజేపీ డివిజన్ అధ్యక్షుడు విజయ్ తదితరులు

**వెంగళరావునగర్:** దేశం మరింతగా పురోభివృద్ధి చెందాలంటే మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని భారతీయ జనతా పార్టీ వెంగళరావునగర్ డివిజన్ అధ్యక్షుడు నందికాశి విజయ్‌కుమార్ ఆకాంక్షించారు. నేనూ మోదీ కుటుంబ సభ్యుడినే కార్యక్రమం సోమవారం డివిజన్ పరిధిలోని వెంగళరావునగర్, కళ్యాణ్‌నగర్‌కాలనీ, ఈస్ట్ రహమత్‌నగర్, మధురానగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ సీనియర్ నేతలు అట్లూరి రామకృష్ణ, కిలారి మనోహర్, అనూహ్యరెడ్డి, రవీందర్, అల్లం ఈశ్వర్, వేణుగోపాల్, సంగీత, నాగలక్ష్మి, మురళీకృష్ణ, చక్రపాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతలు పులిరామ్, బడుగు సతీష్, రాజేందర్ గుప్తా, మోహన్, రాణిబాయ్, విజయ, లక్ష్మణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కర్రీపాయింట్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

వ్యక్తికి స్వల్ప గాయాలు



**ఖైరతాబాద్:** కర్రీ పాయింట్‌లో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీకై మంటలు చెలరేగి ఒక సిలిండర్ పేలిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ రైల్వేగేట్ వద్ద శ్రీ మహాలక్ష్మి మీల్ అండ్ కర్రీపాయింట్‌లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బలరాంచారి అనే వ్యక్తి వంట చేస్తుండగా గ్యాస్ లీకైనట్లు స్మెల్ రావడంతో వెంటనే అప్రమత్తమయ్యాడు. అప్పటికే మంటలు అంటుకొని వంటచేస్తున్న ఫ్లేమ్ ముఖంపై పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. అప్పటికే అక్కడికి చేరుకున్న ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌తో పాటు కానిస్టేబుళ్లు వెంకటేష్, వేణుగోపాల్ తడిగుడ్డల సాయంతో లోపల ఉన్న రెండు సిలిండర్లను బయటకు తీసుకువచ్చారు. మరో సిలిండర్ పేలడంతో కర్రీపాయింట్ లోపల మంటలు చెలరేగాయి. మంటలను ఫైర్ సిబ్బంది సాయంతో ఆర్పివేశారు.

## శానిటరీ ప్యాడ్స్ పంపిణీ



**బంజారాహిల్స్:** మహిళా దినోత్సవ వేడుకలను సామాజిక సేవా కార్యక్రమంతో నిర్వహించి ఎన్బీటీ నగర్ ఎస్ఎల్ఎఫ్–6 మహిళా సమాఖ్య బృందం శభాష్ అనిపించుకుంది. సోమవారం బస్తీలోని కమ్యూనిటీ హాల్‌లో మహిళా సమాఖ్య ప్రతినిధులు చేయిచేయి కలిపి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వంద మంది విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత కెంటెన్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం తమ సమాఖ్య ఆధ్వర్యంలో ఏదో ఒక సామాజిక కార్యక్రమం నిర్వహిస్తుంటామని అందులో భాగంగా ఈ సారి విద్యార్థినుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి ఎం.విజయ, ఉపాధ్యక్షురాలు బి.విజయ, కోశాధికారి మమత, జాయింట్ సెక్రటరీ భవానీ, ఆర్పీ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాదిగ సంఘీభావ సదస్సు

**రహమత్‌నగర్:** ఎస్పీఆర్‌హిల్స్‌లోని రాజీవ్‌గాంధీనగర్‌లో మంగళవారం మాదిగ సంఘీభావ సదస్సు నిర్వహించనున్నారు. ఎమ్మార్పీఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కన్వీనర్ చిట్యాల ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొంటారని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, పల్లె నర్సింగరావు మాదిగ వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందని తెలిపారు. ఈ క్రమంలోనే మంద కృష్ణ మాదిగ రాజీవ్‌గాంధీ నగర్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు.

## బీజేపీ నేతల నిరసన

**రహమత్‌నగర్:** ప్రధాని నరేంద్రమోదీపై ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్‌యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై బోరబండలో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ మాట్లాడుతూ... లాలు ప్రసాద్ చేసిన వ్యాఖ్యాలను యావత్ దేశ ప్రజలు ఖండిస్తున్నారన్నారు. బోరబండలోని పలు ప్రాంతాల్లో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కృష్ణమోహన్, రాజేందర్ రాథోడ్, వీరస్వామి, కృష్ణ, సర్వే శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



**హిమాయత్‌నగర్:** నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్ గౌడ్ పరిశీలించారు. సోమవారం హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 6లో నూతన సీసీ రోడ్డు పనులను కాంట్రాక్టర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. సీసీ రోడ్డు పనులను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు జి.రామన్ గౌడ్, మహేష్, జైస్వాల్, జగదీష్, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

**రహమత్‌నగర్:** పవిత్ర రంజాన్ మాసంలో విరివిగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఖురైషీ కాన్ఫరెన్స్ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రహీం ఖురైషీ సూచించారు. రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం శ్రీరాంనగర్‌లో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు చేపడితే రెట్టింపు ప్రతిఫలం లభిస్తుందని పవిత్ర ఖురాన్ బోధిస్తుందన్నారు. ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సౌత్ ఇండియా అధ్యక్షుడు నాగేష్, తెలంగాణ అధ్యక్షుడు సయ్యద్ మేరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## క్వారీ స్థలంలో ఓపెన్ జిమ్



**రహమత్‌నగర్:** ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఎస్పీఆర్ హిల్స్ క్వారీ స్థలంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తామని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి తెలిపారు. క్వారీ స్థలంలో వ్యాయామ సామగ్రిని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రహమత్‌నగర్ డివిజన్‌కు జీహెచ్‌ఎంసీ నుంచి రూ. 1.60 లక్షలు నిధులు కేటాయించామని, ఇందులో భాగంగానే క్వారీ స్థలంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన సామగ్రి ఇప్పటికే వచ్చిందన్నారు. త్వరలోనే ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తామని సీఎన్ రెడ్డి తెలిపారు.

## కార్పొరేట్ కళాశాలల ఆగడాలను అరికట్టాలి

- నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్న కాలేజీలు
- ఆయా కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

**హిమాయత్‌నగర్:** విద్యను పూర్తిగా వ్యాపారం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలపై తక్షణం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లేని జూనియర్ కాలేజీల జాబితాను ఇంటర్మీడియట్ విద్య మండలి ప్రకటించాలని, ఇంటర్ బోర్డ్ అడ్మిషన్ నోటిఫికేషన్ వెలువడక ముందే నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల గుర్తింపులను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి శృతి ఓజాని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ... అడ్మిషన్లు ఒకచోట, తరగతులు ఇంకోచోట నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలల ఆగడాలకు ఇంటర్ బోర్డ్ అడ్డుకట్ట వేయాలన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టడానికి మానసిక నిపుణుల కమిటీలు వేసేలా బోర్డ్ ఆదేశాలు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే ఇంటర్ బోర్డ్ కార్పొరేట్ కళాశాలల ఆగడాలను ఆపాలని, లేనిపక్షంలో కార్పొరేట్ విద్యా సంస్థలపై దాడులు చేస్తామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లిన యువకుడి అదృశ్యం

**వెంగళరావునగర్:** ఎలక్ట్రీషియన్‌గా ఉద్యోగం చేసేందుకు బెంగళూరు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... టి.స్వరూపరాణి, శ్రీనివాస్‌చంద్ర దంపతులు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ మూడు నెలలుగా రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు సుభాష్ చంద్ర యాదగిరినగర్‌లో ఉన్నపుడు పంజగుట్టలోని జ్యువెలరీ షాపులో పని చేస్తూ సెప్టెంబర్ 25న మంచి జీతం కోసం బెంగళూరు వెళ్లాడు. తన స్నేహితుడితో కలిసి ఉంటూ ఉద్యోగం చేస్తున్నట్టుగా చెప్పాడు. అయితే ఇటీవల స్వరూపరాణి కుమారునికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుంది. దాంతో అతని స్నేహితుడు మణికంఠకు ఫోన్ చేయగా మీ అబ్బాయి బాగానే పని చేస్తున్నాడని, ఫోన్ పగిలిపోయిందని చెప్పడమేగాని అతనికి ఫోన్ ఇవ్వడం లేదు. దాంతో మణికంఠ, అతని భార్య స్వాతిపై అనుమానం వ్యక్తం చేస్తూ స్వరూపరాణి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## మద్యం మత్తులో కారు నడిపిన యువకులు

జూబ్లీహిల్స్‌లో రోడ్డు ప్రమాదం



**బంజారాహిల్స్:** స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు హాజరై తిరిగివస్తున్న క్రమంలో మద్యం మత్తులో కారు నడుపుతూ రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఎల్‌బీనగర్‌కు చెందిన మల్లికార్జున్‌రెడ్డి (25), సంతోష్, అరవింద్, మరో మైనర్ బాలుడు నలుగురు కలిసి టీఎస్09 ఈబీ 0087 నెంబర్ కారులో ఆదివారం రాత్రి కొండాపూర్‌లో నివసించే విశాల్ అనే స్నేహితుడి బర్త్‌డేకు వెళ్లారు. వేడుకల అనంతరం సోమవారం తెల్లవారుజామున మల్లికార్జున్‌రెడ్డి కారు నడుపుతుండగా మిగతా ముగ్గురు వెనుకన కూర్చొన్నారు. మద్యం మత్తులో కారు నడుపుతుండడంతో వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విందు ముగించుకుని వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగిందని, వీరు మద్యం సేవించి ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. మల్లికార్జున్, సంతోష్, అరవింద్‌లపై ఐపీసీ సెక్షన్ 279, 336 ఎంవీ యాక్ట్, పీడీపీపీ యాక్ట్ కేసు నమో దు చేశారు. మైనర్ బాలుడిపై కూడా జువైనల్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం



కేశబోయిన శ్రీధర్

**హిమాయత్‌నగర్:** కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటనతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో కీలక మార్పులు సంభవిస్తాయని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలలో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ విజయానికి అగ్ర నేతల పర్యటనలతో పార్టీలో మరింత జోష్ పెరుగుతుందన్నారు. మంగళవారం ఎల్‌బీ స్టేడియంలో అమిత్ షా పాల్గొనే బూత్ అధ్యక్షుల సమ్మేళనం, ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగే సోషల్ మీడియా సమావేశాన్ని దిగ్విజయం చేయాలని ఆయన పార్టీశ్రేణులు, అభిమానులకు పిలుపునిచ్చారు.

# బడుగుల భూచోరుడు బాబే..

## అమరావతిలో అసైన్డ్ భూములు కొల్లగొట్టింది పచ్చగద్దలే

- ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను భయపెట్టి.. మభ్యపెట్టి మరీ దోపిడీ
- బినామీల పేరిట అక్రమ జీపీఏ రిజిస్ట్రేషన్లతో దందా
- రూ.4,400 కోట్ల విలువైన 1,100 ఎకరాలు హస్తగతం
- ఉన్నతాధికారులు, ఏజీ అభ్యంతరాలు బేఖాతరు
- ఇదీ చంద్రబాబు ముఠా భూబాగోతం
- న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీఐడీ
- ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా నారాయణ



సాక్షి, అమరావతి : రాజధాని పేరిట అమరావతిలో చోటుచేసుకున్న భూదోపిడీకి కర్త, కర్మ, క్రియ అంతా చంద్రబాబు ముఠానేనని సీఐడీ తేల్చింది. ఈ కేసులో ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా నారాయణలతోపాటు పలువురిపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో సోమవారం చార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. ఐపీసీ సెక్షన్లు 420, 409, 506, 166, 167, 217, 120 (బి), 109 రెడ్‌విత్ 34, 35, 36, 37.. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంలోని సెక్షన్లు 3(1),(జి), 3(2), అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద వారిపై అభియోగాలు నమోదు చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతుల అసైన్డ్ భూములను చంద్రబాబు బ్యాచ్ కొల్లగొట్టిందన్నది ఆధారాలతో సహా సీఐడీ వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి మరీ సాగించిన ఈ భూబాగోతం యావత్ దేశాన్ని విస్మయపరిచింది. ఏకంగా రూ.4,400 కోట్లు విలువైన 1,100 ఎకరాల అసైన్డ్ భూములను చంద్రబాబు, నారాయణ తమ బినామీలు, సన్నిహితుల పేరిట గుప్పెట పట్టారన్నది సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో తేలింది.

### జీఓ-1తో భయపెట్టి.. జీఓ-41తో భూదోపిడీ

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని పేరిట భారీ భూదోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు. అందుకోసం పక్కా పన్నాగంతో రాజధాని కోసం భూసమీకరణ ప్యాకేజీని నిర్ణయిస్తూ 2015, జనవరి 1న జీఓ–1ను జారీచేశారు. అందులో అమరావతిలో ప్రైవేటు భూములకే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. అసైన్డ్ భూములకు ఎలాంటి ప్యాకేజీ ప్రకటించలేదు. అనంతరం.. చంద్రబాబు, నారాయణ తమ బినామీలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వారి ఏజెంట్లను గ్రామాల్లోకి పంపించి భయపెట్టారు. తమకు ఆ భూములు విక్రయిస్తే కొంతైనా డబ్బులు వస్తాయని చెప్పారు. తీవ్ర ఆందోళనకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులు అత్యంత తక్కువ ధరకు అంటే ఎకరాకు కేవలం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకే చంద్రబాబు, నారాయణ, ఇతర టీడీపీ పెద్దల బినామీలకు అసైన్డ్ భూములను సేల్ డీడ్ల ద్వారా విక్రయించేలా చేశారు. చంద్రబాబు, నారాయణ తమ బినామీలైన కేపీవీ అంజనీ కుమార్ (రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్), గుమ్మడి సురేశ్, కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి, కొల్లి శివరామ్‌లతోపాటు నారాయణ కుటుంబ సభ్యుల పేరిట ఆ అసైన్డ్ భూములు బదలాయించారు. అనంతరం.. మంగళగిరి తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులపై ఒత్తిడి తెచ్చి వాటిని అక్రమంగా బదలాయిస్తూ 'జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించారు. అసైన్డ్ భూములను అలా జీపీఏ పేరిటగానీ ఇతరత్రా విధాలుగాగానీ బదిలీ చేయడం చట్టవిరుద్ధం. ఆ తర్వాత ఆ భూములకు కూడా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటిస్తూ 2016, ఫిబ్రవరి 17న జీఓ–41 జారీచేశారు. తద్వారా తాము బినామీల పేరిట హస్తగతం చేసుకున్న అసైన్డ్ భూములకు సీఆర్‌డీఏ భారీ ప్యాకేజీ దక్కేలా చేశారు.

### 1,100 ఎకరాలు.. 1,336 మంది బినామీలు

- నారాయణ కుటుంబ సభ్యుల పేరిటే 162 ఎకరాలు అసైన్డ్ భూదోపిడీ కోసం చంద్రబాబు ముఠా రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్‌కు తెగబడింది. రెవెన్యూ రికార్డులు, సీఆర్‌డీఏ భూసమీకరణ రికార్డులను సీఐడీ అధికారులు పరిశీలించగా మొత్తం వ్యవహారం బయటపడింది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పేర్లకు విరుద్ధంగా సీఆర్‌డీఏ భూసమీకరణ ప్యాకేజీ ఇచ్చిన వాటిలో 1,336 మంది బినామీల పేర్లు ఉండటం గమనార్హం.
- ఇక నారాయణ విద్యా సంస్థల బ్యాంకు ఖాతాల నుంచే రూ.16.5 కోట్ల నిధులను రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. అనంతరం ఆ నిధులను నారాయణ విద్యా సంస్థల ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి వారి పేరున అసైన్డ్ భూములను అక్రమంగా జీపీఏ రిజిస్ట్రేషన్లు చేయించారు.

**అసైన్డ్ భూదోపిడీదారులు వీరే..**

- ఏ-1 : నారా చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి
- ఏ-2 : పొంగూరు నారాయణ, టీడీపీ ప్రభుత్వంలో మున్సిపల్, సీఆర్‌డీఏ శాఖ మంత్రి
- ఏ-3 : అన్నే సుధీర్‌బాబు, (అప్పటి తుళ్లూరు మండల తహసీల్దార్)
- ఏ-4 : కేపీవీ అంజనీకుమార్ (ఎండీ, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్)

- నారాయణ కుటుంబ సభ్యుల పేరిటే అక్రమంగా 162 ఎకరాల అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేశారు. వీటి విలువ రూ.650కోట్లు. నారాయణ 16.5 కోట్లు పెట్టుబడి పెట్టి రూ.650కోట్ల భూములు కొల్లగొట్టారు.
- అంతేకాక.. దాదాపు రూ.4వేల కోట్ల విలువైన మరో వెయి ఎకరాల వరకు చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట అక్రమంగా జీపీఏ రిజిస్ట్రేషన్లు చేయించారు.

### ప్రభుత్వ ఒత్తిడితోనే అంటూ అధికారుల వాంగ్మూలం..

నిజానికి.. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చట్టవిరుద్ధం. వాటికి భూసమీకరణ కింద ప్యాకేజీ ప్రకటించడానికి వీల్లేదు. అదే విషయాన్ని స్పష్టం చేస్తూ రెవెన్యూ ఉన్నతాధికారులతోపాటు అడ్వకేట్ జనరల్ కూడా అసైన్డ్ భూముల బదలాయింపును గుర్తిస్తూ వారికి కూడా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించడాన్ని వ్యతిరేకించారు. కానీ.. చంద్రబాబు, నారాయణ ఉన్నతాధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసి తాము చెప్పినట్లు చేయమని హుకుం జారీచేశారు. నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే అసైన్డ్ భూముల బదలాయింపు చేశామని నాటి రెవెన్యూ ఉన్నతాధికారులు న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక ఈ కేసులో నిందితుడిగా ఉన్న కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి తనను అప్రూవర్‌గా పరిగణించమని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

## సీఎం జగన్ రంజాన్ మాసం శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో కఠిన ఉపవాసం ఆచరించే ఈ పుణ్య రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదన్నారు. మహనీయుడైన మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించినది రంజాన్ మాసంలోనే కావడంతో ముస్లింలు ఈ నెలకు అత్యంత ప్రాముఖ్యతనిస్తారన్నారు. మనిషిలోని చెడు భావాల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతూ మానవాళికి హితాన్ని బోధించే గొప్ప పండుగ రంజాన్ అని పేర్కొన్నారు. కఠిన ఉపవాస దీక్ష ఆచరిస్తూ, దైవ చింతనతో గడిపే ముస్లింలు తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానధర్మాల ద్వారా ఖర్చు చేస్తుంటారన్నారు. వారికి అల్లాహ్ దీవెనలు లభించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు.

## జనసేన సీట్లలో కోత

- బీజేపీకి సీట్ల సర్దుబాటుకు జనసేన అసెంబ్లీ స్థానాల్లో 3 తగ్గించిన బాబు
- జనసేనకు 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాలు.. బీజేపీకి 10 అసెంబ్లీ, 6 లోక్‌సభ స్థానాలు
- టీడీపీకి 144 ఎమ్మెల్యే, 17 ఎంపీ సీట్లు

సాక్షి, అమరావతి: బీజేపీ, జనసేన, టీడీపీ మధ్య ఎట్టకేలకు సీట్ల సర్దుబాటు జరిగింది. బీజేపీ ఎక్కువ స్థానాలు కోరడంతో ఆ పార్టీకి సీట్ల సర్దుబాటు చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన సీట్లలో కోత వేశారు. ఇప్పటివరకు జనసేనకిచ్చే 24 అసెంబ్లీ స్థానాల్లో మూడు సీట్లు తగ్గించి 21 స్థానాలతో సరిపెట్టారు. మొత్తంమీద బీజేపీ, జనసేనకు కలిపి 31 ఎమ్మెల్యే, 8 ఎంపీ సీట్లను చంద్రబాబు కేటాయించారు. టీడీపీ 144 అసెంబ్లీ స్థానాల్లో 17 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయనుంది. ఈ మేరకు మూడు పార్టీల ఉమ్మడి ప్రకటనను చంద్రబాబు సోమవారం రాత్రి ఎక్స్ (ట్విటర్)లో విడుదల చేశారు. 31 ఎమ్మెల్యే సీట్లలో 21 స్థానాల్లో జనసేన, 10 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనున్నాయి. అంతకు ముందు జనసేనకు కేటాయించిన మూడు ఎంపీ సీట్లలోనూ ఒకటి తగ్గిపోయిన విషయం తెలిసిందే. అంటే 2 లోక్‌సభ స్థానాల్లో మాత్రమే జనసేన పోటీ చేయనుంది. 6 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుంది. ఈ సీట్ల సర్దుబాటులో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పూర్తిగా చంద్రబాబుకు లొంగిపోయినట్లు స్పష్టమైంది.


బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, పార్టీ ముఖ్య నేత బైజయంత్ పాండా సోమవారం విజయవాడ వచ్చి, ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. పవన్ కళ్యాణ్ కూడా అక్కడికి వెళ్లారు. వారి మధ్య రాత్రి వరకు చర్చలు జరిగాయి. తొలుత బీజేపీ పెద్దలు తమకు, జనసేనకు కలిపి 45 ఎమ్మెల్యే, 10 ఎంపీ సీట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. సుదీర్ఘంగా చర్చలు జరిపిన చంద్రబాబు ఎట్టకేలకు వారిని 10 ఎమ్మెల్యే సీట్లు 6 ఎంపీ సీట్లకు ఒప్పించారు. రెండురోజుల క్రితం ఎన్డీఏతో పొత్తు ఖరారైన రోజే సీట్ల పంపకం కూడా పూర్తయినట్లు చంద్రబాబు పార్టీ నేతలకు చెప్పింది నిజం కాదని తాజా చర్చలతో స్పష్టమైంది. బీజేపీ, జనసేనకు కలిపి 30 అసెంబ్లీ, 8 ఎంపీ స్థానాలు కేటాయించినట్లు చంద్రబాబు ఆరోజు పార్టీ నేతలకు చెప్పారు. వాస్తవానికి ఢిల్లీలో ఎన్డీఏలో టీడీపీ చేరడం మాత్రమే జరిగింది. సీట్లపై అసలు చర్చ కూడా జరగలేదు. కానీ చంద్రబాబు తనకు అనకూలంగా ఎల్లో మీడియా ద్వారా సీట్ల పంపకం కూడా పూర్తయినట్లు ప్రచారం చేయించారు. సీట్ల పంపకం పూర్తయిన నేపథ్యంలో ఆయా పార్టీలు.. తమ కేటాయించిన సీట్లకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

### సీట్ల సంఖ్య ముఖ్యం కాదు: పవన్

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి పని చేస్తాయని జనసేన అధ్యక్షుడు సోమవారం తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్టు చేశారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సీట్ల పంపకం జరిగిందన్నారు. సీట్ల సంఖ్యలో హెచ్చుతగ్గులకంటే రాష్ట్ర శ్రేయస్సు ముఖ్యమని స్పష్టం చేశారు.

## వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

**షరతులు విధించిన తెలంగాణ హైకోర్టు**



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడి (ఏ5)గా సీబీఐ పేర్కొన్న డి.శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల పూచీకత్తు సీబీఐ కోర్టుకు సమర్పించాలని, ప్రతి సోమవారం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య హాజరు కావాలని, కేసులో ప్రత్యక్షంగా, పరోక్షంగా జోక్యం చేసుకోవద్దని, కోర్టులో విచారణ ముగిసే వరకు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించొద్దని ఆదేశించింది. అలాగే పాస్‌పోర్టు ట్రయల్ కోర్టుకు సమర్పించాలని, విచారణలో కోర్టుకు సహకరించాలని, ఎలాంటి క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడవద్దని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్ వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డిని సీబీఐ 2021లో అరెస్టు చేసింది. అప్పటి నుంచి జైలులో ఉంటున్న ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గత సంవత్సరం సెప్టెంబర్ 19న సీబీఐ కోర్టు కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తనకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని, సీబీఐ వద్ద ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేకుండానే అరెస్టు చేసిందని, బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరిపి, సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉమామహేశ్వర్ రావు, సీబీఐ తరఫున స్పెషల్ పీపీ అనిల్ థన్వర్ వాదనలు వినిపించారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేసినందున శివశంకర్‌రెడ్డి నేడు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది.

### ఏళ్లుగా జైలులో ఉంచడం సరికాదు

నిందుతులనే పేరుతో ఏళ్ల తరబడి జైలులో ఉంచడం సరికాదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పలు సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేశాయని తెలిపారు. నిందితుని తరఫు న్యాయవాది వాదనలతో పాటు ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం నిందితులకు కూడా హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. నిందితుని తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. '2021 అక్టోబర్ 26న సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రంలో శివశంకర్‌రెడ్డిపై ఎలాంటి ఆరోపణలు లేవు. హంతకుడు దస్తగిరి (ఏ4)ని అప్రూవర్‌గా పేర్కొన్నారు. అతను చెప్పిన స్టేట్‌మెంట్‌లో శివశంకర్‌రెడ్డిపై ఆరోపణలు చేశాడు. 2022 జనవరి 31న దాఖలు చేసిన తొలి మధ్యంతర అభియోగపత్రంలో శివశంకర్‌రెడ్డిని ఏ5గా చేర్చారు. కేసులో ఇరికించడానికే నిందితుడిగా చేర్చారు. దస్తగిరి చెప్పిన సెక్షన్ 161, 164 స్టేట్‌మెంట్లలో పరస్పర విరుద్ధ అంశాలున్నాయి. కేసు తీవ్రతను గుర్తించని ట్రయల్ కోర్టు కీలక నిందితుడు దస్తగిరికి ముందస్తు బెయిల్ ఇచ్చి విడుదల చేసింది. హత్య, సాక్ష్యాల చెరిపివేతలో శివశంకర్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. అయినా 2021 నవంబర్ 17 నుంచి జైలులో ఉంచడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. 55 ఏళ్ల శివశంకర్‌రెడ్డి వెన్ను నొప్పితో బాధ పడుతున్నారు. భుజానికి కూడా ఇటీవలే శస్త్రచికిత్స జరిగింది. నిరంతర వైద్యుల పర్యవేక్షణ అవసరం. దీని మెడికల్ రిపోర్టును కూడా అందజేశాం'అని కోర్టుకు వివరించారు.

## ఢిల్లీ చేరిన 'ఆదిలాబాద్ సీటు పంచాయితీ'

- బీజేపీ పెద్దలను కలిసిన 'రాథోడ్‌లు'
- మాజీ ఎంపీ నగేష్ చేరికపై అసహనం

సాక్షి, న్యూఢిల్లీ: ఆదిలాబాద్ బీజేపీ సీటు వ్యవహారం హస్తినకు చేరింది. తొలి జాబితాలో సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావ్ పేరును బీజేపీ అధిష్టానం పక్కనపెట్టడంతో మొదలైన పంచాయితీ.. ఆదివారం బీఆర్ఎస్ మాజీ ఎంపీ నగేష్ కాషాయ కండువా కప్పుకోవడంతో తారస్థాయికి చేరింది. నగేష్ బీజేపీలో చేరినందున ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని ఆయనకే ఇస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో ఆదిలాబాద్‌కు చెందిన బీజేపీ నేతలు రమేష్ రాథోడ్, రాథోడ్ బాపూరావ్ సహా పలువురు సోమవారం ఢిల్లీకి చేరుకొని బీజేపీ పెద్దలను కలిసే ప్రయత్నం చేశారు. పార్టీలో మొదటి నుంచి పని చేసినవారికి కాకుండా ఇటీవల పార్టీలో చేరిన వారికి ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని కేటాయించొద్దని అధిష్టాన పెద్దలకు విజ్ఞప్తి చేశారు.

### చేరి 24 గంటలు కాకముందే సీటు ఎలా: రమేష్ రాథోడ్

రమేష్ రాథోడ్ మీడియాతో మాట్లాడుతూ, ఆదిలాబాద్ పార్లమెంట్ విషయంలో బీజేపీ కేంద్ర పెద్దలను కలిశామని చెప్పారు. నగేష్ పార్టీలో చేరి 24 గంటలు కూడా కాకుండానే... ఆదిలాబాద్ సీట్ తమదే అంటున్నారని మండిపడ్డారు. నగేష్‌కు ఇతర పార్టీల్లో అవకాశం దొరకక చివరికి బీజేపీలో చేరారని ఆరోపించారు. బీజేపీలో అభ్యర్థులకు కొరత ఏమాత్రంలేదన్నారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్న వారికి ఎలాంటి హామీలు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఆదివాసీల కంటే లంబాడీలే ఎక్కువ మంది ఉన్నారని చెప్పారు. బీజేపీ పెద్దలతో తనకు ఎలాంటి విభేదాలు లేదని రమేష్ రాథోడ్ స్పష్టం చేశారు.

## రెండు రోజుల్లో బీజేపీ రెండో జాబితా!

- ఢిల్లీలో కసరత్తు పూర్తి చేసిన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ
- తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల లోక్‌సభ అభ్యర్థుల జాబితా ఓ కొలిక్కి..
- 100 నుంచి 150 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లోక్‌సభ బరిలో నిలిచే అభ్యర్థుల రెండో జాబితాను బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ ఓ కొలిక్కి తెచ్చింది. రెండు రోజుల్లో సుమారు 100 నుంచి 150 మంది అభ్యర్థులతో ఈ జాబితాను విడుదల చేయనున్నట్టు ఆ పార్టీవర్గాలు తెలిపాయి. ఈ జాబితాలో బీసీలు, మహిళలకు ప్రాధాన్యత కల్పించేలా బీజేపీ అధిష్టానం ప్రత్యేక కసరత్తు చేసిందని వెల్లడించాయి.

### నడ్డా నేతృత్వంలో భేటీ అయి..

గత నెల 29న తొలిసారి భేటీ అయిన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ.. ప్రధాని మోదీ సహా మొత్తం 195 అభ్యర్థులతో తొలి జాబితాకు ఆమోదముద్ర వేసింది. మార్చి 2న తొలి జాబితాను అధికారికంగా విడుదల చేసింది. రెండో జాబితాపై సోమవారం రాత్రి 8 గంటలకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నేతృత్వంలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమైంది. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఇతర సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని రెండో జాబితాపై చర్చించారు. తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు సంబంధించిన అభ్యర్థులపై కసరత్తు పూర్తి చేశారు.

## టెట్ నిర్వహించి టీచర్ పోస్టులు పెంచాలి: కృష్ణయ్య

**పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడి**



పాఠశాల విద్యాశాఖ కార్యాలయ ముట్టడిలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య తదితరులు

ఖైరతాబాద్ (హైదరాబాద్): టెట్ నిర్వహించి, టీచర్ పోస్టులు 11 వేల నుంచి 25 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం చేపట్టిన ఉద్యమం తీవ్రతరమైంది. సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పలు జిల్లాల నుంచి భారీ ఎత్తున నిరుద్యోగ అభ్యర్థులు తరలిరావడంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముందు చేపట్టిన ముట్టడి కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ పోస్టుల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాను 30 నుంచి 70 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. టెట్ పెట్టడానికి ఎలాంటి అవరోధాలు లేకపోయినా ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు, నిరుద్యోగ జాక్ చైర్మన్ నీల వెంకటేశ్, తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షుడు జి.అనంతయ్య అధ్యక్షతన జరిగిన ముట్టడి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

## నకిలీ పాస్‌పోర్టు కేసులో మరో నలుగురు అరెస్టు

**అరెస్టయిన వారిలో ముగ్గురు ఏఎస్సైలు**
**ఈ కేసులో ఇప్పటికే 18 మంది అరెస్టు**

సాక్షి, హైదరాబాద్: నకిలీ పాస్‌పోర్టుల జారీ కేసులో సీఐడీ దూకుడు పెంచింది. ఈ కేసులో ఇప్పటికే 18 మందిని అరెస్టు చేసిన సీఐడీ, తాజాగా మరో నలుగురు కీలక నిందితులను అరెస్టు చేసింది. ఈ మేరకు సీఐడీ అడిషనల్ డీజీ శిఖాగోయల్ సోమవారం ఓ ప్రకటన జారీ చేశారు. దేశంలోకి అక్రమంగా చొరబడిన శ్రీలంక దేశస్తుల పేరిట నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి వారికి పాస్‌పోర్టులు జారీ చేయించిన ఆరోపణలపై తెలంగాణ సీఐడీ అధికారులు దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కేసుతో సంబంధం ఉన్నట్టు ఆధారాలు లభించడంతో హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌కు చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ కొప్పిశెట్టి కల్యాణ్, మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై తిప్పన్న, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై షేక్ నజీర్ బాషా, హాకా భవన్‌లోని షీటీమ్ ఏఎస్సై గుంటూరు వెంకటేశ్వర్లును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, కేసుతో సంబంధం ఉన్న ఇతర నిందితులకు సంబంధించి ఆధారాలు సేకరిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ ముఠా మొత్తం 95 మంది శ్రీలంక దేశస్తులకు, మరో 30 మంది ఇతరులకు కలిపి మొత్తం 125 పాస్‌పోర్టులను అక్రమంగా జారీ చేయించినట్టు దర్యాప్తులో వెల్లడైనట్టు తెలిపారు.

**టీడీపీ, జనసేన ఆన్‌లైన్ మృగాల వికృత క్రీడ..**

## ఓ చెల్లెమ్మను చంపేశారు!

**జగనన్న ఇంటి పట్టాలిచ్చారని సంతోషంతో చెప్పటమే ఆమె తప్పు**
**సోషల్ మీడియా వేదికలపై వెంటాడి వేధించిన టీడీపీ, జనసేన మూకలు**
**మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి**

(సాక్షి ప్రతినిధి, గుంటూరు, తెనాలి) ఆమె చేసిన తప్పల్లా... తన సంతోషాన్ని దాచుకోలేకపోవటమే. జగనన్న తన పేరిటే ఇంటి పట్టా ఇచ్చారని, తన పిల్లల్ని చదివించుకోవటానికి అమ్మ ఒడి కూడా వస్తోందని పట్టలేని సంతోషంతో చెప్పిందామె. కళ్లలో మెరుపులతో, పట్టలేని ఆనందంతో ఆమె చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సోషల్ మీడియా మూకలు దీన్ని జీర్ణించుకోలేకపోయాయి. వీధి కుక్కల్లా వెంటాడాయి. మారుపేర్లతో సంచరించే నీతీజాతీ లేని ఈ ఆన్‌లైన్ మారీచులు.... తాము మనుషులమన్న సంగతే మరిచిపోయి ప్రతి వేదిక మీదా ఆమెను నానా దుర్భాషలాడారు. అక్క చెల్లెళ్లుంటారని, తమ ఇళ్లలోనూ ఆడపిల్లలుంటారని గ్రహించే లేని రీతిలో ఆ బీసీ మహిళ గీతాంజలిని వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. ఆమె వేషభాషలను ఎగతాళి చేస్తూ, అసభ్యంగా దూషించారు. సమాజం సిగ్గుపడే కామెంట్లతో రంపపు కోత కోశారు. భరించలేని ఆ ఆడబిడ్డ మరణమే శరణ్యమనుకుంది. రైలుకింద పడి ఆత్మాహుతికి పాల్పడింది. లోతుగా చూస్తే ఇది ఆత్మహత్య కాదు. తెలుగుదేశం, జనసేన సోషల్ మీడియా మూకలు వెంటాడి వెంటాడి చేసిన దారుణమైన హత్య.

గొల్తి గీతాంజలి (30) భర్త చంద్రశేఖర్ తెనాలిలోని వహాబ్ పార్క్ ప్రాంతంలో బంగారం పని చేస్తుంటారు. వాళ్లకిద్దరు పిల్లలు. గీతాంజలి కొద్దిరోజుల కిందట ఓ యూట్యూబ్ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. తనకు ఇంటిపట్టా ఇచ్చారని, పిల్లలకు అమ్మ ఒడి వస్తోందని, అత్తమామలకు చేయూత, పింఛన్ కానుక అందుతున్నాయని చెబుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు ధన్యవాదాలు తెలియజేసింది. జగనన్నకు తప్ప ఇంకెవరికి ఓటు వేస్తామంటూ ఆమె ఎదురు ప్రశ్నించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అయింది. అదే ఆమెకు శాపమైంది. ఐటీడీపీ, జనసేన కిరాయి మూకలు సోషల్ మీడియాలో ఆమెను తీవ్రంగా వేధించాయి. ఆమెను కించపరుస్తూ విపరీతంగా ట్రోల్స్ చేశాయి.

వాస్తవానికి గీతాంజలికి గతంలోనే ఇంటి స్థలం మంజూరయింది. ఇటీవల ప్రభుత్వం ఆమెకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందచేసింది. ఈ నెల 4న కొత్తపేటలోని తాలూకా కాలేజి గ్రౌండ్స్‌లో నిర్వహించిన రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరైనప్పుడు ఈ ఇంటర్వ్యూ వ్యవహారం చోటు చేసుకుంది. ఉదయమే సభా ప్రాంగణానికి వచ్చిన గీతాంజలి అందరితోపాటు ఎమ్మెల్యే శివకుమార్‌కు షేక్ హ్యాండ్ ఇచ్చి ఎంతో ఉత్సాహంగా కనిపించింది. ఎమ్మెల్యే చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ పట్టాను అందుకున్నాక తన సంతోషాన్ని ఓ యూట్యూబ్ చానల్‌తో పంచుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్న తమకు ఇంటి స్థలం పొందడం ద్వారా కల నెరవేరిందంటూ ఉద్వేగంగా మాట్లాడింది. జగనన్నను గెలిపించుకోవటం తమ బాధ్యతని పేర్కొంది. ఫీజులు కట్టలేని తమకు అమ్మఒడి ఆసరాగా నిలిచిందని, తన పిల్లలిద్దరూ ఈ కార్యక్రమానికి వస్తే జై జగన్ అని నినదించేవారని ఉత్సాహంగా చెప్పింది. ఈ క్రమంలో కొంత భావోద్వేగానికి గురికావడం, మీడియా ఎదుట మాట్లాడే అలవాటు లేకపోవడంతో తడబాటుకు గురైంది. దీన్ని అవకాశంగా మలుచుకున్న టీడీపీ, జనసేన 'సోషల్ మాఫియా'బాధితురాలిని దారుణంగా ట్రోల్ చేసింది. ఉచ్చం నీచం లేకుండా అసభ్యంగా దూషిస్తూ, ఆమె వ్యక్తిత్వాన్ని తప్పు పడుతూ, రాయలేని భాషలో దుర్భాషలాడుతూ కొందరు కామెంట్లు పెట్టారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన గీతాంజలి శనివారం తెనాలి రైల్వే ట్రాక్‌పై ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసింది. దీన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స తీసుకుంటున్న క్రమంలోనే సోమవారం మృతి చెందింది. తెనాలి జీఆర్పీ పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు చేరుకుని కుటుంబ సభ్యులను విచారించగా సోషల్ మీడియాలో అసభ్యకర సందేశాల కారణంగా ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల తాను, తన కుటుంబం లబ్ధి పొందినట్లు గతంలో కూడా ఆమె కొన్ని వీడియోల్లో పేర్కొన్నారు. గీతాంజలిని ఆత్మహత్యకు పురిగొల్పేలా దారుణ వ్యాఖ్యలతో వికృతంగా వ్యవహరించిన సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



గీతాంజలిని సోషల్‌మీడియాలో వేధిస్తూ టీడీపీ, జనసేన కార్యకర్తలు పెట్టిన అసభ్యకర పోస్టులు

### పచ్చ మీడియాపై బాధిత కుటుంబం ఆగ్రహం

ఇద్దరు చిన్నారులతో ఎంతో చలాకీగా అందరితో కలిసి మెలసి ఉండే గీతాంజలిని సోషల్ మాఫియా పొట్టన పెట్టుకుందని బాధితురాలి కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్ మార్చురీ వద్ద కన్నీరు మున్నీరయ్యారు. తల్లి మృతి చెందడంతో ఇద్దరు ఆడపిల్లల గతి ఏం కావాలంటూ విలపించారు. మీడియాతో మాట్లాడేందుకు సైతం వారు ఇష్టపడలేదు. సోషల్ మీడియా ఆమెను పొట్టనపెట్టుకుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చ సోషల్ మీడియా కళ్లు ఎప్పుడు పచ్చగానే ఉంటాయని, పేదింటి మహిళకు ఇంత సంతోషం దక్కడం వారికి ఇష్టం లేదంటూ మండిపడ్డారు.

## భయపడొద్దు.. భరతం పడతాం

**బాధితులకు పోలీసు శాఖ భరోసా**

సాక్షి, అమరావతి: పచ్చ మూకల కిరాతకానికి తెనాలి మహిళ గీతాంజలి దారుణంగా బలైపోయిన నేపథ్యంలో 'సోషల్ మాఫియా'దాడులపై బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని, ఇందుకు పలు వేదికలను వినియోగించుకునే వీలుందని నిపుణులు సూచిస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీల సోషల్ మీడియా విభాగాల వేధింపులు కొన్నాళ్లుగా వెర్రి తలలు వేస్తున్నాయి. సొంత వ్యక్తిత్వం, తమవైన అభిప్రాయాలు కలిగి ఉండటం మహానేరం అన్నట్లు కిరాయి మూకలు దారుణంగా వ్యవహరిస్తున్నాయి. మహిళలు, చిన్నారులని కూడా చూడకుండా అసభ్యకర పదజాలంతో దూషిస్తూ తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నాయి. అయితే వీటికి జంకితే మరింత దారుణంగా తెగబడటం ఖాయం. బాధితులకు తక్షణమే రక్షణ కల్పించడం, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసు శాఖ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా చట్టాలు చేశాయి. బాధితులు ఫిర్యాదు చేస్తే చాలు వెంటనే కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు చర్యలు తీసుకుంటారు.

**ఫిర్యాదు చేయడం ఇలా..**

- ట్రోలింగ్‌కు గురయ్యేవారు, బాధితులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు. గ్రామ, వార్డు సచివాలయంలోని మహిళా పోలీసు ద్వారా కూడా పోలీసులను ఆశ్రయించవచ్చు.
- ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు సంప్రదించాల్సిన వేదికలు..
- సైబర్ క్రైమ్ పోర్టల్: https:// cybercrime. gov. in/ • సైబర్ మిత్ర వాట్సాప్ నంబర్: 9121211100 • సైబర్ బుల్లీయింగ్ 4ఎస్4యు: 9071666667


● మైత్రి రావు

# తెలుగు నేల మీద తుళు అడుగులు

**మహిళలు చదువుకుంటున్నారు.**
**మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారు.**
**మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.**
**మహిళలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు.**
**మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు.**
**మహిళలు అభిరుచిని కెరీర్‌గా మలుచుకోగలుగుతున్నారు.**
**మహిళలు సాధికారత లక్ష్యంలో విజేతలవుతున్నారు.**

‘సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి నాట్యమే నా మాధ్యమం’ అంటున్నారు మైత్రి రావు. భరతనాట్యం ద్వారా ప్రదర్శించగలిగేది పౌరాణిక ఐతిహాసిక కథనాలనే కాదు, సామాజిక అంశాల్లో సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి కూడా ఇది దీటైన మాధ్యమం అన్నారామె. సమాజం పెట్టే పరీక్షలను ఎదుర్కొంటూ విజేతగా నిలిచే ప్రతి మహిళా ఒక శక్తిస్వరూపిణే అన్నారామె. అందుకే ప్రతి భావాన్నీ లోతుగా వ్యక్తీకరించే ఈ మాధ్యమం ద్వారా తన వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు చెబుతూ, నాట్యాన్నే కెరీర్‌గా మలుచుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు స్త్రీ శక్తి పురస్కార గ్రహీత మైత్రి రావు.

‘‘మహారాష్ట్రలోని మాలేగావ్‌లో పుట్టాను. మా మూలం దక్షిణ కర్ణాటకలోని ధర్మస్థల. నేను పెరిగింది, చదువుకున్నది మైసూర్‌లో. ఇప్పటికీ ఇంట్లో తుళు భాష మాట్లాడతాం. మైసూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ నుంచి ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేశాను. డాన్స్, యోగాలను పూర్తి స్థాయి కెరీర్‌గా మార్చుకోవడానికి ముందు నోకియా కంపెనీలో రెండేళ్లపాటు డెవలపర్‌గా బెంగళూరులో ఉద్యోగం చేశాను.

డాన్స్ మీద ఆసక్తి నాలుగేళ్ల వయసులోనే బయటపడింది. నా ఆసక్తిని గమనించి మా అమ్మానాన్న నాకు ఎనిమిదవ ఏట నుంచి భరతనాట్యంలో శిక్షణ ఇప్పించారు. 2010లో అరంగేట్రం జరిగింది. నాట్యంలో ఉన్న గొప్పదనం ఏమిటంటే... ప్రతి చిన్న పెద్ద క్లిష్టమైన కీలకమైన సున్నితమైన లోతైన భావాలన్నింటినీ చాలా స్పష్టంగా, సునిశితంగా వ్యక్తీకరించగలిగిన మాధ్యమం ఇది. సాధన ద్వారా సాధించిన ఈ నైపుణ్యాన్ని దూరం చేసుకోవడానికి కళాకారులెవ్వరూ ఇష్టపడరు. అందుకే ఎంత పెద్ద ఉద్యోగమైనా సరే కళాసాధన ద్వారా వచ్చే సంతృప్తికి సమానం కాదు, కాలేదు.

మయూరి, మాధురి ఉపాధ్యాయ ఇద్దరూ నాకు ఇష్టమైన నాట్యకారిణులు, స్ఫూర్తిప్రదాతలు కూడా. మా డాన్స్ టీచర్‌లు, సీనియర్ స్టూడెంట్స్ నుంచి కూడా స్ఫూర్తి పొందాను. ఒక్కొక్కరిలో ఒక్కో అంశం మనల్ని ప్రభావితం చేస్తుంది. నేర్చుకోవాలన్నంత ఆసక్తిగా గమనిస్తే ప్రతి వ్యక్తిలోనూ గురువు కనిపిస్తారు. భరతనాట్యంతోపాటు కలరియపట్టు, అట్టక్కలరి, వ్యాలికవల్ రీతులను కూడా సాధన చేశాను. నాట్యాన్ని విస్తరింపచేయడమే నా బాధ్యత అనుకున్నాను. బెంగళూరులో శివాన్ష్ స్కూల్ ఆఫ్ డాన్స్ 2017లో స్థాపించాను. ఆ తర్వాత శివాన్ష్ శాఖలను హైదరాబాద్‌లోని సన్ సిటీ, కిస్మత్‌పూర్, కొండాపూర్, బంజారా హిల్స్‌లకు విస్తరించాను. శాస్త్రీయ నాట్యాన్ని మాధ్యమంగా చేసుకుని సమాజంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలతోపాటు అరుదైన ఇతివృత్తాలతో రూపకల్పన చేశాను. కళలనే కెరీర్‌గా తీసుకున్న మహిళలే నాతోపాటు మా ‘టీమ్ శివాన్ష్’లో ఉన్నారు.

### సాధించాం... ఇంకా ఉంది

నాట్యం నాకు చాలా ఇచ్చింది. టీవీ రియాలిటీ షోలలో విజేత కావడం ఒక సరదా. అయితే మైసూర్ లిటరరీ అండ్ కల్చర్ ఫౌండేషన్ నుంచి యువశ్రీ పురస్కారం, ఉత్కళ యువ సాంస్కృతిక సంఘ్ నుంచి నృత్యమణి, హైదరాబాద్ డాన్స్ ఫెస్టివల్ నుంచి ప్రైడ్ ఆఫ్ తెలంగాణతోపాటు జాతీయ స్థాయిలో స్త్రీ శక్తి పురస్కారాలందుకోవడం గర్వకారణం. నాట్యం ఇతివృత్తంగా రెండు సినిమాలు చిత్రీకరించారు. వాటికి అంతర్జాతీయ పురస్కారం లభించింది. ఇక నా వంతుగా నాట్యం మాధ్యమంగా సమాజానికి తిరిగి ఇవ్వాలనుకున్నాను. సమాజంలో మహిళలు తమకెదురైన సమస్యలను ఎదుర్కొంటూ శక్తిమంతులుగా మారుతున్నారు. మహిళ సాధికారత కోసం ఎన్‌జీవోలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఒక తరానికి మరో తరానికి ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు సమాజంలో మహిళల స్థితి చాలా మెరుగైంది. మహిళల్లో అక్షరాస్యత పెరగడం తొలి విజయం. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వాలు కచ్చితంగా ఉంటున్నాయి, అలాగే శిక్షల విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తున్నాయి. వీటన్నింటి దృష్ట్యా మహిళాభివృద్ధి పురోగమనంలో సాగుతోందనే నాకనిపిస్తోంది. అయితే ‘మనం సాధించేశాం’ అని సంతృప్తి చెందగలిగిన స్థితికి మాత్రం చేరలేదు. కానీ... సమానత్వ స్థాయిని మా తరంలోనే చూడగలమనే భరోసా కలుగుతోంది’’ అని మహిళాభివృద్ధి పట్ల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు మైత్రి రావు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సంరక్షణ

# తాబేలు గెలవాలి

**కుందేలు, తాబేలు కథలో**
**తాబేలు మెల్లగా అయినా సరే**
**రేస్ పూర్తి చేసి గెలుస్తుంది.**
**కాని గెలవాలంటే తాబేళ్లు ఉండాలి కదా.**
**కాలుష్యం వల్ల, వలలకు చిక్కుకుని,**
**గుడ్లు పెట్టే ఏకాంతం కోల్పోయి..**
**సముద్ర తాబేళ్లు ప్రమాదంలో పడ్డాయి.**
**ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒరిస్సా**
**రాష్ట్రాల్లో తాబేళ్ల సంరక్షణ కోసం**
**పని చేస్తున్న డాక్టర్ సుప్రజ ధారిణి కృషి.**

‘సముద్ర తీరానికి వెళ్లి చూస్తే అంతా ప్రశాంతంగా అనిపిస్తుంది. నీలి ఉపరితలం, ఒడ్డుకు వచ్చి వెళ్లే కెరటాలు... ఎంత బాగుందో కదా అని మనసు ఆహ్లాదపడుతుంది. కాని సముద్ర గర్భంలో ఏం జరుగుతున్నదో మనకు తెలియదు. మనిషి చర్యల వల్ల సముద్రం లోపల ఎంత ధ్వంసమవుతోందో తెలుసుకోవాలి. జలధి పర్యావరణాన్ని కాపాడుకోవాలి’ అంటుంది డాక్టర్ సుప్రజ ధారిణి.

చెన్నైలో స్థిరపడ్డ ఈ తెలుగు పర్యావరణ కార్యకర్త ఇప్పుడు సముద్ర తాబేళ్లకి రక్షకురాలిగా మారింది. లక్షలాది తాబేళ్ల మృత్యువాత పడకుండా తిరిగి సముద్రానికి చేరేలా చూడగలిగింది. చెన్నై తీరం, ఆంధ్రా తీరం, ఒడిశా తీరంలో ఆమె తయారు చేసిన దళాలు గస్తీ తిరుగుతూ తాబేళ్లను కాపాడుతున్నాయి.

### అంతులేని విధ్వంసం

‘సముద్ర ఆరోగ్యం బాగుంటే మత్స్యకారుల జీవితాలు బాగుంటాయి. ఎందుకంటే సముద్రమే వారి జీవనాధారం కాబట్టి. సముద్ర ఆరోగ్యం, అందులోని పర్యావరణం ఎలా ఉందో తెలియాలంటే తాబేళ్ల ఉనికి, వాటి జనాభా ఒక కొండ గుర్తు. ఎందుకంటే సముద్రగర్భంలో ఉండి నేల మీదకు వచ్చే ఏకైక జలచరం అదే. తాబేళ్లలో ఒక ముఖ్యలక్షణం ఏమిటంటే అవి గుడ్డు పగిలి ఏ నేల మీద ప్రాణం పోసుకున్నాయో ఆ నేలను గుర్తు పెట్టుకుని పెరిగి పెద్దవై గుడ్లు పెట్టడానికి అదే నేలకు వస్తాయి. అంటే పుట్టింటికి వచ్చినట్టే. కాని అవి మనుషుల మీద నమ్మకంతో పెట్టిన గుడ్లను మత్స్యకారులు నిర్లక్ష్యం చేయడం నేను చూశాను. ఇక కుక్కలు దాడి చేసి గుడ్లు తవ్వుకుని తినేస్తాయి. కొన్ని పిల్లలు బయటకు తీసి ఆడుకుంటారు. వాటి వల్ల తాబేళ్ల సంఖ్య తగ్గి సముద్ర జీవ సమతుల్యత దెబ్బ తింటుంది. అందుకని మొదట మేము మత్స్యకారులను చైతన్యవంతం చేశాం. తాబేళ్లను కాపాడితే సముద్రం బాగుంటుంది.... సముద్రం బాగుంటే మీ జీవితాలు బాగుంటాయి అని చెప్పాం. వారిప్పుడు కార్యకర్తలుగా మారి తాబేళ్లను కాపాడుతున్నారు’ అని తెలిపింది సుప్రజ ధారిణి.



### మచిలీపట్నం సొంతూరు

సుప్రజది మచిలీపట్నం. ముప్పై ఏళ్ల క్రితం వాళ్ల కుటుంబం చెన్నై తరలి వెళ్లింది. ఫిలాసఫీలో పిహెచ్‌డి చేసిన సుప్రజ చెన్నైలోనే ఒక ఆర్ట్ స్టుడియో స్థాపించుకుంది. అయితే 25 ఏళ్ల క్రితం ఆమె చెన్నైలోని నీలాంకరై బీచ్‌కు మార్నింగ్ వాక్‌కు వెళ్లినప్పుడు అక్కడ తాబేలు చచ్చిపడి ఉంది. దాపునే పిల్లలు తాబేలు గుడ్లు ఇసుక నుంచి బయటకు లాగి ఆడుకుంటూ ఉన్నారు. మత్స్యకారులు చూసినా వారించడం లేదు. ఇదంతా చూసి బాధపడింది సుప్రజ. తాబేళ్లు వొడ్డుకొచ్చి పడి చనిపోవడానికి కారణాలు తెలుసుకోవడానికి నిపుణులను సంప్రదించింది. ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్లు చేపల వలల వల్ల గాయపడి చనిపోతున్నాయని, వాటి గుడ్ల సంరక్షణ సరిగ్గా జరగక సంతతి తరిగిపోతున్నదని తెలుసుకుంది. మొదట మత్స్యకారుల్లో చైతన్యం తెచ్చి తర్వాత సమాజంలో మార్పు తేవాలని నిశ్చయించుకుంది. అలా 2002లో ఆమె తాబేళ్ల సంరక్షణ, సముద్ర పర్యావరణ సంరక్షణ లక్ష్యంగా ‘ట్రీ ఫౌండేషన్’ అనే సంస్థను ప్రారంభించింది.


● తాబేళ్లను సంరక్షిస్తున్న డాక్టర్ సుప్రజ ధారిణి

### 33 లక్షల తాబేలు పిల్లల రక్షణ

తమిళనాడులోని కంచి నుంచి ఒరిస్సాలోని గంజాం వరకు తీర ప్రాంతంలో దాదాపు 700 కిలోమీటర్ల మేర తీర ప్రాంత సంరక్షణ, తాబేళ్ల గుడ్ల పరిరక్షణ, గాయపడిన తాబేళ్లకు చికిత్స చేసి మళ్లీ సముద్రంలో ఒదిలిపెట్టడం, గుడ్లకు గస్తీ కాయడం వంటి చర్యల కోసం గార్డ్‌లను ఏర్పాటు చేసింది సుప్రజ. ఇందుకు అవసరమైన గుర్తింపు కార్డులను తమిళనాడు ప్రభుత్వం నుంచి ఇప్పించగలిగింది. కొందరికి గౌరవ భత్యాలు కూడా అందుతున్నాయి. తాబేళ్లు గుడ్లు పెట్టే సీజన్‌లో వాటిని ఒకచోట చేర్చి వెదురు దడి కట్టి కాపాడటం వల్ల ఈ ఇరవై ఏళ్లలో దాదాపు 33 లక్షల గుడ్లు పొదగబడి తాబేళ్ల పిల్లలుగా సముద్రంలో చేరాయంటే అది సుప్రజ, ఆమె సేన ప్రయత్నం వల్లే. ‘సముద్రానికి నేలకూ ఉన్న అనుబంధం విడదీయరానిది. నేల మీద నివసించేవాళ్లమే సముద్రాన్ని కాపాడుకోవాలి’ అంటోంది సుప్రజ.

బ్యూటిప్స్

## వేసవి ప్యాక్స్

వేసవి వేడికి ముఖ చర్మం తాజాదనం కోల్పోయినట్టుగా కనిపిస్తుంటుంది. వడలిపోయినట్టుగా ఉండే ముఖం తిరిగి కాంతిని పొందాలంటే ...

● పుచ్చకాయ గుజ్జు రసాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచి, ఐస్ అయ్యాక తీసి ముఖానికి, చేతులకు, మెడకు రాసుకోవాలి. ఆ తర్వాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి.



● బంగాళదుంప, క్యారెట్‌ను ఉడికించి గుజ్జు చేయాలి. ఈ మిశ్రమంలో చిటికెడు బేకింగ్ సోడా, చిటికెడు పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు ప్యాక్‌లా వేసుకోవాలి. పది నిమిషాల తర్వాత, గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ ప్యాక్ ముడతలను నివారించడంతో పాటు చర్మాన్ని మృదువుగా, కాంతిమంతంగా మార్చుతుంది.

● రెండు టీ స్పూన్ల రోజ్ వాటర్‌లో ఒక చుక్క గ్లిజరిన్, రెండు చుక్కల నిమ్మరసం వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని దూది ఉండతో అద్దుకుంటూ ముఖానికి, మెడకు రాసి, తుడవాలి. ఇది మాయిశ్చరైజర్‌లా ఉపయోగపడుతుంది. చర్మం పొడిబారడాన్ని రోజంతా నివారిస్తుంది. చర్మం ముడతలు తగ్గి, యవ్వనకాంతితో మెరుస్తుంది.

సాగుబడి
పూర్వాభాద్ర కార్తె: మార్చి 16 వరకు
ఉత్తరాభాద్ర కార్తె: 17 నుంచి

**ఈ వేసవిలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5-8 డిగ్రీల సెల్షియస్ మేరకు ఎక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని భారత వాతావరణ విభాగం కొద్ది రోజుల క్రితమే హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో 3-4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మున్ముందు ప్రచండ వడగాడ్పులు వీచే సూచనలు ఉన్నాయంటున్నారు. ఈ నేపథ్యంలో పంటలు, తోటలను సాగు చేసే రైతులు, పశు పోషకులు గత వేసవిలో కన్నా అధికంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు..**



అధిక ఉష్ణోగ్రత, వడగాడ్పులు..

# పంటలు, తోటల రక్షణ ఎలా?

తీవ్రమైన ఉష్ణోగ్రతల వలన పంట పెరుగుదల, దిగుబడి గణనీయంగా తగ్గుతాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలో పెరుగుదల మందగించడం, పురుగులు, తెగుళ్లు పెరగడం, ఆకులు మాడిపోవడం, పువ్వులు, పండ్లు రాలిపోవడంతో పాటు పండ్ల పరిమాణంలో తగ్గుదల కనిపిస్తుంది. వేడి వాతావరణం వలన పాలు ఇచ్చే పశువుల్లో శరీర ఉష్ణోగ్రత 0.5 నుండి 3.5 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు పెరగడం వలన పశువులు ఎక్కువగా నీటిని తీసుకొని తక్కువ మేత తినడం వలన పాల దిగుబడి 11 శాతం వరకు తగ్గుతుంది. వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతల నుంచి పంటలను, పండ్ల తోటలను కొన్ని యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా కొంత వరకు నష్టాన్ని నివారించుకోవచ్చు.

### పంటల నిర్వహణ...

● అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోగల వంగడాలను, రకాలను ఎంచుకోవాలి. ● పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని పంట దశ, నేల స్వభావాన్ని బట్టి తగినంత నీటి తడులు ఇచ్చుకోవాలి. ● నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తేమ సున్నిత దశల్లో పంటకు నీటి తడులు ఇవ్వాలి. ● వరి పంటలో పొట్ట, పూత దశల్లో (10 శాతం వెన్ను నుండి పూత బయటకు వచ్చినప్పుడు) 0.5% కె.ఎన్.03 పిచికారి చేస్తే వరి పంటలో అధిక ఉష్ణోగ్రతలతో కలిగే దిగుబడి నష్టాన్ని తగ్గించవచ్చు. ● వరి పంట దుబ్బు చేసే దశ నుంచి అంకురం దశ వరకు పొలంలో 2 సెం.మీ. ఎత్తున నీరు నిలువ ఉంచాలి. అంకురం దశ నుంచి పూత దశ వరకు నీటి లభ్యతను బట్టి పొలంలో 2 సెం.మీ. లేదా 5 సెం. మీ. నీరు నిలువ ఉంచాలి. నీటి లభ్యత బాగా తక్కువ ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పద్ధతిలో నీటి తడులు ఇవ్వాలి. ● మొక్కజొన్న పంట పూత దశ ఏర్పడే 10 రోజుల ముందు నుంచి కంకి ఏర్పడిన 25 రోజుల తర్వాత వరకు పంట బెట్ట పరిస్థితులను తట్టుకోలేదు. కాబట్టి, రైతులు పైరుకు జీవసంరక్షక నీటి తడి ఇవ్వాలి.

### పండ్ల తోటల్లో ప్రత్యేక జాగ్రత్తలు...

● నీటి వసతి అధికంగా ఉన్న ప్రాంతాల్లో వడగాడ్పుల ప్రభావాన్ని తగ్గించడానికి తరచుగా నీరు ఇవ్వాలి.
● పండ్ల తోట 6 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సుదైతే, ఒక రోజుకు ఒక చెట్టుకు 150-240 లీటర్ల నీరు అవసరం. అవకాశం ఉన్నచోట సేంద్రియ పదార్థాలైన గడ్డి తదితర పదార్థాలతో మొక్కల మొదళ్లలో ఆచ్ఛాదన (మల్చింగ్) చేయటంతో పాటు బిందు సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ● ఆచ్ఛాదన చేయడం వలన నేలలో తేమ ఎక్కువ కాలం నిలువ ఉండి, మొక్కకు అందుబాటులో ఉంటుంది. వరి గడ్డి లేదా స్థానికంగా లభించే సేంద్రియ పదార్థాలు లేదా పాలిథిన్ షీట్లను మొక్కల మొదళ్ళ చుట్టూ కప్పాలి.
● మామిడి తోటలో ఏప్రిల్ – మే మాసంలో 1% పొటాషియం నైట్రేట్ (13-0-45) మందును 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ● బెట్ట పరిస్థితుల్లో నల్లి (మైట్) ఉధృతి పెరుగుతుంది. నివారణకు 30 మి.లీ. డైకోఫాల్ లేదా 20 మి.లీ. ప్రొపార్గైట్ లేదా 20 మి.లీ. ఇథియాన్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ● ఒకటి లేదా రెండేళ్ల వయస్సు గల పండ్ల తోటలు లేదా కొత్తగా నాటిన తోటల చుట్టూ వేసవిలో వడగాల్పుల ప్రభావం తగ్గించడానికి సరుగుడు లేదా వెదురు మొక్కలను నాటుకోవాలి.

### కూరగాయ తోటల్లో ఏం చేయాలి?

● అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగల కూరగాయ రకాలను ఎంచుకొని సాగు చేసుకోవాలి. ● తరచుగా నీటి తడులు ఇవ్వడం ద్వారా నేలలో తేమను సంరక్షించుకోవచ్చు. ● బిందు సేద్యం చేసే పంటల్లో ప్రతి రోజూ అరగంట (ఉదయం, సాయంత్రం) 2సార్లు నీరివ్వాలి.
● ప్రధాన పంటపై వడగాడ్పుల ప్రభావాన్ని తగ్గించడానికి, మొక్కజొన్నను 3–4 వరుసల సరిహద్దు పంటగా వేసుకోవాలి. ప్రతి 20–25 మీటర్ల దూరంలో అంతర పంటగా వేసుకోవాలి. ● 50% షేడ్ నెట్‌ను వాడి పంటలపై అధిక ఉష్ణోగ్రత, వడగాల్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.
● కోళ్ళ పాడి, వేడి వాతావరణాన్ని తట్టుకోవడానికి షెడ్లల్లో ఫ్యాన్లను, ఫాగర్లను అమర్చాలి. షెడ్లను వరి గడ్డితో కప్పి స్ప్రింక్లర్లు అమర్చాలి. ● కోళ్ళు ఎక్కువ మోతాదులో దాణా తినటం కోసం మెత్తటి దాణాతో పాటు చల్లని తాగు నీటిని అందుబాటులో ఉంచాలి.

– **డా. లీలారాణి,** ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి)- అధిపతి
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం,
వ్యవసాయ పరిశోధన సంస్థ,
రాజేంద్రనగర్, హైదరాబాద్.

# పశువులను కాపాడేదెలా?

వేసవి కాలంలో ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులు వీచడం వల్ల ఉష్ణతాపానికి గురైే పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళు తీవ్ర అసౌకర్యానికి, అనారోగ్యానికి లోనుకావడమే కాకుండా వడదెబ్బకు గురవుతూ ఉంటాయి. కాబట్టి, పశుపోషకులు, గొర్రెలు– మేకల పెంపకదారులు వేసవికాలంలో కొన్ని జాగ్రత్తలు తీసుకొని పశువులు, గొర్రెలు మేకలు అనారోగ్యానికి గురికాకుండా, వడదెబ్బ బారిన పడకుండా సంరక్షించుకోవచ్చు. వాతావరణ మార్పులకు అనుగుణంగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతిని పాటించడం ద్వారా ఉత్పాదక శక్తి తగ్గకుండా రైతు ఆశించిన ఫలితాలను పొందవచ్చు.


పశువుల చల్లదనం కోసం ఫాగర్లు, ఫ్యాన్లు అమర్చిన దృశ్యం

### ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల సంరక్షణ ఇలా..

అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, షెడ్లలో అధిక సంఖ్యలో కిక్కిరిసి ఉండటం, ఉక్కపోత, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి, బలహీనంగా మారతాయి. పశువులు సరిగా నడవలేక, తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. జీవక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, మేత తక్కువగా తీసుకోవడం వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గటం వలన ఇతర వ్యాధులు, పరాన్నజీవులు ఆశించే అవకాశం పెరుగుతుంది. కొన్ని సమయాల్లో దాహంతో ఉన్న పశువులు మురికి గుంటల్లో ఉన్న నీటిని తాగడం వల్ల పారుడు వంటి జీర్ణకోశ వ్యాధులు రావచ్చు. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవించే అవకాశాలున్నాయి. వడదెబ్బకు గురైన పశువుల్లో దాహం పెరుగుతుంది. తూలుతూ నడుస్తూ పడిపోవడం, రొప్పుతూ, శ్వాస కష్టమవడంతో ఒక్కొక్కసారి అపస్మారక స్థితికి వెళ్ళి మరణించే ప్రమాదం ఉంటుంది.

### పశువుల మేపు...

వేసవి తాపంతో జీర్ణక్రియ సన్నగిల్లుతుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ లాంటి పదార్థాలు ఇవ్వడం మంచిది. ఎక్కువ శాతం పచ్చిగడ్డి ఇవ్వాలి. ఒకవేళ మాగుడు గడ్డి సమృద్ధిగా ఉంటే అందించవచ్చు.

పచ్చిగడ్డిని ఉదయం సమయాల్లో, ఎండుగడ్డిని రాత్రి సమయాలలో వేర్వేరుగా ఇవ్వాలి. అధిక పాలిచ్చే పశువులకు దాణాను నీటితో కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మంచిది.

మేపు కొరకు పశువుల్ని ఎండవేళల్లో కాకుండా ఉ. పూట 6 నుంచి 10 గంటల వరకు, సా. 5 నుండి 7 గంటల వరకు బయటకు పంపడం మంచిది. వేసవి తాపానికి గురైన పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. వ్యాధి నిరోధక టీకాలు ఇది వరకు వేయించని పశువులు, గొర్రెలు, మేకలకు గాలికుంటు వ్యాధి, గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. దాహంతో ఉన్న పశువులు మురుగునీరు తాగటం వల్ల పారుడు వంటి జీర్ణకోశ రోగం వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఎల్లవేళలా మంచి చల్లని తాగునీరు ఇవ్వాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా తాగించాలి.

### వడదెబ్బకు గురైన పశువులకు ప్రథమ చికిత్స...


వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్ళి శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగాలి. తల నుదుటి మీద మంచుముక్కలు ఉంచాలి లేదా చల్లని గోనె సంచిని దానిపై కప్పాలి. వెంటనే పశువైద్యుని సంప్రదించాలి. పశువైద్యుని పర్యవేక్షణలో గ్లూకోజ్ సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి. శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి తగిన చికిత్స చేయించాలి.

– డా. జి. మంజువాణి,
సంచాలకులు, పశువైద్య, పశు సంవర్థక శాఖ, హైదరాబాద్

# బోరు బావుల రీచార్జ్‌తో నీటి భద్రత!

**● 22న వాటర్ అండ్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్ వెబినార్**

గత వానాకాలంలో రుతుపవనాల వైఫల్యం వల్ల భూగర్భంలోకి వాన నీరు సరిగ్గా ఇంకకపోవటంతో తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో బోరు బావులు ఎండిపోతున్నాయి. కాలువ కమాండ్ ఏరియాల్లో సైతం పొలాల్లో, నివాస ప్రాంతాల్లో కూడా పలువురు ఇప్పటికే కొత్త బోరు బావులు తవ్వుతున్నా, చాలా వాటిల్లో ఆశించినంతగా నీరు లభించని పరిస్థితి. ఎండిపోయిన బోరు బావులు, కొద్దోగొప్పో నీరు పోస్తున్న బోరు బావుల చుట్టూ వాన నీటి ఇంకుడు గుంత (రిచార్జ్ పిట్)ను నిర్మించుకోవటం ద్వారా కృత్రిమంగా భూగర్భ జలాలను పెంపొందించుకోవటమే ఈ సమస్యకు ఓ చక్కని పరిష్కారం. వీటిని నిర్మాణం ద్వారా ఈ ఎండాకాలంలోనూ కురిసే అకాల వర్షాలకు వృథాగా పోయే నీటిని సమర్థవంతంగా బోర్ల దగ్గరే భూమిలోకి ఇంకింప జేసుకోవచ్చు.



అయితే, వాననీటిని ఇంకింపజేసే ఇంకుడు గుంత నిర్మాణానికి ఎండిపోయిన బోర్లన్నీ పనికిరావు. ‘ట్యాంకర్ టెస్ట్’ చేసి నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఈ అత్యాధునిక బోర్‌వెల్ రీచార్జ్ టెక్నిక్‌ను సికింద్రాబాద్‌లోని ‘వాటర్ అండ్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్ (డబ్ల్యూ.ఎల్.ఎఫ్.)’ గత 14 ఏళ్లుగా ప్రజలకు అందిస్తోంది. ఈ అంశంపై రైతులకు, స్వచ్ఛంద సంస్థలు, ఇంజనీర్లు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు డబ్ల్యూ.ఎల్.ఎఫ్. ఈ నెల 22న ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా.. తెలుగులో ఉచితంగా వెబినార్‌ను నిర్వహిస్తోంది. ఈ క్యూ.ఆర్.కోడ్ ద్వారా స్కాన్ చేసి గూగుల్ ఫామ్ ద్వారా పేర్లను ఈ నెల 18 లోగా రిజిస్టర్ చేసుకున్న వారికి వాట్సప్ ద్వారా వెబినార్ లింక్ పంపుతారు. ప్రవేశం ఉచితం. రూ.200 చెల్లించిన వారికి బోర్ల వద్ద వాన నీటి సంరక్షణపై ఆంగ్ల పుస్తకాన్ని పంపుతారు.

వివరాలకు..
**సీనియర్ జియాలజిస్ట్ రామ్‌మోహన్**
– 94401 94866, 040 27014467.
wlfoundation@outlook.com

# 16, 17న సేంద్రియ రైతులతో ముఖాముఖి

హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో గ్రామభారతి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో నాబార్డ్ తోడ్పాటుతో సేంద్రియ వ్యవసాయ, గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన ‘కిసాన్ ఎక్స్‌పో’ 2వ ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సామ ఎల్లారెడ్డి తెలిపారు. ఆరోగ్యదాయక సేద్యం చేస్తున్న గ్రామీణ సేంద్రియ/ ప్రకృతి వ్యవసాదారులను, వారి ఉత్పత్తులను ప్రత్యక్షంగా నగరవాసులకు పరిచయం చేయటం కోసం వినియోగదారుల కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించటం ఈ ఎక్స్‌పో ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ప్రకృతి సేద్య రంగ ప్రముఖులు డా. జీవీ రామాంజనేయులు, విజయరామ్, కొప్పుల నరసన్న తదితరులు అతిథులుగా పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. 97040 66622.

నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాగుబడి డెస్క్



## రెండో రౌండ్‌లో శరత్ కమల్

సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ ఆచంట శరత్ కమల్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 41 ఏళ్ల శరత్ కమల్ క్వాలిఫయింగ్ ద్వారా పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 87వ ర్యాంకర్ శరత్ కమల్ 11-5, 11-4, 11-6తో నికోలస్ బర్గోస్ (చిలీ)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్‌వన్ మనిక బత్రా 4-11, 7-11, 2-11తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ యిది వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయింది.

## సూర్య చరిష్మాకు కాంస్య పతకం



జర్మన్ ఓపెన్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి తామిరి సూర్య చరిష్మా కాంస్య పతకం గెలిచింది. బెర్లిన్‌లో జరిగిన ఈ టోర్నీలో అండర్-19 మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చరిష్మా 21-15, 20-22, 17-21తో కిమ్ మిన్ జీ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు చరిష్మా క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ సితి జులైఖా (మలేసియా)పై... రెండో రౌండ్‌లో13వ సీడ్ పిచిత్‌ప్రిచాసెక్ (థాయ్‌లాండ్)పై సంచలన విజయాలు సాధించింది.

## 'పారిస్' బెర్త్‌కు విజయం దూరంలో...

### క్వార్టర్ ఫైనల్లో నిశాంత్ దేవ్



బుస్టో అర్సిజియో (ఇటలీ): పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు భారత బాక్సర్ నిశాంత్ దేవ్ విజయం దూరంలో నిలిచాడు. ఒలింపిక్స్ వరల్డ్ క్వాలిఫయింగ్ తొలి టోర్నీలో 23 ఏళ్ల ఈ హరియాణా బాక్సర్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిశాంత్ 5-0తో క్రిస్టోస్ కరైటిస్ (గ్రీస్)పై గెలుపొందాడు. క్వార్టర్ ఫైనల్లో అమెరికా బాక్సర్ ఒమారి జోన్స్‌తో నిశాంత్ తలపడతాడు. ఈ బౌట్‌లో గెలిచి సెమీఫైనల్ చేరుకుంటే నిశాంత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారవుతుంది. ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ నుంచి తొమ్మిది మంది బాక్సర్లు బరిలోకి దిగగా ఎనిమిది మంది తొలి రౌండ్‌లోనే ఓడిపోవడం గమనార్హం. ఇప్పటి వరకు భారత్ నుంచి కేవలం మహిళల విభాగంలో మాత్రమే నిఖత్ జరీన్ (50 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), పర్వీన్ హుడా (57 కేజీలు), లవ్లీనా బొర్గోహైన్ (75 కేజీలు) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు.

## బోపన్న జోడీకి షాక్



కాలిఫోర్నియా: ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ జోడీ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (1/7), 6-4, 8-10తో సాండర్ జిలీ-జొరాన్ వ్లిజెన్ (బెల్జియం) జోడీ చేతిలో ఓడిపోయింది. గంటా 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట నాలుగు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి రౌండ్‌లో ఓడిన బోపన్న-ఎబ్డెన్ జంటకు 18,640 డాలర్ల (రూ. 15 లక్షల 42 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

# సూపర్ షబ్నమ్...

**11 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టిన వైజాగ్ అమ్మాయి** | **గుజరాత్ జెయింట్స్‌కు రెండో విజయం** | **దీప్తి శర్మ పోరాటం వృథా** | **యూపీ వారియర్స్‌కు తప్పని ఓటమి**


దీప్తి శర్మ

న్యూఢిల్లీ: వరుసగా మూడో మ్యాచ్‌లోనూ దీప్తి శర్మ (60 బంతుల్లో 88 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగినా... యూపీ వారియర్స్‌ను గెలిపించలేకపోయింది. ఫలితంగా మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ 'ప్లే ఆఫ్స్' అవకాశాలను దాదాపుగా చేజార్చుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 8 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. కెప్టెన్ బెత్ మూనీ (52 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీ సాధించగా, లౌరా వోల్‌వార్ట్ (30 బంతుల్లో 43; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది. యూపీ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 3, దీప్తి శర్మ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం వారియర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 144 పరుగులు చేసింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షబ్నమ్ షకీల్ (3/11) కీలక వికెట్లతో ఆరంభంలోనే యూపీని దెబ్బ తీసింది. దాంతో స్కోరు 35/5 వద్ద నిలిచింది. అయితే దీప్తి, పూనమ్ ఖేమ్నర్ (36 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడి జట్టును విజయానికి చేరువగా తెచ్చారు. వీరిద్దరు 78 బంతుల్లో అభేద్యంగా 109 పరుగులు జోడించారు. చివరి ఓవర్లో 26 పరుగులు అవసరం కాగా, దీప్తి 2 సిక్సర్లతో సహా మొత్తం 17 పరుగులే వచ్చాయి. పట్టికలో మూడో స్థానం కోసం ఇంకా పోటీ మిగిలే ఉంది. యూపీ, బెంగళూరుకు చెరో 6 పాయింట్లు ఉండగా, యూపీ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. నేడు ముంబై ఇండియన్స్‌తో జరిగే మ్యాచ్‌లో బెంగళూరు గెలిస్తే ప్లే ఆఫ్‌కు అర్హత పొందుతుంది. ఒకవేళ భారీ తేడాతో ఓడిపోకున్నా బెంగళూరుకే ప్లే ఆఫ్స్ అవకాశం ఉంది. ఇక 4 పాయింట్లున్న గుజరాత్ చివరి మ్యాచ్‌లో గెలవడంతో పాటు భారీ రన్‌రేట్ సాధించాలి.

**డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే. |
|---|---|---|---|---|---|
| ఢిల్లీ | 7 | 5 | 2 | 10 | 0.918 |
| ముంబై | 7 | 5 | 2 | 10 | 0.343 |
| బెంగళూరు | 7 | 3 | 4 | 6 | 0.027 |
| యూపీ | 8 | 3 | 5 | 6 | −0.371 |
| గుజరాత్ | 7 | 2 | 5 | 4 | −0.873 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్




యూపీ వారియర్స్‌తో మ్యాచ్‌లో బౌలింగ్‌లో సత్తా చాటిన షబ్నమ్ స్వస్థలం విశాఖపట్నం. 16 ఏళ్ల షబ్నమ్ డబ్ల్యూపీఎల్ బరిలోకి దిగిన పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది. వేలంలో ఆమెను గుజరాత్ టీమ్ రూ. 10 లక్షలకు తీసుకుంది. తన తొలి మ్యాచ్‌లో వికెట్ దక్కకపోయినా చక్కటి బంతులతో ఆమె ఆకట్టుకుంది. ముంబైతో జరిగిన గత మ్యాచ్‌లో ఇంగ్లండ్ స్టార్ నాట్ సివర్ బ్రంట్‌ను తొలి వికెట్‌గా అవుట్ చేసిన షబ్నమ్... ఈసారి మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చింది. గత ఏడాదే అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో షబ్నమ్ సభ్యురాలిగా ఉంది.

# సాత్విక్-చిరాగ్ జోడీపైనే ఆశలు!

### నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్‌కు చివరిసారి 2001లో టైటిల్ లభించింది. ఆనాడు పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ పుల్లెల గోపీచంద్ విజేతగా నిలిచాడు. ఆ తర్వాత 2015లో మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్... 2022లో పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ ఫైనల్ చేరి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నారు. అయితే ఈసారి పురుషుల డబుల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిలపై భారత బృందం భారీ ఆశలు పెట్టుకుంది. ఈ సీజన్‌లో వీరిద్దరు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. ఆడిన మూడు టోర్నీల్లోనూ (మలేసియా మాస్టర్స్, ఇండియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్) ఫైనల్ చేరారు. రెండింటిలో రన్నరప్‌గా నిలిచారు. ఆదివారం ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ కూడా దక్కించుకున్నారు. అంతా సవ్యంగా సాగితే... నేడు మొదలయ్యే ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో భారత బృందం 23 ఏళ్ల టైటిల్ నిరీక్షణకు తెరదించే అవకాశాలున్నాయి. కానీ ఈసారి అన్ని విభాగాల్లోనూ భారత క్రీడాకారులకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. తొలి రౌండ్ దాటాక ప్రతి మ్యాచ్‌లో మేటి ప్రత్యర్థులు సిద్ధంగా ఉండనున్నారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మాజీ చాంపియన్ మొహమ్మద్ అహ్సాన్-హెండ్రా సెతియవాన్ (ఇండోనేసియా)లతో సాత్విక్-చిరాగ్ తలపడతారు. సాత్విక్ ద్వయం ఈ అడ్డంకి దాటితే ప్రిక్వార్టర్ ఫైనల్లో షోహిబుల్ ఫిక్రి-మౌలానా బగస్ (ఇండోనేసియా) జోడీ.. క్వార్టర్ ఫైనల్లో ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా) జంట ఎదురయ్యే చాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో సాత్విక్-చిరాగ్ జోడీ ప్రతి మ్యాచ్‌లో విశేషంగా రాణించాల్సి ఉంటుంది. ఇక పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో కిడాంబి శ్రీకాంత్; సు లి యాంగ్ (చైనీస్ తైపీ)తో ప్రణయ్; ఎన్జీ జె యోంగ్ (మలేసియా)తో లక్ష్య సేన్; వర్దాయో (ఇండోనేసియా)తో ప్రియాన్షు తలపడతారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వ్యాన్ లి (బెల్జియం)తో పీవీ సింధు ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో సింధు గెలిస్తే ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆమె ప్రత్యర్థిగా ప్రపంచ చాంపియన్, వరల్డ్ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో ఉండనుంది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ; అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీలు బరిలో ఉన్నాయి.

# ఆసీస్ అద్భుతం

- రెండో టెస్టులో 3 వికెట్లతో విజయం
- గెలిపించిన క్యారీ, మార్ష్, కమిన్స్


కమిన్స్, క్యారీ

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ పర్యటనలో రెండు టెస్టుల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అలెక్స్ క్యారీ (98 నాటౌట్; 15 ఫోర్లు), మిచెల్ మార్ష్ (80; 10 ఫోర్లు, 1 సిక్స్) అసాధారణ పోరాటంతో రెండో టెస్టులో ఆసీస్ 3 వికెట్ల తేడాతో కివీస్‌పై గెలిచింది. 279 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు 77/4 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్ 80 పరుగులకే ఐదో వికెట్ కోల్పోయింది. దీంతో ఆసీస్‌కు పరాజయం ఖాయమనిపించింది. కానీ మార్ష్, క్యారీ ఆరో వికెట్‌కు 140 పరుగులు జోడించడంతో మ్యాచ్ ఫలితమే మారిపోయింది. 220 స్కోరు వద్ద మార్ష్ నిష్క్రమించినా, స్టార్క్ (0) డకౌటైనా... కెప్టెన్ కమిన్స్ (32 నాటౌట్; 4 ఫోర్లు), క్యారీ అబేధ్యమైన ఎనిమిదో వికెట్‌కు 61 పరుగులు జోడించి ఆసీస్‌ను గెలిపించారు. 2005 నుంచి కివీస్ గడ్డపై ఆస్ట్రేలియా వరుసగా ఏడు టెస్టుల్లో గెలిచింది. టెస్టు క్రికెట్ చరిత్రలో సంయుక్తంగా ఇది రెండో అత్యుత్తమ వరుస విజయాల ఘనత. సఫారీ గడ్డపై ఇంగ్లండ్ (1889 నుంచి 1999 వరకు) 8 వరుస టెస్టుల్లో గెలిచింది. జింబాబ్వేపై కివీస్ (2000 నుంచి ఇప్పటివరకు) వరుసగా 7 టెస్టులు గెలిచింది.

# ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి వినేశ్



పాటియాలా: వచ్చే నెలలో కిర్గిస్తాన్‌లో జరిగే పారిస్ ఒలింపిక్స్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ బరిలోకి దిగనుంది. ఈ టోర్నీలో పాల్గొనే భారత మహిళల జట్టును ఎంపిక చేసేందుకు సోమవారం నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో వినేశ్ 50 కేజీల విభాగంలో విజేతగా నిలిచింది. వినేశ్ రెగ్యులర్ వెయిట్ కేటగిరీ 53 కేజీలు కాగా... ఇప్పటికే ఈ కేటగిరీలో అంతిమ్ పంఘాల్ ఒలింపిక్ బెర్త్ దక్కించుకుంది. దాంతో వినేశ్ సెలెక్షన్ ట్రయల్స్ టోర్నీలో 50 కేజీలతోపాటు 53 కేజీల విభాగంలోనూ పోటీపడింది. ఒక రెజ్లర్ ఒకే రోజు ఒకే వెయిట్ కేటగిరీలో పోటీపడాలన్న నిబంధన ఉన్నా అడ్‌హక్ కమిటీ వినేశ్‌ను రెండు కేటగిరీల్లో పోటీ పడేందుకు అనుమతి ఇవ్వడం వివాదాస్పదమైంది. అయితే వినేశ్ 53 కేజీల విభాగం సెమీ ఫైనల్లో ఓడిపోయింది. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే భారత జట్టులో అన్షు మలిక్ (57 కేజీలు), మాన్సి అహ్లావత్ (62 కేజీలు), నిషా దహియా (68 కేజీలు), రితిక (76 కేజీలు) కూడా ఎంపికయ్యారు.

# పటిష్ట స్థితిలో ముంబై

ముంబై: విదర్భ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో ముంబై జట్టు శాసించే స్థితికి చేరుకుంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై ఓవరాల్ ఆధిక్యం 260 పరుగులకు చేరుకుంది. 119 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన ముంబై ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 141 పరుగులు సాధించింది. కెప్టెన్ అజింక్య రహానే (58 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్), ముషీర్ ఖాన్ (51 బ్యాటింగ్; 3 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీలు చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 31/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 45.3 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. ముంబై బౌలర్లు ధవల్ కులకర్ణి (3/15), షమ్స్ ములానీ (3/32), తనుష్ కొటియన్ (3/7) విదర్భ జట్టును దెబ్బ తీశారు.

**సినిమా**

అణు బాంబు సౌండ్ అదిరింది.. క్రిస్టోఫర్ కల నిజమైంది... 'ఆర్ఆర్ఆర్' నాటు నాటు ఆకర్షణగా నిలిచింది. ఫేక్ చప్పట్లతో మెస్సీ (శునకం), ఆమిర్ ఖాన్ 'పీకే' తరహాలో జాన్ ప్రత్యక్షం కావడం చర్చలకు దారి తీసింది. ఇలా ఆనందాలు, వింతలు, విడ్డూరాలతో ఆస్కార్ అవార్డు వేడుక జరిగింది. ఆ విశేషాలు తెలుసుకుందాం.

# ఆస్కార్ వేదికపై అణు బాంబు మోత

- ఏడు అవార్డులతో అటామిక్ సైంటిఫిక్ థ్రిల్లర్ 'ఆపెన్‌హైమర్' హవా
- ఒక్క అవార్డుకే పరిమితమైన 'బార్బీ'


రాబర్ట్ జూనియర్, డేవైన్ జో రాండాల్ఫ్, ఎమ్మా స్టోన్, సిలియన్ మర్ఫీ

ప్రముఖ భౌతిక శాస్త్ర నిపుణుడు, అణుబాంబు సృష్టికర్తగా పేరుగాంచిన జె. రాబర్ట్ ఆపెన్‌హైమర్ జీవితంతో రూపొందిన బయోగ్రాఫికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'ఆపెన్‌హైమర్' మోత ఆస్కార్ వేదికపై బాగా వినిపించింది. దర్శకుడిగా క్రిస్టోఫర్ నోలన్‌తో ఆస్కార్ అవార్డును ముద్దాడేలా చేసింది. మార్చి 10న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్లో జరిగిన 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో 'ఆపెన్‌హైమర్' చిత్రం ఏడు విభాగాల్లో అవార్డులు కొల్లగొట్టి విజయఢంకా మోగించింది. మొత్తం పదమూడు నామినేషన్లు దక్కించుకున్న ఈ చిత్రానికి ఉత్తమ చిత్రంతో పాటు దర్శకుడు, నటుడు, సహాయనటుడు, ఫిల్మ్ ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో అవార్డు దక్కింది. అలాగే పదకొండు నామినేషన్లు దక్కించుకున్న 'పూర్ థింగ్స్' సినిమాకు నాలుగు విభాగాల్లో, హిస్టారికల్ డ్రామా 'జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' సినిమాకు రెండు విభాగాల్లో అవార్డులు దక్కాయి. 'ఆపెన్‌హైమర్'కు పోటీగా నిలుస్తుందనుకున్న 'బార్బీ' సినిమాకు 8 నామినేషన్లు దక్కినా, ఒక్క అవార్డు (బెస్ట్ ఒరిజినల్ సాంగ్)తో సరిపెట్టుకుంది, పది నామినేషన్లు దక్కించుకున్న 'కిల్లర్ ఆఫ్ ద ఫ్లవర్ మూన్' సినిమాకి ఒక్క అవార్డు కూడా దక్కకపోవడం చర్చనీయాంశమైంది. ఈ ఏడాది ఉత్తమ నటుడిగా నిలిచిన సిలియన్ మర్ఫీ, ఉత్తమ సహాయ నటుడు రాబర్ట్ డౌనీ జూనియర్, ఉత్తమ సహాయ నటి రాండాల్ఫ్ తొలిసారి ఆస్కార్‌ని ముద్దాడారు. గతంలో 'లా లా ల్యాండ్'కి ఉత్తమ నటిగా ఆస్కార్ అందుకున్న ఎమ్మా స్టోన్ ఇప్పుడు ఇదే విభాగానికి అవార్డుని అందుకున్నారు. భారత సంతతికి చెందిన నిషా తెరకెక్కించిన 'టు కిల్ ఎ టైగర్' డాక్యుమెంటరీ ఆస్కార్ సాధించలేకపోయింది. ఇక అవార్డు విజేతల జాబితా ఈ విధంగా...

## నోలన్ కల నెరవేరెగా...



ఫిల్మ్ మేకర్ క్రిస్టోఫర్ నోలన్ ఆస్కార్ చరిత్ర కాస్త ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ఎందుకంటే నోలన్ తీసిన సినిమాలు ఆస్కార్ అవార్డుల కోసం 49 నామినేషన్లు దక్కించుకుని, 18 అవార్డులను సాధించాయి. కానీ క్రిస్టోఫర్ నోలన్‌కు మాత్రం 95వ ఆస్కార్ అవార్డుల వరకూ ఒక్కటంటే ఒక్క అవార్డు కూడా రాలేదు. తొలిసారి 2002లో 'మెమెంటో' సినిమాకుగాను బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ ప్లే విభాగంలో 74వ ఆస్కార్ అవార్డ్స్‌లో నామినేషన్ దక్కించుకున్నారు నోలన్... నిరాశే ఎదురైంది. ఆ తర్వాత 83వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'ఇన్సెప్షన్' సినిమాకు బెస్ట్ పిక్చర్, బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ ప్లే విభాగాల్లో నామినేషన్లు దక్కినా అవార్డులు రాలేదు. 90వ ఆస్కార్ అవార్డ్స్‌లో బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ పిక్చర్ విభాగాల్లో నోలన్ 'డంకిర్క్' సినిమాకు నామినేషన్లు దక్కినా ఆస్కార్ అవార్డు దక్కలేదు. చివరికి నోలన్ కల 'ఆపెన్‌హైమర్'తో నెరవేరింది.

**ఈ ప్రయాణంలో నేనూ భాగం అని...**
**- క్రిస్టోఫర్ నోలన్**

ఆస్కార్ వేదికపై క్రిస్టోఫర్ నోలన్ మాట్లాడుతూ – ''మా సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన మర్ఫీ, ఎమిలీ బ్లంట్, మాట్‌లతో పాటు యూనిట్ అందరికీ ధన్యవాదాలు. ఇక మా కుటుంబాన్ని, ఈ సినిమాను నిర్మించిన మా నిర్మాత ఎమ్మా థామస్‌తో (భార్య ఎమ్మా పేరును ప్రస్తావించగానే ఒక్కసారిగా నవ్వులు) పాటు నా సోదరుడికి థ్యాంక్స్ చెప్పాలి. మా సినిమాలో సత్తా ఉందని నమ్మి, డిస్ట్రిబ్యూట్ చేసిన యూనివర్సల్ స్టూడియోస్‌కు ధన్యవాదాలు. సినిమా చరిత్ర వందేళ్లకు చేరువ అవుతోంది. ఈ అద్భుతమైన ప్రయాణం ఎక్కడికి వెళ్తుందో మనకు తెలియదు. కానీ ఈ ప్రయాణం తాలూకు సినిమాల్లో నేను కూడా ఓ అర్థవంతమైన భాగం అని భావించి, నన్ను గుర్తించిన ఆస్కార్ కమిటీకి ధన్యవాదాలు'' అన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.... భార్యాభర్త నోలన్, ఎమ్మా దర్శక-నిర్మాతలుగా ఒకేసారి ఆస్కార్ అవార్డులు సాధించారు.

అణుబాంబు విస్ఫోటనం నేపథ్యంలోని 'ఆపెన్‌హైమర్'లో నటించి, అవార్డు దక్కించుకున్న **మర్ఫీ** తన అవార్డును ప్రపంచ శాంతి ఆకాంక్షించేవారికి అంకితమిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

జీవితంలో తనకు ఎంతో అండగా నిలిచిన తన భార్య సుసాన్ డౌన్‌కి అవార్డుని అంకితం ఇస్తున్నట్లుగా ఉత్తమ సహాయ నటుడు **రాబర్ట్ డౌనీ** తెలిపారు.

''నేను నా జీవితంలో మరోలా (స్లిమ్‌గా) ఉండాలనుకున్నాను. కానీ ఇప్పుడు నాకు తెలిసింది ఏంటంటే... నేను నాలానే ఉండాలి'' అంటూ ఎమోషనల్ అయ్యారు **రాండాల్ఫ్**

**విజేతల వివరాలు:** ● ఉత్తమ చిత్రం: (ఆపెన్‌హైమర్) ● దర్శకుడు : **క్రిస్టోఫర్ నోలన్** (ఆపెన్‌హైమర్) ● నటుడు: **సిలియన్ మర్ఫీ** (ఆపెన్‌హైమర్) ● నటి: **ఎమ్మా స్టోన్** (పూర్ థింగ్స్) ● సహాయ నటుడు: **రాబర్ట్ డౌనీ జూనియర్** (ఆపెన్‌హైమర్) ● సహాయ నటి: **డేవైన్ జో రాండాల్ఫ్** (ది హోల్డోవర్స్) ● సినిమాటోగ్రఫీ: **ఆపెన్‌హైమర్** ● డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్: **20 డేస్ ఇన్ మరియోపోల్** ● హెయిర్ స్టయిల్ అండ్ మేకప్: **నడియా స్టేసీ, మార్క్ కౌలియర్** (పూర్ థింగ్స్) ● అడాప్టెడ్ స్క్రీన్ ప్లే: **కార్డ్ జెఫర్‌సన్** (అమెరికన్ ఫిక్షన్) ● ఒరిజినల్ స్క్రీన్ ప్లే: **జస్టిన్ ట్రైట్, అర్థర్ హరారీ** (అనాటమీ ఆఫ్ ఎ ఫాల్) ● యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్: **ది బాయ్ అండ్ ది హెరాన్** ● కాస్ట్యూమ్ డిజైన్: **హోలి వెడ్డింగ్‌టన్** (పూర్ థింగ్స్) ● ప్రొడక్షన్ డిజైన్: **జేమ్స్ ప్రైస్, షోనా హెత్** (పూర్ థింగ్స్) ● ఇంటర్నేషనల్ ఫిల్మ్: **ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్** ● ఎడిటింగ్: **జెన్నిఫర్ లేమ్** (ఆపెన్‌హైమర్) ● విజువల్ ఎఫెక్ట్స్: **గాడ్జిల్లా మైనస్ వన్** ● డాక్యుమెంటరీ (షార్ట్ సబ్జెక్ట్): **ది లాస్ట్ రిపేర్ షాప్** ● ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: **ఆపెన్‌హైమర్** ● సౌండ్: **ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్** ● ఒరిజినల్ సాంగ్: **వాట్ వాజ్ ఐ మేడ్ ఫర్ (బార్బీ)** ● లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్: **ది వండర్‌ఫుల్ స్టోరీ ఆఫ్ హెన్రీ షుగర్.**

## నేనీ సినిమా చేసి ఉండాల్సింది కాదు - ఎమ్ చెర్నోవ్



ఉక్రెయిన్ వార్ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందిన డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ '20 డేస్ ఇన్ మరియోపోల్' చిత్రం ఆస్కార్ అవార్డును సాధించింది. ఈ అవార్డు యాక్సెప్టెన్సీ స్పీచ్‌లో చిత్రదర్శకుడు ఎమ్ చెర్నోవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఉక్రెయిన్ చరిత్రలో ఇది తొలి ఆస్కార్ అవార్డు. ఇందుకు గౌరవంగా భావిస్తున్నాను. అయితే ఈ సినిమాను నేను చేసి ఉండకూడదని అనుకుంటున్నాను. బహుశా ఈ వేదికపై ఇలా మాట్లాడుతున్న తొలి దర్శకుడిని నేనేమో. మా ఉక్రెయిన్‌పై దాడులు చేయకుండా, మా నగరాలను ఆక్రమించకుండా ఉండేందుకు బదులుగా రష్యావారికి ఈ అవార్డు ఇస్తాను. నేను చరిత్రను, గతాన్ని మార్చలేను. కానీ కొందరు ప్రతిభావంతులతో కలిసి ఓ కొత్త రికార్డును సృష్టించగలం. అప్పుడు నిజం గెలుస్తుంది. జీవితాలను త్యాగం చేసిన మరియోపోల్ ప్రజలు గుర్తుండిపోతారు. సినిమా జ్ఞాపకాలను ఏర్పరుస్తుంది. జ్ఞాపకాలు చరిత్రను నెలకొల్పుతాయి" అంటూ భావోద్వేగంతో మాట్లాడారు చెర్నోవ్.

## స్వీట్ సర్‌ప్రైజ్



'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో చిత్ర సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్ అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. 96వ అవార్డ్స్‌లో 'ఆర్ఆర్ఆర్' విజువల్స్ కనిపించాయి. వరల్డ్ గ్రేటెస్ట్ స్టంట్ సీక్వెన్స్ అంటూ ఆస్కార్ వేదికపై ప్రదర్శించిన విజువల్స్‌లో 'ఆర్ఆర్ఆర్'లోని క్లైమాక్స్ ఫైట్ సీక్వెన్స్‌లు రెండుసార్లు కనిపించాయి. 'టైటానిక్', 'మిషన్ ఇంపాజిబుల్', 'చార్లీ చాప్లిన్', 'బస్టర్ కీటన్' వంటి హాలీవుడ్ క్లాసిక్ చిత్రాల యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు 'ఆర్ఆర్ఆర్'లోని యాక్షన్ విజువల్స్ ప్లే కావడం విశేషం. అలాగే ఈ ఏడాది బెస్ట్ ఒరిజినల్ సాంగ్ 'వాట్ వాజ్ ఐ మేడ్ ఫర్?'ను విజేతగా ప్రకటించే ముందు ప్లే చేసిన కొన్ని సాంగ్స్ విజువల్స్‌లో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాట కనిపించింది. ఈ సందర్భంగా.. ''వరల్డ్ స్టంట్ సీక్వెన్స్‌లకు నివాళిగా ప్లే చేసిన కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లలో 'ఆర్ఆర్ఆర్' స్టంట్ సీక్వెన్స్‌లు ఉండటం స్వీట్ సర్‌ప్రైజ్‌లా ఉంది'' అని 'ఆర్ఆర్ఆర్' టీమ్ స్పందించింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య 'ఆర్ఆర్ఆర్'ను నిర్మించారు.

## నా కళ్లు చెబుతున్నాయి... - అల్ పచినో



మామూలుగా విజేతలను ప్రకటించే ముందు పోటీలో ఉన్న వారి పేర్లు చెప్పి, చివరిగా విజేత పేరు చెప్పడం జరుగుతుంది. అయితే ప్రముఖ నటుడు 83 ఏళ్ల అల్ పచినో ఈ విధానాన్ని అనుసరించలేదు. ఈ 'గాడ్ ఫాదర్' మూవీ ఫేమ్ ఉత్తమ చిత్రాన్ని ప్రకటించడానికి వేదికపైకి వచ్చారు. ఈ విభాగంలో పది చిత్రాలు పోటీ పడ్డాయి. ఈ చిత్రాల పేర్లు చెప్పకుండా.. 'ఇదిగో..' అంటూ మెల్లిగా ఎన్వలప్ కవర్‌ని ఓపెన్ చేస్తూ.. నా కళ్లు చెబుతున్నాయి టైప్‌లో నా కళ్లకు 'ఆపెన్‌హైమర్' కనబడుతోంది అనగానే వీక్షకుల నుంచి కరతాళ ధ్వనులు వినిపించాయి. అయితే అల్ పచినో ఈ విధంగా ప్రకటించడంతో.. అవార్డు ఈ సినిమాకే వచ్చిందా? అనే సందేహంలో కొందరు ఉండిపోయారు. అంతలోనే 'అవును.. అవును..' అన్నారు. అయితే అల్ పచినో ఇలా ప్రకటించడం పట్ల పలువురు విమర్శించారు. ఆస్కార్ అవార్డుల జాబితాలో ప్రధానమైన విభాగంలో పోటీ పడిన చిత్రాల పేర్లు చెప్పకుండా, పైగా వేడుకలో చివరి అవార్డు కాబట్టి కాస్తయినా సస్పెన్స్ మెయిన్‌టైన్ చేయకుండా చెప్పడం బాగాలేదని అంటున్నారు. ఇలా సాదా సీదా ప్రకటనతో ఆస్కార్ అవార్డు వేడుక ముగిసింది.

## ఆమిర్ 'పీకే'ని తలపించేలా జాన్ సెనా



ఆస్కార్ అవార్డు వేడుకలో జరిగిన ఓ ఘటన ఆమిర్ ఖాన్ నటించిన 'పీకే' సినిమాని గుర్తు చేసింది. ఈ చిత్రంలో ఆమిర్ ఓ సీన్లో తన శరీరానికి ముందు భాగంలో ఓ రేడియో అడ్డుపెట్టుకుని అర్ధనగ్నంగా నటించారు. ఆస్కార్ వేదికపై ఇలాంటి సీనే రిపీట్ అయింది. స్టార్ రెజ్లర్ (డబ్ల్యూడబ్ల్యూఈ) జాన్ సెనా అర్ధనగ్నంగా ప్రత్యక్షమై షాక్ ఇచ్చారు. బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డును ప్రకటించేందుకు జాన్ సెనా ఇలా అర్ధనగ్నంగా రావడం చర్చనీయాంశంగా మారింది. తన శరీరానికి ముందు భాగంలో విజేత వివరాలు ఉండే ఎన్వలప్ కవర్‌ను మాత్రమే అడ్డుపెట్టుకొని వేదికపైకి రావడంతో సభికులందరూ తెగ నవ్వుకున్నారు. అయితే తాను ఇలా రావడానికి కారణం ఉందన్నారు జాన్ సెనా. 'పురుషుడి శరీరం కూడా జోక్ కాదని, అలానే కాస్ట్యూమ్స్ అనేవి ముఖ్యం అని తెలియజెప్పేందుకే ఇలా వచ్చా' అన్నారు సెనా. అనంతరం 'పూర్ థింగ్స్' సినిమాకి ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ విభాగంలో అవార్డును ప్రకటించారు.

**1974 సీన్ రిపీట్**

దాదాపు 50 ఏళ్ల క్రితం (1974) జరిగిన ఆస్కార్ వేడుకల్లో నటి ఎలిజబెత్ టేలర్‌ను పరిచయం చేస్తుండగా ఓ వ్యక్తి నగ్నంగా వేదికపైకి దూసుకు రావడం అప్పట్లో సంచలనమైంది. తాజాగా జాన్ సెనా ప్రవర్తనతో నాటి ఘటనను కొందరు గుర్తుకు తెచ్చుకున్నారు.

## ఫేక్ క్లాప్‌తో శునకానందం



ఆస్కార్ వేడుకలో ఈ ఏడాది ఓ శునకం అందరి దృష్టినీ ఆకర్షించింది. సభికులతో పాటు క్లాప్స్ కొట్టిన ఈ శునకం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఆస్కార్ కోసం పలు విభాగాల్లో పోటీ పడిన సినిమాల్లో 'అనాటమీ ఆఫ్ ఎ ఫాల్' ఒకటి. బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగంలో ఈ చిత్రం అవార్డును సొంతం చేసుకుంది. ఈ సినిమాలో నటించిన మెస్సీ (శునకం)ని అవార్డు వేడుకకు తీసుకొచ్చింది యూనిట్. 'ఆపెన్ హైమర్'కి రాబర్ట్ డౌనీ జూనియర్ ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు అందుకుంటున్నప్పుడు అందరితో పాటు మెస్సీ చప్పట్లు కొట్టడం ఆకర్షణగా నిలిచింది. అయితే ఆ శునకం కూర్చున్న కుర్చీ కింద ఓ వ్యక్తి ఉండి, ఫేక్ చేతులతో క్లాప్ కొట్టాడు. అవి శునకం కాలిని పోలి ఉండటంతో మెస్సీయే చప్పట్లు కొట్టిందని భావించారంతా.

సాక్షి బిజినెస్
మంగళవారం
12-3-2024

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▽ 617 | 73,503 |
| నిఫ్టీ ▽ 161 | 22,233 |

| విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 16,050 | ▽ | 36 |
| డోజోన్స్ | 38,713 | ▽ | 10 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,669 | △ | 9 |
| డాక్స్ | 17,746 | ▽ | 68 |
| షాంఘై | 3,138 | △ | 22 |
| నికాయ్ | 38,820 | ▽ | 868 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 65,646 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 65,383 |
| వెండి (కిలో) | 72,547 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 80.93 | 84.61 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 104.94 | 108.82 |
| € | యూరో | | 88.36 | 92.82 |
| ¥ | జపాన్ ఎన్ (100) | | 44.00 | 69.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | | 52.37 | 57.20 |
| S$ | సింగపూర్ డాలర్ | | 59.91 | 64.60 |
| SAR | సౌదీ రియాల్ | | 21.16 | 22.74 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 21.63 | 23.43 |
| ¥ | చైనా యువాన్ | | 10.40 | 12.47 |

# చిన్న షేర్లలో అవకతవకలు

## సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి వెల్లడి

ముంబై: చిన్న, మధ్యతరహా స్టాక్స్‌లో అవకతవకలు జరుగుతున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి పేర్కొన్నారు. కొంతమంది అసహజ లావాదేవీలకు తెరతీసినట్లు గుర్తించామని తెలియజేశారు. చిన్న, మధ్యతరహా సంస్థల(ఎస్ఎంఈలు) విభాగంలో కృత్రిమంగా ధరల పెంపును చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎస్ఎంఈ విభాగం ఐపీవోలతోపాటు.. సెకండరీ మార్కెట్లోనూ అక్రమ లావాదేవీలు జరుగుతున్నట్లు అభిప్రాయపడ్డారు. వెరసి రిస్కులు అధికంగాగల విభాగంలో ఇన్వెస్టర్లు మరింత జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉన్నట్లు సూచించారు. ఇక్కడ నిర్వహించిన ఒక సదస్సు సందర్భంగా మహిళా పాత్రికేయులతో ముచ్చటించిన పురి పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధాన విభాగంతో పోలిస్తే ఎస్ఎంఈ విభాగం ప్రత్యేకమైనదని ఇన్వెస్టర్లు అర్థం చేసుకోవలసి ఉన్నట్లు పురి పేర్కొన్నారు. ప్రధాన విభాగంలోని కంపెనీలు తప్పనిసరిగా సమాచారాన్ని వెల్లడించవలసి ఉంటుందని, అయితే ఎస్ఎంఈ విభాగం రిస్కులు విభిన్నంగా ఉంటాయని ఇన్వెస్టర్లను హెచ్చరించారు.

**28 నుంచి ఆప్షనల్ పద్ధతిలో టీ+0 సెటిల్‌మెంట్**

సెక్యూరిటీల టీ+0 సెటిల్‌మెంట్‌ను మార్చి 28 నుంచి ఆప్షనల్ పద్ధతిలో ప్రవేశపెట్టనున్నట్లు పురి తెలియజేశారు. గత కొద్ది నెలల్లో భారీగా దూసుకెళుతున్న స్మాల్, మిడ్ క్యాప్ విభాగం షేర్ల విలువలపై స్పందిస్తూ కొన్ని కౌంటర్లలో అసహజ లావాదేవీలు నమోదవుతున్న సంకేతాలున్నట్లు వెల్లడించారు. ధరలను మ్యానిప్యులేట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి బుడగలవంటివని వ్యాఖ్యానించారు. ఇలాంటి బుడగలు తలెత్తేందుకు అనుమతించకూడదని, ఇవి పగలిపోతే ఇన్వెస్టర్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని స్పష్టం చేశారు. ఇది మార్కెట్లకు మంచిదికాదని అభిప్రాయపడ్డారు.

**స్టాక్ బ్రోకర్లకు కఠిన నిబంధనలు**

కాగా, అర్హతగల స్టాక్ బ్రోకర్(క్యూఎస్‌బీ)గా గుర్తించే మార్గదర్శకాలను సెబీ తాజాగా విస్తృతం చేసింది. తద్వారా మరింతమంది బ్రోకర్లను నిబంధనల పరిధిలోకి తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సెక్యూరిటీల మార్కెట్లో ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంపొందించే దిశగా తాజా చర్యలకు తెరతీసింది. యాజమాన్య సంబంధ లావాదేవీల పరిమాణం, నిబంధనలు, సమస్యల పరిష్కారం తదితర అంశాలను స్టాక్ బ్రోకర్లను క్యూఎస్‌బీలుగా గుర్తించడంలో పరిగణనలోకి తీసుకోనున్నట్లు ఒక సర్క్యులర్‌లో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ పేర్కొంది.



## పీఎఫ్‌సీ మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. పది రూపాయలు విలువ గల ఒక్కో షేరుకు రూ.3 చొప్పున మూడో మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకు రికార్డు తేదీని మార్చి 22గా నిర్ణయించింది. ఏప్రిల్ 10 లోగా డివిడెండ్ చెల్లించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఇప్పటి వరకు మొత్తం రూ.11ల మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

## పిట్టి చేతికి బగాడియా చైత్ర ఇండస్ట్రీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పిట్టి ఇంజనీరింగ్ తాజాగా బగాడియా చైత్ర ఇండస్ట్రీస్‌లో 100 శాతం వాటాలను చేజిక్కించుకుంది. డీల్ విలువ రూ.125 కోట్లు. కర్ణాటక కేంద్రంగా ఉన్న బగాడియా చైత్ర ఇండస్ట్రీస్‌కు గృహోపకరణాలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ తదితర రంగాల్లో అనుభవం ఉంది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 12-3-2024 | |
|---|---|
| విశాఖ | 450-00 |
| చిత్తూరు | 483-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 433-00 |
| విజయవాడ | 433-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **11-3-2024 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 410-00 |
| వరంగల్ | 412-00 |
| రిటైల్ ధర | 4.70 |

# రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ

- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు అమ్మకాలు



ముంబై: జీవితకాల గరిష్ట స్థాయిల వద్ద బ్యాంకింగ్, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు సోమవారం దాదాపు ఒకశాతం నష్టపోయాయి. అమెరికా, భారత్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడి(మంగళవారం) ముందు ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 685 పాయింట్లు పెరిగి 74,187 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు బలపడి 22,527 వద్ద ఆల్‌టైం హై స్థాయిలు అందుకున్నాయి. రికార్డు స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు దిగడంతో సూచీలు క్రమంగా ఆరంభ లాభాలు కోల్పోయాయి. సెన్సెక్స్ 617 పాయింట్లు పతనమైన 73,503 వద్ద నిలిచింది. నిఫ్టీ 161 పాయింట్ల నష్టంతో 22,333 వద్ద స్థిరపడింది. కాగా, బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 2% క్షీణించింది.

ఎస్‌బీఐ షేరు 2% నష్టపోయి రూ.773 వద్ద ముగిసింది. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఈసీకి వెల్లడించడంపై గడువును మరింత పొడిగించాలని కోరుతూ ఎస్‌బీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం షేరుపై ప్రతికూల ప్రభావం చూపింది.

- ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యంలో జేఎం ఫైనాన్షియల్ షేరు మరో పదిశాతం నష్టపోయి రూ.79 వద్ద ముగిసింది.
- రిటైల్ ఇన్వెస్టర్ల 'ఆఫర్ ఫర్ సేల్' ప్రక్రియ ప్రారంభంతో ఎస్ఎల్‌సీ ఇండియా షేరు 7% నష్టంతో రూ.233 వద్ద స్థిరపడింది.
- రూ.2,100 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకోవడంతో ఆర్‌వీఎన్ఎల్ షేరు 3% లాభంతో రూ.245 వద్ద నిలిచింది.
- ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఔషధ ఉత్పత్తిని, సదుపాయాలను మెరుగుపరచుకోడానికి ఆర్థిక సహాయం అందించే- ఫార్మాస్యూటికల్స్ టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ అసిస్టెన్స్ స్కీమ్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఈ కంపెనీల షేర్లు లాభాలను ఆర్జించాయి.

## లాజిస్టిక్స్ విభాగంలోకి మ్యాజిక్‌పిన్

న్యూఢిల్లీ: హైపర్‌లోకల్ ఈ-కామర్స్ స్టార్టప్ సంస్థ మ్యాజిక్‌పిన్ తాజాగా లాజిస్టిక్స్ అగ్రిగేషన్ విభాగంలోకి ప్రవేశించింది. వెలాసిటీ పేరిట ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసింది. షాడోఫ్యాక్స్, డన్‌జో, ర్యాపిడో, పోర్టర్, ఓలా, జీప్ వంటి థర్డ్ పార్టీ లాజిస్టిక్స్ (3పీఎల్) భాగస్వాములకు ఇది అగ్రిగేటర్‌గా వ్యవహరిస్తుంది. అలాగే నిర్దిష్ట సెగ్మెంట్లకు సంబంధించి క్విక్ కామర్స్ సర్వీస్‌లను కూడా వెలాసిటీ అందిస్తుంది. తమ భాగస్వాములు, అధునాతన టెక్నాలజీ సహాయంతో ఇప్పటికే తాము కేఎఫ్‌సీ, బర్గర్ కింగ్ తదితర 20 పైగా వ్యాపార సంస్థలకు సేవలు అందిస్తున్నామని, రోజుకు 5,000 ఆర్డర్లను డెలివర్ చేస్తున్నామని మ్యాజిక్‌పిన్ సీఈవో అన్షు శర్మ తెలిపారు.

## ఆదిత్య బిర్లా క్యాపిటల్‌లో 'ఫైనాన్స్' విలీనం!

ముంబై: అనుబంధ సంస్థ ఆదిత్య బిర్లా ఫైనాన్స్ (ఏబీఎఫ్)ను విలీనం చేసుకోనున్నట్లు ఆదిత్య బిర్లా క్యాపిటల్ (ఏబీసీ) వెల్లడించింది. విలీనం తర్వాత ఏబీసీ హోదా హోల్డింగ్ కంపెనీ స్థాయి నుంచి ఆపరేటింగ్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీగా (ఎన్‌బీఎఫ్‌సీ) మారుతుందని తెలిపింది. ఆర్థికంగా మరింత పటిష్టమైన సంస్థగా ఎదిగేందుకు, వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు ఇది దోహదపడగలదని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. రుణాలు, పెట్టుబడులు, ఇన్సూరెన్స్ తదితర కార్యకలాపాలు నిర్వహించే ఏబీసీ నిర్వహణలో రూ. 4.10 లక్షల కోట్ల విలువ చేసే అసెట్స్ (ఏయూఎం) ఉన్నాయి.

# రూపాయిలో వాణిజ్యానికి పలు దేశాల ఆసక్తి

## కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ: పలు వర్ధమాన దేశాలు, సంపన్న దేశాలు భారత్‌తో రూపాయి మారకంలో వాణిజ్యం చేయడానికి ఆసక్తి చూపుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ విధానంలో లావాదేవీల వ్యయాలు తగ్గే అవకాశాలు ఉండటమే దీనికి కారణమని పేర్కొన్నారు. శ్రీలంక, బంగ్లాదేశ్‌తో పాటు పలు గల్ఫ్ దేశాలు ఈ జాబితాలో ఉన్నట్లు ఆయన చెప్పారు. 'ఈ విధానాన్ని సత్వరం ప్రారంభించేలా బంగ్లాదేశ్, శ్రీలంక ఇప్పటికే మనతో చర్చలు జరుపుతున్నాయి. పలు గల్ఫ్ దేశాలు కూడా దీనిపై ఆసక్తి చూపుతున్నాయి. దీని వల్ల ఒనగూరే ప్రయోజనాలు తెలిసే కొద్దీ మరిన్ని దేశాలు కూడా ఇందులో చేరొచ్చు. సింగపూర్ ఇప్పటికే కొంత మేర



లావాదేవీలు జరుపుతోంది' అని మంత్రి వివరించారు. ఈ పరిణామం భారత అంతర్జాతీయ వాణిజ్యంలో కొత్త కోణాన్ని ఆవిష్కరించగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత్ ఇప్పటికే నేపాల్, భూటాన్ వంటి పొరుగు దేశాలతో రూపాయి మారకంలో వాణిజ్య లావాదేవీలు నిర్వహిస్తోంది. యూఏఈ నుంచి కొనుగోలు చేసిన క్రూడాయిల్‌కి తొలిసారిగా రూపాయల్లో చెల్లింపులు జరిపింది.

# అదానీతో క్వాల్‌కామ్ సీఈవో క్రిస్టియానో భేటీ

న్యూఢిల్లీ: చిప్‌ల తయారీ దిగ్గజం క్వాల్‌కామ్ సీఈవో క్రిస్టియానో ఆర్ ఎమోన్, అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ సోమవారం సమావేశమయ్యారు. కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు మొదలైన వాటి పాత్ర గురించి ఈ సందర్భంగా చర్చించినట్లు సోషల్ మీడియా సైట్ ఎక్స్‌లో అదానీ పోస్ట్ చేశారు. చెన్నైలో రూ. 177 కోట్లతో ఏర్పాటు చేసిన కొత్త డిజైన్ సెంటర్‌ను మార్చి 14న ఎమోన్ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. వై-ఫై టెక్నాలజీలకు అనుబంధ ఆవిష్కరణలు లక్ష్యంగా కొత్త సెంటర్ వైర్‌లెస్ కనెక్టివిటీ సొల్యూషన్స్‌ను ఈ సెంటర్ రూపొందించనుంది. మరోవైపు, తమ సొంత పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుదుత్పత్తి తదితర విభాగాల అవసరాల కోసం స్వల్ప మొత్తంలో తీసుకున్న 5జీ స్పెక్ట్రంనకు సంబంధించి ఉపయోగపడే సొల్యూషన్స్ కోసం అదానీ అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలో క్రిస్టియానో, అదానీ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.



## భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

## రైల్వే శాఖలో 4660 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ).. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)-రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ (ఆర్‌పీఎస్ఎఫ్)లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4660
» **పోస్టుల వివరాలు:** సబ్-ఇన్‌స్పెక్టర్-452, కానిస్టేబుల్-4208.

**అర్హత**

» **సబ్-ఇన్‌స్పెక్టర్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
**వయసు:** 01.07.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** రూ. 35,400.
» **కానిస్టేబుల్:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
**వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** రూ. 21,700.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**15.04.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.05.2024
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rpf.indianrailways.gov.in/RPF

## ఏపీ ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్).. ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు; అదేవిధంగా 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన బ్యాగ్‌లాగ్ సీట్ల భర్తీకి సంబంధించి ప్రవేశ ప్రకటన వెలువడింది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, విద్య అందిస్తారు. గిరిజన, ఆదివాసీ గిరిజన, సంచార గిరిజన తదితర కేటగిరీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** ఆరో తరగతిలో ప్రవేశాలు పొందాలనుకొనే విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి వరుసగా 6, 7, 8 తరగతుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష మించకూడదు.



» **వయసు:** 31.03.2024 నాటికి ఆరో తరగతికి 10 నుంచి 13 ఏళ్లు, ఏడో తరగతికి 11 నుంచి 14 ఏళ్లు, ఎనిమిదో తరగతికి 12 నుంచి 15 ఏళ్లు, తొమ్మిదో తరగతికి 13 నుంచి 16 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 13.04.2024.
» **వెబ్‌సైట్:** https://twreiscet.apcfss.in

## ఏపీ ఐటీఐల్లో 71 అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒప్పంద ప్రాతిపదికన ఉపాధి మరియు శిక్షణా శాఖ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్(ఏటీవో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 71
» **జోన్‌ల వారీగా ఖాళీలు:** జోన్1-06, జోన్2-08, జోన్3-03, జోన్4-54.
» **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ సివిల్, వైర్‌మాన్, సీవోపీఏ, డ్రెస్ మేకింగ్, మెకానిక్ మోటార్ వెహికల్, కార్పెంటర్, వర్క్‌షాప్ కాలిక్యులేషన్ అండ్ సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్.
» **కాల వ్యవధి:** 11 నెలలు.
» **వేతనం:** రూ.35,570.
» **అర్హత:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. అలాగే సంబంధిత విభాగంలో బి.వొకేషనల్/డిగ్రీ/ డిప్లొమా / ఎన్‌టీసీ/ ఎన్‌సీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డెమో, అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
» **వయసు:** 30.09.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.03.2024.
» **వెబ్‌సైట్:** https://detrecruitments.apcfss.in

## టీఎస్ ఐసెట్-2024

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(టీఎస్‌సీహెచ్ఈ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ఐసెట్)-2024 నోటిఫికేషన్ విడుదలచేసింది. పరీక్షను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ (కేయూ) నిర్వహించనుంది. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రంలో కింది పేర్కొన్న యూనివర్శిటీలలో ప్రవేశాలు పొందవచ్చు.

» **అర్హత:** ఎంబీఏకు కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఎంసీఏకు కనీసం 50శాతం మార్కులతో ఇంటర్/డిగ్రీ స్థాయిలో మ్యాథ్స్ సబ్జెక్ట్‌తో బీసీఏ/బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుం లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 17.05.2024 నుంచి 20.05.2024 వరకు
» **పరీక్ష తేదీలు:** 2024 జూన్ 4, 5 తేదీల్లో
» **వెబ్‌సైట్:** https://icet.tsche.ac.in

## ఏపీ ఆర్‌డీసీసెట్-2024

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఆర్ఈఐఎస్).. పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ(ఇంగ్లిష్ మాధ్యమం) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌డీసీ) సెట్-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన విద్యార్థులు(బాలురు) నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 152
» **గ్రూపు-సీట్లు:** బీఏ(హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్)-40 సీట్లు, బీకాం-40 సీట్లు, బీఎస్సీ(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)-36 సీట్లు, బీఎస్సీ(మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్)-36 సీట్లు.
» **అర్హత:** 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కామన్ ఎంట్రన్స్ టెస్ట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 25.04.2024.
» **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in

# రైల్వేలో టెక్నీషియన్ కొలువులు

» 9,144 పోస్టుల భర్తీకి రైల్వే శాఖ నోటిఫికేషన్
» ఆన్‌లైన్ రాత పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ

**భారతీయ రైల్వే దేశంలోని పలు రైల్వే జోన్ల పరిధిలో.. టెక్నికల్ విభాగాల్లో.. భారీ ఎత్తున కొలువుల భర్తీకి రంగం సిద్ధం చేసింది! మొత్తం 9,144 పోస్టులతో తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిల్లో టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులు 1092 ఉండగా.. టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులు 8052 ఉన్నాయి. వీటికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ 8వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆర్ఆర్‌బీ టెక్నికల్ పోస్టులు, ఎంపిక విధానం, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..**

రైల్వే శాఖ భారీ సంఖ్యలో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయా పోస్టులకు వేర్వేరు అర్హతలు పేర్కొన్నారు. సంబంధిత అర్హతలున్న అభ్యర్థులు ఆన్‌లైన్ రాత పరీక్షలో ప్రతిభ చూపితే రైల్వేలో కొలువుదీరొచ్చు.

**అర్హతలు**

- టెక్నీషియన్ గ్రేడ్ 1సిగ్నల్ పోస్టులకు బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా (ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్‌సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
- టెక్నీషియన్ గ్రేడ్3 పోస్టులకు మెట్రిక్యులేషన్, ఎస్ఎస్ఎల్‌సీ,ఐటీఐ లేదా 10+2 ఉత్తీర్ణత ఉండాలి.

**వయసు**

01.07.2024 నాటికి టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులకు 18-36 ఏళ్ల మధ్య ఉండాలి. టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

**ప్రారంభ వేతనం**

టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులకు నెలకు రూ.29,200, టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు నెలకు రూ.19,900 ప్రారంభ వేతనం లభిస్తుంది.

**ఎంపిక ప్రక్రియ ఇలా**

- టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులకు, టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ అప్టిట్యూడ్ టెస్ట్) నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా తుది ఎంపిక చేపడతారు.
- టెక్నీషియన్ గ్రేడ్-1(సిగ్నల్).. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) వంద మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు-10 మార్కులు,జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 15 ప్రశ్నలు-15 మార్కులు,బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్స్ అండ్ అప్లికేషన్స్ 20 ప్రశ్నలు-20 మార్కులు,




మ్యాథమెటిక్స్ 20 ప్రశ్నలు-20 మార్కులు, బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 35 ప్రశ్నలు-35 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 90 నిమిషాలు.

- టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు.. నిర్వహించే రాత పరీక్ష వంద మార్కులకు ఉంటుంది. ఇందులో మ్యాథమెటిక్స్ 25 ప్రశ్నలు-25 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 25 ప్రశ్నలు-25 మార్కులు, జనరల్ సైన్స్ 40 ప్రశ్నలు-40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు-10 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.

**పదోన్నతులతో ఏఈఈ స్థాయికి**

టెక్నీషియన్ గ్రేడ్-1 (సిగ్నల్), టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులలో నియమితులైన వారు భవిష్యత్తులో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ హోదాకు చేరుకునే అవకాశం ఉంది. తొలుత సీనియర్ టెక్నీషియన్‌గా పదోన్నతి లభిస్తుంది. ఆ తర్వాత జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్ట్ వరకు చేరుకోవచ్చు. ఇందుకోసం ఆర్ఆర్‌బీలు అంతర్గతంగా నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. సీనియారిటీ ప్రాతిపదికగా ఏఈఈ వరకు చేరుకోవచ్చు.

### రాత పరీక్షల్లో రాణించేలా

**మ్యాథమెటిక్స్**

నంబర్ సిస్టమ్, బాడ్‌మాస్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్; రేషియో అండ్ ప్రపోర్షన్; పర్సంటేజెస్, మెన్సురేషన్; టైం అండ్ వర్క్; టైం అండ్ డిస్టెన్స్; ఇంట్రెస్ట్; ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, జామెట్రీ, కేలండర్ అండ్ క్లాక్‌పై పట్టు సాధించాలి. వీటికోసం తొలుత పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాల్లో ఉన్న సిలబస్‌లోని అంశాలకు సంబంధించిన ప్రాథమిక భావనలపై అవగాహన పెంపొందించుకోవాలి.అదే విధంగా బ్యాంకు, ఎస్ఎస్‌సీ, రైల్వే పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.

**జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్**

అనాలజీస్, ఆల్ఫాబెటికల్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, జంబ్లింగ్, వెన్‌డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సఫీషియెన్సీ; కన్‌క్లూజన్ అండ్ డెసిషన్ మేకింగ్; సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్; అనలిటికల్ రీజనింగ్; క్లాసిఫికేషన్; డైరెక్షన్స్ తదితర అంశాలపై దృష్టి సారించాలి.

**జనరల్ అవేర్‌నెస్**

- జాతీయ,అంతర్జాతీయ ప్రాధాన్యమున్న కరెంట్ అఫైర్స్, క్రీడలు, భారత చరిత్ర, సంస్కృతి, ముఖ్యమైన చారిత్రక ప్రదేశాలు, జనరల్ సైన్స్-లైఫ్ సైన్స్ (పదో తరగతి స్థాయి), స్వాతంత్య్ర ఉద్యమం, జాగ్రఫీ, రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్షం, భారత అణు కార్యక్రమం, ఐక్యరాజ్యసమితి, ఇతర ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థలు, పర్యావరణ అంశాలు, కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, దేశంలో రవాణా వ్యవస్థ, భారత ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- **మెంటల్ ఎబిలిటీ:** ఇందులో అనాలజీస్, నంబర్ సిరీస్, కోడింగ్, డీ కోడింగ్, రిలేషన్‌షిప్స్, సిలాజిజమ్, జంబ్లింగ్, వెన్ డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్-ఆర్గ్యుమెంట్స్‌పై దృష్టి సారించాలి.

**జనరల్ సైన్స్**

యూనిట్స్, ఫోర్స్, ప్రెజర్; మెకానిక్స్, సౌండ్, హీట్, లైట్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, మోడర్న్ ఫిజిక్స్ తదితర అంశాల్లోని బేసిక్ కాన్సెప్టులు, సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి. కెమిస్ట్రీలో ఆటమ్స్, మాలిక్యూల్స్, యాసిడ్స్, బేసెస్, మెటల్స్ అండ్ నాన్ మెటల్స్; కార్బన్ కాంపౌండ్స్, మెటలర్జీ తదితర అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా లైఫ్ సైన్సెస్‌కు సంబంధించి హ్యూమన్ బాడీ, విటమిన్లు, న్యూట్రిషన్, నెర్వస్ సిస్టమ్, హార్మోన్లు, ఎంజైమ్‌లు, సూక్ష్మజీవులు, వ్యాధులు, టీకాలు, పర్యావరణం తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

**బేసిక్ సైన్స్, ఇంజనీరింగ్**


ఇంజనీరింగ్ డ్రాయింగ్ (ప్రొజెక్షన్స్, వ్యూస్, డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, లైన్స్, జామెట్రిక్ ఫిగర్స్, సింబాలిక్ రిప్రెజెంటేషన్స్), యూనిట్స్, మెజర్‌మెంట్స్; మాస్ వెయిట్ అండ్ డెన్సిటీ; వర్క్ పవర్ అండ్ ఎనర్జీ; స్పీడ్ అండ్ వెలాసిటీ; హీట్ అండ్ టెంపరేచర్; బేసిక్ ఎలక్ట్రిసిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 8
- సీబీటీ-1: అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం
- సీబీటీ-2: డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.rrbsecunderabad.gov.in

# విదేశీ విద్య.. బీసీలకు మిథ్య!

- ఏటా వస్తున్న దరఖాస్తులు వేలల్లో.. మంజూరు మాత్రం పదుల్లోనే..
- బీసీ సంక్షేమ శాఖ ద్వారా విద్యానిధి పథకానికి ఏటా 300 మంది ఎంపిక
- ఇందులో ఈబీసీలకు 15 యూనిట్లు.. మిగతా 285 యూనిట్లు ఇతర కులాలకు..
- అత్యధికంగా మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా 500 మందికి అవకాశం కల్పిస్తున్న ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలని భావిస్తున్న ప్రతిభావంతులైన బీసీ విద్యార్థులకు తగిన స్థాయిలో సాయం అందడం లేదు. ఏటా వేలాది మంది విదేశీ విద్యకు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకుంటున్నా.. సాయం అందుతున్నది మాత్రం కొంత మందికే. దీంతో ఎంతో ప్రతిభ ఉన్నా సరైన అవకాశం రాని పరిస్థితి ఉందని బీసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. విదేశీ విద్య కోసం ప్రభుత్వం మరింత ఎక్కువ మందికి ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు. బీసీ సంక్షేమ శాఖ కూడా ఈ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

### సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో పథకం..

విదేశాల్లో ఉన్నత విద్య చదవగోరే ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. సంక్షేమ శాఖల ద్వారా అమలు చేస్తున్న ఈ పథకానికి మొదట్లో ప్రభుత్వం శాఖల వారీగా నిర్దేశించిన యూనిట్ల సంఖ్యకు దాదాపు సమానంగా దరఖాస్తులు వచ్చేవి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల్లో యూనిట్ల సంఖ్య కంటే తక్కువేరాగా.. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో మాత్రం దరఖాస్తులు రెండు, మూడింతలు వచ్చేవి. తర్వాత ఈ పథకం పట్ల అవగాహన, విదేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లాలనుకునే వారి సంఖ్య పెరిగాయి. దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల్లో పోటీసగటున 1 : 1.5లోపేఉండగా.. బీసీ సంక్షేమశాఖ పరిధిలో మాత్రం ఒక్కో యూనిట్‌కు 20కిపైగా పోటీపడుతున్నారు.

### ఏటా రెండు సెషన్లలో ఎంపిక..

విదేశీ విద్యానిధి పథకం కింద సంక్షేమ శాఖలు ఏటా సెప్టెంబర్, జనవరిలలో రెండు దఫాలుగా విద్యార్థుల ఎంపికను చేపడుతున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించి, డిగ్రీ/తత్సమాన కోర్సులో మార్కులు, జీఆర్‌ఈ/జీమ్యాట్ మార్కులు, ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఆధారంగా మెరిట్ విద్యార్థులను ఎంపిక చేస్తున్నాయి. ఇందుకోసం సంక్షేమ శాఖల వారీగా ప్రత్యేకంగా కమిటీలు ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖల పరిధిలో పోటీ తక్కువగా ఉండటంతో అర్హుల ఎంపిక సాధారణంగా నిర్వహిస్తుండగా... బీసీ సంక్షేమశాఖ పరిధిలో విపరీతమైన పోటీ ఉండటంతో బీసీ-ఏ, బీ, సీ, డీ, ఈ కేటగిరీల వారీగా కోటాను విభజిస్తూ అర్హుల ఎంపిక చేపడుతున్నారు. దీనితో మెరిట్ ఉన్నా చాలా మంది విద్యార్థులు పథకానికి ఎంపిక కాలేకపోతున్నారు.

### కోటా పెంపునకు ప్రతిపాదనలు...

జనాభాను బట్టి చూస్తే.. మిగతా కేటగిరీల కంటే బీసీలకు తక్కువగా విదేశీ విద్యానిధి ఇస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. తక్కువ జనాభా ఉన్న మైనార్టీ వర్గానికి 500, ఎస్సీలకు 210, ఎస్టీలకు 100 యూనిట్లు ఉంటే.. 50శాతానికిపైగా జనాభా ఉన్న బీసీలకు 300 యూనిట్లే ఉన్నాయని అంటున్నారు. ఇందులోనూ ఈబీసీలకు 15 యూనిట్లు ఇస్తున్నారని చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఎక్కువ మంది బీసీ విద్యార్థులకు విదేశీ విద్యానిధి పథకం వర్తింపజేయాలని విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఇతర బీసీ సంఘాల నేతలు దీనిపై ఇప్పటికే సీఎం, మంత్రులు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో బీసీలకు విదేశీ విద్యానిధి యూనిట్లు పెంచేలా బీసీ సంక్షేమశాఖ ప్రతిపాదనలు తయారు చేసినట్టు సమాచారం. ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను ఆమోదిస్తే.. మరింత మంది బీసీలకు విదేశీ విద్య అవకాశం వస్తుందని అధికారవర్గాలు చెప్తున్నాయి.

**విదేశీ విద్యానిధి పథకం కింద యూనిట్లు**

| శాఖ | పథకం పేరు | ఏటా ఎందరికి.. | పోటీ నిష్పత్తి |
|---|---|---|---|
| మైనార్టీ | సీఎం ఓవర్సీస్ విద్యానిధి | 500 | 1 : 1.5 |
| బీసీ | మహాత్మాజ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి | 300 | 1 : 20 |
| ఎస్సీ | అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి | 210 | 1 : 1.25 |
| ఎస్టీ | అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి | 100 | 1 : 1.25 |

# మా నోట్లో 'ఆల్మట్టి' కొట్టొద్దు!

- జీ-సీ అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనలపై రాష్ట్రం అభ్యంతరం
- ఆల్మట్టి నుంచి కర్ణాటకకు 16 టీఎంసీల కేటాయింపులను అంగీకరించం
- ఎన్‌డబ్ల్యూడీఏకు తెలంగాణ ప్రభుత్వం లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరీ (జీ-సీ) అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా ఆల్మట్టి జలాశయం నుంచి కర్ణాటకకు 16 టీఎంసీలను కేటాయిస్తామని కేంద్రం చేసిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఈ ప్రతిపాదనను ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తాజాగా (ఎన్‌డబ్ల్యూడీఏ) డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్‌కు లేఖ రాశారు. ఆల్మట్టి నుంచి కర్ణాటకకు నీళ్లను కేటాయిస్తే, దిగువన ఉన్న జూరాలకు వరద తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా తరలించే 148 టీఎంసీల్లో 50 శాతం వాటాను తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్రానికి 45.06 టీఎంసీలను ప్రతిపాదించి, ముసాయిదా డీపీఆర్‌లో 41.21 టీఎంసీలకు తగ్గించడాన్ని తప్పుబట్టారు. అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా తుపాకులగూడెం (సమ్మక్కసాగర్) బ్యారేజీకి ఎగువన 12 కిలోమీటర్ల దూరంగా ఇచ్చంపల్లి వద్దే బ్యారేజీ కట్టాలని ఎన్‌డబ్ల్యూడీఏ చేసిన ప్రతిపాదనలపై అభ్యంతరం తెలిపారు. సమ్మక్కసాగర్ బ్యారేజీ బ్యాక్‌వాటర్ పరిధిలో ప్రతిపాదిత బ్యారేజీ వస్తుందని, దీంతో సమ్మక్కసాగర్ నిల్వ సామర్థ్యం తగ్గించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

# 17 వరకు ధరణి స్పెషల్ డ్రైవ్

▶ మొదటి పేజీ తరువాయి

ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, భూమి సునీల్ తెలిపారు. సోమవారం సచివాలయంలోని మీడియా పాయింట్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో పేరుకుపోయిన దరఖాస్తుల పరిష్కారం కోసమే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఈ డ్రైవ్‌ను ప్రభుత్వం మరో వారం రోజులు పొడిగించిందని చెప్పారు. అయితే ధరణి దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం నిరంతరం జరగాల్సిందేనన్నారు. గతంలో కలెక్టర్లు మాత్రమే ఈ దరఖాస్తులను పరిష్కరించేవారని, ఇప్పుడు తహశీల్దార్, ఆర్డీవోల స్థాయిలో అధికార వికేంద్రీకరణ జరపడమే కాకుండా, పరిష్కారానికి నిర్దేశిత టైంలైన్ విధించామని తెలిపారు. ధరణి పోర్టల్ విషయంలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని, మార్పులు తీసుకు వచ్చేందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. అయితే ప్రస్తుతం ఉన్న అవకాశాల పరిధిలో సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. ధరణి పోర్టల్‌కు సంబంధించి దీర్ఘకాలిక పరిష్కారంపై ప్రభుత్వానికి నివేదికలిస్తామని, ఆ మేరకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని అన్నా రు. ప్రస్తుతం చేపడుతున్నవి తాత్కాలిక చర్యలు మాత్రమేనని, 2, 3 నెలల్లో శాశ్వత పరిష్కారాలు సిఫారసు చేస్తామని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని మాజీ ఎంపీ సంతోశ్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని, నిషేధిత జాబితాలోని భూములను కూడా రాత్రికి రాత్రి బదలాయించుకున్నారని కోదండరెడ్డి ఆరోపించారు.

### 20 కల్లా అన్ని లాగిన్‌లిస్తాం..

**పోర్టల్ నిర్వహణ కంపెనీ హామీ**

**'సాక్షి' కథనంపై ఉన్నతస్థాయి వర్గాల ఆరా**

'ధరణి పరిష్కారం పేపర్ పైనే'శీర్షికన సోమవారం 'సాక్షి'ప్రచురించిన కథనం రెవెన్యూ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. స్పెషల్ డ్రైవ్‌లోని పరిష్కారాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్న తీరుపై కూడా చర్చ జరిగింది. ఉన్నత స్థాయి అధికార వర్గాలు కూడా ఈ కథనంపై ఆరా తీశాయి. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జరుగుతున్న పరిష్కార ప్రక్రియ తీరును రెవెన్యూ వర్గాలను అడిగి తెలుసుకున్నాయి. కాగా దరఖాస్తుల పరిష్కారం కోసం అవసరమైన లాగిన్‌లను ఈ నెల 20వ తేదీ కల్లా ఇస్తామని, తద్వారా కాగితంపై ప్రస్తుతం ఉన్న ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో నమోదవుతాయని ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న కంపెనీ వెల్లడించినట్టు సమాచారం. ఇదిలావుండగా, ప్రతి దరఖాస్తుపై తహశీల్దారు నివేదిక తప్పనిసరి అని, అనుమతి ఇచ్చినా, తిరస్కరించినా సదరు కారణాలను వివరిస్తూ ప్రత్యేక రిపోర్టును అప్‌లోడ్ చేయాల్సిందేనని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.

# నటుడు, దర్శకుడు సూర్యకిరణ్ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: నటుడు, దర్శకుడు, నిర్మాత సూర్యకిరణ్ (49) కన్నుమూశారు. కొద్ది రోజులుగా పచ్చ కామెర్లతో బాధపడుతున్న ఆయన సోమవారం మధ్యాహ్నం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. సూర్యకిరణ్ అసలు పేరు సురేశ్. కేరళలోని తిరువనంతపురానికి చెందిన టి.ఎస్.మణి, రాధలకు 1974లో సూర్యకిరణ్ జన్మించారు. 'స్నేహికన్ ఒరు పెన్ను' (1978) అనే మలయాళ చిత్రం ద్వారా బాలనటుడిగా చిత్రపరిశ్రమలో అడుగుపెట్టారు సూర్యకిరణ్. మలయాళం, తమిళం, తెలుగు భాషల్లో దాదాపు 200కుపైగా చిత్రాల్లో బాలనటుడిగా, సహాయ నటుడిగా పాపులర్ అయ్యారు. ఆ తర్వాత తన పేరును సూర్యకిరణ్‌గా మార్చుకుని తెలుగులో సుమంత్ హీరోగా నటించిన 'సత్యం'(2003) చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు. హీరో నాగార్జున నిర్మించిన ఈ సినిమా ఘన విజయం సాధించింది. ఆ తర్వాత 'ధన 51, బ్రహ్మాస్త్రం, రాజు భాయ్'చిత్రాలకు దర్శకత్వం వహించారు సూర్యకిరణ్. 'చాప్టర్ 6'సినిమాని స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. అయితే ఆ చిత్రం పరాజయం కావడంతో ఆయనను ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. తాజాగా తమిళంలో వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'అరసి'చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. బిగ్ బాస్ తెలుగు సీజన్-4 లోనూ కంటెస్టెంట్‌గా పోటీపడ్డారు సూర్యకిరణ్. నటి కల్యాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ ఆ తర్వాత మనస్పర్థల కారణంగా వారు విడిపోయారు. సూర్యకిరణ్ సోదరి సుజిత కూడా నటే. తెలుగు, తమిళ చిత్రాలు, సీరియల్స్ ద్వారా ఆమె సుపరిచితురాలే. సూర్యకిరణ్ మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. కాగా మంగళవారం చెన్నైలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

# సికింద్రాబాద్-విశాఖ మధ్య మరో వందేభారత్

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని
- దేశవ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- కిషన్‌రెడ్డి హర్షం.. ప్రధాని, రైల్వే మంత్రికి కృతజ్ఞతలు



సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మూడోది, సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రెండో వందేభారత్ రైలును మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దాదాపు రూ.85 వేల కోట్ల విలువైన పలు రైల్వే అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం చుట్టనున్నారు. 55 వన్ స్టేషన్ - వన్ ప్రొడక్ట్ స్టాళ్లు, మూడు పీఎం గతిశక్తి కార్గో టెర్మినళ్లు, నాలుగు గూడ్స్ షెడ్లు, ఒక పీఎం జన్ ఔషధి కేంద్రం, రెండు రైల్ కోచ్ రెస్టారెంట్లు, కాజీపేట్ - బల్లార్షా - కాజీపేట్ - విజయవాడ మధ్య నిర్మిస్తున్న కొత్త ట్రాక్‌లను ప్రధాని ప్రారంభిస్తారని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవాలపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా కొత్త వందే భారత్ రైలు ఈ నెల 13 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.

# మన డిస్కంలకు 'సీ గ్రేడ్'

- దేశంలోని 53 డిస్కంలలో టీఎస్ఎస్పీడీసీఎల్‌కు 44వ ర్యాంకు
- టీఎస్ఎన్పీడీసీఎల్‌కు 46వ ర్యాంక్
- ర్యాంకింగ్స్‌ను ప్రకటించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సోమవారం విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు వార్షిక రేటింగ్స్, ర్యాంకింగ్స్ ప్రకటించింది. ఇందులో ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎన్పీడీసీఎల్/టీఎస్ఎస్పీడీసీఎల్)లు 'సీ గ్రేడ్'ను సాధించాయి. దేశంలోని 53 డిస్కంలకు జాతీయ స్థాయిలో ర్యాంకింగ్స్‌ను ప్రకటించగా.. రాష్ట్రంలోని టీఎస్ఎస్పీడీసీఎల్ 44వ ర్యాంకు, టీఎస్ఎన్పీడీసీఎల్ 46వ ర్యాంకును సాధించాయి. గతేడాది ప్రకటించిన 11వ రేటింగ్స్‌తో పోల్చితే రాష్ట్రంలోని రెండు డిస్కంలు స్వల్ప మెరుగుదలను సాధించాయి. 11వ రేటింగ్స్‌లో రెండు డిస్కంలు 'సీ మైనస్ గ్రేడ్'ను సాధించగా, ఇప్పుడు 'సీ గ్రేడ్'ను సాధించాయి. టీఎస్ఎస్పీడీసీఎల్ 2022-23లో సరఫరా చేసిన విద్యుత్‌కి సంబంధించి యూనిట్‌కు రూ.1.19 పైసలు చొప్పున నష్టపోయి, ఆ ఏడాది మొత్తం రూ.2,956 కోట్ల నష్టాలను మూటగట్టుకుంది. సంస్థ సాంకేతిక, వాణిజ్య నష్టాల మొత్తం(ఏటీ అండ్ సీ) 2021-22తో పోల్చితే 2022-23లో 14.1 శాతం నుంచి 22.2 శాతానికి పెరిగినట్టు కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఇక టీఎస్ఎన్పీడీసీఎల్ 2022-23లో వినియోగదారులకు సరఫరా చేసిన విద్యుత్‌కి సంబంధించి ప్రతి యూనిట్‌కు రూ.1.08 పైసలు చొప్పున నష్టపోయి ఆ ఏడాది మొత్తం రూ.8,147 కోట్ల నష్టాలను చవిచూసింది. సంస్థ ఏటీ అండ్ సీ నష్టాలు సైతం 9.1 శాతం నుంచి 17.2 శాతానికి ఎగబాకాయి.

# రామేశ్వరం పేలుళ్లకు, జగిత్యాల వాసికి లింకు?

**పీఎఫ్ఐ కార్యదర్శి హస్తం ఉన్నట్లు అనుమానాలు**

జగిత్యాల: రామేశ్వరం కేఫ్‌లో జరిగిన బాంబు పేలుళ్లకు జగిత్యాల వాసికి లింకు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కార్యదర్శి, జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ సలీంను ఏపీలోని కడప జిల్లా మైదుకూర్‌లో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అతడికి బెంగళూరులోని కేఫ్ బాంబు పేలుళ్లలో సంబంధం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. సలీంను అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ బెంగళూరు పేలుళ్ల కోణంలో విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

**జగిత్యాలకే లింకు..:** ఉగ్రవాదానికి సంబంధించిన ఏ ఘటన జరిగినా జగిత్యాలకు లింకులు ఉంటున్నాయి. పదేళ్ల క్రితం అజాంఘోరి అనే ఉగ్రవాది పెన్నులు అమ్ముకుంటూ పలు సినిమా థియేటర్లలో బాంబు పేలుళ్లకు ప్రణాళిక రూపొందించగా, పోలీసులు కొత్త బస్టాండ్‌లో ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. కాగా, అబ్దుల్ సలీంను పట్టిస్తే రూ.2 లక్షల నగదు బహుమతిని ఎన్ఐఏ అధికారులు గతంలోనే ప్రకటించారు.

## క్లుప్తంగా...

### కనిపించిన నెలవంక

**నేటినుంచి రంజాన్ ఉపవాస దీక్షలు**

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు దేశవ్యాప్తంగా నెలవంక కనిపించిందని, కాబట్టి ఈనెల 12 మంగళవారం నుంచి రంజాన్ నెల ప్రారంభమవుతుందని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) కన్వీనర్ సయ్యద్ ఇబ్రహీం హుస్సేని సజ్జాద్‌పాషా తెలిపారు. మొజంజాహీ మార్కెట్‌లోని కమిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సోమవా రం నెలవంక నగరంలో కనబడినట్లు నిర్ధారణ అయిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముస్లింలు మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించాలని సూచించారు. రంజాన్ మాసంలో శాంతిపూర్వక వాతావరణంలో ఉపవాస దీక్షలు పాటించాలని పిలుపునిచ్చారు.

### రంజాన్ మాసం ఆదర్శ జీవనానికి ప్రేరణ: సీఎం



సాక్షి, హైదరాబాద్: రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాసాలు, ప్రార్థనలు, క్రమశిక్షణ పాటిస్తారని, పెద్ద ఎత్తున పేదలకు జకాత్, ఫిత్రా పేరుతో దానధర్మాలు చేస్తారని గుర్తుచేశారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందన్నారు. ముస్లింలు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని సీఎం ఆకాంక్షించారు. ముస్లింల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, వారి సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తుందని వెల్లడించారు.

### దీక్షలతో శాంతి, సామరస్యాలు: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రరంజాన్ మాసంలో జరిపే ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతో ప్రజల్లో శాంతి సామరస్య భావనలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. పదేళ్ల ప్రగతి పాలన ద్వారా తెలంగాణను గంగాజమున తెహజీబ్‌కు ప్రతీకగా, దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దామని కేసీఆర్ చెప్పారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించేలా చూడాలని దేవుణ్ని ప్రార్థించారు.

### ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ: కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో చేపట్టే ఉపవాస దీక్షలు, నమాజ్, తరావి (ఖురాన్ పఠనం) జీవితంలో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు.

### హజ్ కమిటీ చైర్మన్‌గా అఫ్జల్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్‌గా సయ్యద్ అఫ్జల్ బియబాని సోమవారం నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో బాధ్యతలు స్వీక రించారు. హజ్ కమిటీని దేశంలోనే అత్యుత్తమ కమిటీగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా బియబాని పేర్కొన్నారు. ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, గతంలో మాదిరిగా హజ్ హౌస్ నుంచే యాత్రికులు నేరుగా విమానాల్లో ప్రయాణించేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈ వో అజ్మతుల్లా హుస్సేనీ, హజ్ కమిటీ ఈవో షేక్ లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌జీఐఏకు మరో అంతర్జాతీయ అవార్డు




శంషాబాద్: రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి అత్యుత్తమ అవార్డు దక్కింది. 2023 సంవత్సరానికి ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎయిర్‌పోర్టు సర్వీస్ క్వాలిటీ సర్వేలో.. ఏటా 15 నుంచి 25 మిలియన్ ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఎయిర్‌పోర్టుల్లో ఆర్‌జీఐఏ అత్యుత్తమ అవార్డును సొంతం చేసుకుందని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. ప్రయాణికుల సంతృప్తి, అనుభవాలు కొలమానంగా ఈ సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ, ప్రయాణికుల సౌకర్యాలకు ఆర్‌జీఐఏ పెద్దపీట వేస్తోందని, మారుతున్న కాలానికి తగ్గట్టుగా సేవలందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌సర్వీస్ క్వాలిటీలో మరోసారి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

### సంజయ్ దీపక్‌రావు కేసులో ఎన్ఐఏ చార్జ్‌షీట్

సాక్షి, హైదరాబాద్: మావోయిస్ట్ సెంట్రల్ కమిటీ సభ్యుడు సంజయ్ దీపక్‌రావుపై జాతీయ దర్యాప్తు సంస్థ నాంపల్లిలోని ఎన్ఐఏ కోర్టులో సోమవారం చార్జ్‌షీట్ దాఖలు చేసింది. 2023 సెప్టెంబర్ 15న కేపీహెచ్‌బీ పీఎస్‌లో నమోదైన కేసు ఆధారంగా ఈ ఏడాది జనవరి 3న ఎన్ఐఏ కేసు రీ రిజిస్టర్ చేసింది. పోలీసులు సీజ్ చేసిన రివాల్వర్, ఫ్యాబ్రికేటెడ్ ఆధార్ కార్డులు, ల్యాప్‌టాప్, నగదుకు సంబంధించిన ఆధారాలు సేకరించింది. సంజయ్ దీపక్‌రావు హింసాత్మక కార్యకలాపాలు నిర్వహించేందుకు పథకం రచించినట్టు పేర్కొంది. ఇందుకోసం అవసరమైన సమావేశాలు, నిధులు, ఆయుధాల సేకరణ చేస్తున్నట్టు తెలిపింది. వెస్టర్న్ ఘాట్స్ స్పెషల్ జోనల్ కమిటీ(మావోయిస్ట్) పేరుతో టెర్రరిస్ట్ క్యాంపులను నిర్వహించినట్టు ఆ చార్జ్‌షీట్‌లో పేర్కొంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 